# విదుషీమణి వెంగమాంబ

సాధారణ సంపాదకులు

**బి.యస్. రెడ్డి (భూమన్)**

సంచాలకులు, తరిగొండ వెంగమాంబ వాఙ్మయప్రాజెక్టు,

"శ్వేత", తి.తి.దే. తిరుపతి.

**రచయిత: శ్రీ ఆంధ్ర శేషగిరిరావు**

ప్రచురణ

కార్యనిర్వహణాధికారి

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2009**

# VIDUṢĪMAṆI VEṄGAMĀMBA
## (A MONOGRAPH ON TARIGOṆḌA VEṄGAMĀMBA)

Written by
Sri Āṇḍra seshagiri Ṛao

T.T.D "SVETA" Religious Publications Series No.

© All Rights Reserved
First Edition: 2009
Copies : 1000

Published by
I.Y.R. Krishna Rao, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati -517 501

D.T.P. SVETA T.T.D

Printed at
TirumalaTirupati Devasthanams Press.
Tirupati.

శ్రీనివాసో విజయతే

# ముందుమాట

**ఐ.వై.ఆర్.కృష్ణారావు, ఐ.ఏ.యస్.,** 27-06-2009
కార్యనిర్వహణాధికారి,
తి.తి.దేవస్థానములు,
తిరుపతి.

కలియుగ ప్రత్యక్ష దైవంగా ప్రశస్తి వహించిన తిరుమల వేంకటేశ్వరుని భక్త బృందంలో ఒక్కొక్కరిది ఒక ప్రత్యేకత! ఆ ప్రత్యేకత ఆ యా భక్తవర్యులు శ్రీ స్వామివారిని ఆరాధించటంలో అనుసరించిన మార్గాల ద్వారా లోకానికి వెల్లడవుతూ వుంటుంది.

అలాంటి భక్తవరేణ్యులలో అగ్రగణ్యురాలు, శ్రీనివాసుని ఆంతరంగిక భక్తశిరోమణి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ. పరమయోగిని (Woman Saint)గా, భక్త కవయిత్రిగా విలసిల్లిన ఈ సాహితీమూర్తి విశిష్టతను గుర్తించిన తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం ఆమె పేరిట ఒక వాఙ్మయ పీఠాన్ని రెండేళ్లక్రిందట "శ్వేత" భవనంలో నెలకొల్పింది.

"తరిగొండ వెంగమాంబ వాఙ్మయ ప్రాజెక్టు" - అనే పేరుతో ఏర్పడిన ఈ వాఙ్మయ పీఠం కేవలం రెండు సంవత్సరాల కాలపరిమితిలోనే ప్రశంసింపదగ్గ ప్రగతిని సాధించడం ముదావహమైన సంగతి!

ఈ వాఙ్మయ ప్రాజెక్టు భక్త కవయిత్రి 22 రచనలను ప్రచురించి వుండటం, అలాగే ఈ కవయిత్రి భక్తిరస భరిత గేయాలతో కూడిన 12 ఆడియో సి.డి.లను విడుదల చేయటం అభినందనీయం! అదే విధంగా ఈ మహాకవయిత్రి జయంతి, వర్ధంతి - ఉత్సవాలను, ఆంధ్రదేశంలోని తిరుపతి, హైదరాబాదు, విశాఖపట్నం, కాకినాడ, అనంతపురం, విజయవాడలాంటి అనేక ముఖ్య నగరాలలో సాహితీ సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడం నిజంగా ఆహ్లాదకరమైన సమాచారం!

అపూర్వమైన ఈ వాఙ్మయ ప్రగతికంతటికి మూల కారణమైన ఏకైక వ్యక్తి తి.తి.దే. శ్వేత సంస్థ సంచాలకులు ఈ వాఙ్మయ ప్రాజెక్టు డైరెక్టరు-అయిన సుగృహీత నామధేయులు శ్రీ భూమన్ గారు. వారి కార్యదీక్షాదక్షతను నేను ఈ సందర్భంగా హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను.

ఈ ప్రాజెక్టు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 192వ వర్ధంతి ఉత్సవ సందర్భంగా ఈ క్రింది మూడు విశిష్ట గ్రంథాలను వెలువరిస్తున్నది:-

1) **శివ నాటకము (యక్షగానము)**- మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ
2) **భక్త కవయిత్రి తరిగొండ వెంగమాంబ (బుఱ్ఱకథ)**- విద్వాన్ జి. సుబ్రహ్మణ్యశాస్త్రి
3) **విదుషీమణి వెంగమాంబ** - శ్రీఆంధ్ర శేషగిరిరావు

తరిగొండ వెంగమాంబ కృతులనన్నింటిని పరిష్కరించటంలో అనుభవం గడించిన ఈ వాఙ్మయ ప్రాజెక్టు పరిష్కర్త ఆచార్య కె.జె.కృష్ణమూర్తిగారు 73 ఏండ్లు మీరిన వయసులో అముద్రితమైన, అపూర్వమైన ఈ శివ నాటక యక్షగానాన్ని అనేక వ్రాతప్రతుల సాహాయ్యంతో ప్రశంసనీయమైన రీతిలో పరిష్కరించి, సాహితీ ప్రియులకు, భక్త జనావళికి అందజేస్తున్నందులకు చాలా సంతోషంగా వుంది.


అలభ్యమైన ఈ కవయిత్రి రచనలను కూడా ఇలాగే సేకరించి, ఆచార్య కె.జె.కృష్ణమూర్తిగారు చక్కగా పరిష్కరించి ప్రచురింపగలరని ఆశంసిస్తున్నాను.

మునుపటి పుస్తకాల మాదిరిగానే శివ నాటకం మొదలైన ఈ మూడు ప్రచురణలను సహృదయులైన పాఠకావళి సమాదరిస్తారని నా నమ్మకం.

ఈ రచనలు సహృదయులైన పాఠకుల హృదయాల్లో ఆనందాన్నీ, 'ఆనందనిలయుని' యెడల భక్తి ప్రపత్తులనూ పెంపొందింప గలవని మా ఆశయం.

29.6.09.

ఐ.వై.ఆర్.కృష్ణారావు, ఐ.ఏ.యస్.,



# అభినందన

"భూమన్" 16.07.2009

సంచాలకులు,
మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వాఙ్మయప్రాజెక్టు,
"శ్వేత", తి.తి.దేవస్థానములు, తిరుపతి.

అధ్యాత్మిక విప్లవయోగిని, ప్రజా కవయిత్రి అయిన తరిగొండ వెంగమాంబ జీవితం ఎంత ఉన్నతమైనదో, ఆమె సృజించిన సాహిత్యం అంత విశిష్టమయినది. ఆ ఔన్నత్యాన్నీ, ఆ వైశిష్ట్యాన్నీ గత (20వ) శతాబ్ది ఆరంభంలోనే గుర్తించిన మనీషిసత్తముడు శ్రీ ఆంధ్ర శేషగిరిరావు (1904?-2001) గారు.

బహు భాషావేత్త, బహు గ్రంథరచయిత, కళాహృదయుడు, ఉత్తమ పరిశోధకుడు, ఆదర్శ అధ్యాపకుడు, సహస్రాధిక మాస జీవి అయిన శేషగిరిరావుగారు వెంగమాంబ రచనలలో అగ్రగణ్యమైనదైన శ్రీ భాగవత ద్విపద కావ్యాన్ని 1931లో "గృహలక్ష్మి" మాసపత్రికలో ప్రచురించటానికి శ్రీకారం చుట్టినారు. అప్పట్లో ఆయన ఆ సాహిత్య పత్రికకు సంపాదకుడుగా ఉన్నాడు.

'ఆంధ్ర'వారు రచించిన అనేక గ్రంథాల్లో "ఆంధ్ర విదుషీమణులు" అనేది ఆ కోవలో తెనుగున వెలువడిన రచనలన్నింటిలోకీ ప్రశస్తమైనది. ఆ బృహద్గ్రంథంలో చోటుచేసికొనివున్న అనేకానేక విదుషీమణుల చరిత్రల్లో కాలక్రమానుసారిగా వెంగమాంబ జీవితగాథ 16వదిగా నెలకొనివుంది.

ఈ మహాకవయిత్రి జీవితము, సాహిత్యము - అనే రెండు ముఖ్యాంశాలను సోదాహరణంగా, సమన్వయ పూర్వకంగా వివరిస్తూవున్న ఈ విపుల వ్యాసం (Monograph) వెంగమాంబ రచనలపై పరిశోధనలు కొనసాగించే వాళ్ళకే గాక, సాహితీ పిపాసువుల కందరికీ అవశ్యము అత్యంతాసక్తితో పఠింపదగివుంది.

అరుదైన ఈ రచనను ప్రచురణకు అర్హమైనదిగా సూచించిన తరిగొండ వెంగమాంబ వాఙ్మయ ప్రాజెక్టు పరిష్కర్త ఆచార్య కె.జె.కృష్ణమూర్తి గారిని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను.

వెంగమాంబ జీవితానికీ, సాహిత్యానికీ సంబంధించిన విలువైన విషయాలను వెల్లడించే ఇలాంటి పుస్తకాలను, వ్యాసాలను - తెలుగులోనేగాక, ఆంగ్లంలోనూ నెలకొనివున్న వాటిని - ఈ వాఙ్మయ ప్రాజెక్టు ప్రచురించ సంకల్పించిందని తెలుపటానికి సంతోషిస్తున్నాను.

జిజ్ఞాసువులయిన పాఠకులకు, అక్షరాస్యులందరికీ ఈ ప్రచురణ ఆహ్లాదకారి కాగలదని భావిస్తున్నాను.

భూమన్

**భూమన్**

# ప్రశంస

"శ్రీ తరిగొండ లక్ష్మీనృసింహ కరుణా కటాక్ష కవిత కవితా విలాస" మాతృశ్రీ వెంగమాంబ. ఆ సహజ సాహితీమూర్తి ఆంధ్రవిదుషీమణుల్లో అగ్రగణ్యురాలు. విశిష్టమైన ఈ వాఙ్మయ సత్యాన్ని ప్రథమతః నిరూపిస్తూవున్న ప్రత్యేక రచన ఈ "విదుషీమణి వెంగమాంబ".

దీని రచయిత కీ.శే. ఆంధ్ర శేషగిరిరావుగారు ఇంచుమించు ఇరువదవ శతాబ్ది అంతా వాఙ్మయ వ్యవసాయం సాగించిన అపూర్వ సారస్వత కృషీవలుడు! ఆయన రచించిన అనేక గ్రంథాల్లో "ఆంధ్ర విదుషీమణులు" అనేది ప్రశస్తమైన రచన. ఆ బృహద్గ్రంథం నుండి స్వీకరించి, రూపొందించిన కృతి ఈ "విదుషీమణి వెంగమాంబ".

ఇందులో ఆ మహాకవయిత్రి జీవితము, ఆమె సృజించిన సారస్వతము - అనే రెండు ముఖ్య విషయాలు సముచిత రీతిలో సొంపుగా ఆవిష్కరింపబడివున్నాయి. ఇందుకు సంబంధించిన వివిధాంశాలను సేకరించే నిమిత్తంగా రచయిత స్వయంగా ఆ యా చోట్లకు వెళ్లి, ఆసక్తితో పరికించాడు; అలాగే, లభించే ముద్రిత, అముద్రిత రచనలను క్షుణ్ణంగా పరిశీలించాడు. అలా, తన పరిశోధనలో వెల్లడయిన విశేషాల నన్నింటినీ క్రమానుసారంగా క్రోడీకరించి, సరళమైన శైలిలో సోదాహరణంగా ఇందులో విశదీకరించాడు.

అంతేగాక, ఆంధ్రకవుల చరిత్ర కారుడు కందుకూరి వీరేశలింగం పంతులు మొదలుకొని, ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్రకారుడు ఆచార్య యస్వీ జోగారావు వరకు గల ఇంచుమించు ఇరువది మంది ప్రసిద్ధ పరిశోధక వతంసుల అమూల్యాభిప్రాయాలను సందర్భానుగుణంగా ఉట్టంకించి, ఈ కవయిత్రీమతల్లి యొక్క సారస్వతమూర్తిమత్త్వాన్ని (Literary Personality) విశిష్టంగా విరాజిల్ల జేసినాడు!

ఇందులో వెంగమాంబిక వైదుష్యాన్ని చాటుతూవున్న ఒకటి రెండు వాక్యాలు ఇక్కడ ఉదాహరింప దగి వున్నాయి:-

*i) "వెంగమ్మ భగవద్దర్శన ప్రాప్తి నందిన ఆంధ్ర కవయిత్రీమణి. ఆమె మహాయోగిని, పండితురాలు, తత్త్వార్థ వివేకిని."*

*ii) సంస్కృతాంధ్రములందు సమముగా కవిత చెప్పగల నేర్పు ఆంధ్రవిదుషీమణులలో రామభద్రాంబ, వెంగమాంబలకు ఇరువురకు మాత్రమే లెన్నగ గలదని చెప్పవచ్చును.*

*iii) "సంస్కృతాంధ్రములందు సమముగా కవితాసామర్థ్యమును ప్రదర్శించిన ఆంధ్రవిదుషీమణులలో తరిగొండ వెంగమాంబ మేటి."*

"ఆంధ్ర" వారి ఈ రచన వెంగమాంబ సారస్వతం పై తులనాత్మకమైన పరిశోధన చేయుదలంచుకొన్న వారికి మార్గదర్శకమై అలరుతూవున్నది. ఈ రచన ద్వారా పరోక్షంగా (indirectly) సూచింపబడుతూ వున్న పరిశోధన శీర్షికలు ఇలా ఉన్నాయి:-

*1. బమ్మెర పోతనామాత్యుడు - తరిగొండ వెంగమాంబ.*
*2. తాళ్ళపాకవంశకవులు - తరిగొండ వెంగమాంబ.*
*3. తరిగొండ వెంగమాంబ - సమకాలీన యక్షగాన కవులు.*

అలభ్యమైన ఈ గ్రంథాన్ని ముద్రించదగినదిగా సూచించిన వెంటనే, దీని ముద్రణకు ఆమోదించి, ఆదేశించిన సహృదయులు, సుగృహీత నామధేయులు, శ్వేత సంచాలకులు "శ్రీ భూమన్" (బి.యస్.రెడ్డి) మహోదయులకు నా అనేక హృదయ పూర్వక ధన్యవాదములు

కె.జె.కృష్ణమూర్తి

**కె.జె. కృష్ణమూర్తి**

# విదుషీమణి వెంగమాంబ

## విషయ సూచిక


| విషయము. | పుట. |
| --- | --- |
| ముందుమాట | III |
| అభినందన | VII |
| ప్రశంస | IX |
| జీవితము | 1 |
| సాహిత్యము (రచనలు) | 42 |
| ప్రముఖుల అభిప్రాయములు | 126 |



# విదుషీమణి వెంగమాంబ

## ౧జీవితము

తే.గీ. ఆంధ్ర కవయిత్రులందు వేదాంత తత్త్వ
మలవరించినయట్టి పుణ్యాత్మురాలు;
వివిధ కృతు లాంధ్రవాఙ్మయవీథి నింద
వెలుగ జేసిన కవితాంబ! వెంగమాంబ.

తే.గీ. ఆంధ్ర సాహితి గణనీయమైన శాఖ
లన్నిటను కృతిరత్నము లలర జేసె
వెలుగు నించెను వాఙ్మయ విశ్వమెల్ల
విపులకవితాగుణాలంబ! వెంగమాంబ!

**- యమ్. ఆదిలక్ష్మి**

వెంగమ్మ భగవద్దర్శన ప్రాప్తినందిన ఆంధ్ర కవయిత్రీమణి! ఆమె మహాయోగిని, పండితురాలు, తత్త్వార్థవివేకిని.

తెనుగున కావ్యరచనము గావించిన ఆంధ్ర రమణుల యందు బ్రాహ్మణ వంశమునకు చెందిన వారిలో మనకు తెలిసినంత వఱకు వెంగమ్మ రెండవ యామె. మొదటి యామె తాళ్ల పాకము తిమ్మక్క. ఈ బ్రాహ్మణ కవయిత్రులు ఉభయులును నందవరీకలే!

సాదృశ్యము అంత మాత్రమే కాదు; తిమ్మక్క, వెంగమ్మ లిద్దఱును తిరుపతి క్షేత్రవాసులు. వేంకటేశ్వరస్వామి మహాభక్తుడైన అన్నమాచార్యుని అర్ధాంగి తిమ్మక్క. పలువత్సరములు తిరుపతి యందు నివసించినది. వెంగమ్మ వేంకటేశ్వరస్వామి నామమును ధరించి వేంకటేశ్వరస్వామి పదభక్తురాలై తిరుపతి యందు చాల కాలము నివసించినది.

ఇందు వెంగమ్మ తరిగొండ గ్రామవాసిని. అగుటచే ఆమె తరిగొండ వెంగమ్మయని పిలువబడుచున్నది. అంతియేకాని కొందఱు అనుకొనినట్లు తరిగొండ అనునది - ఆమె గృహ నామము కాదు. ఆమె పుట్టింటివారి యింటిపేరు కానాలవారు; అత్తింటివారి యింటిపేరు ఇంజేటివారు.

తరిగొండ గ్రామము చిత్తూరు జిల్లా వాయల్‌పాడు తాలూకాకు చెందినది. వాయల్పాడు వాల్మీకి క్షేత్రము. దానికి తరిగొండ నాలుగు మైళ్ల దూరములోనున్నది. తరిగొండ గ్రామమును తరికుండ గ్రామమనియు వ్యవహరింతురు. ఈ విషయమును గూర్చి వావిళ్లవారు ప్రచురించిన శ్రీ వేంకటాచల మాహాత్మ్యము పీఠికలో శ్రీ ఆలూరు వాసుదేవయ్యగారు ఇట్లు వ్రాయుచున్నారు:-

"తరికుండయను గ్రామంబునకు గొందఱు తరికుండ యనియు, మఱికొందరు తరిగొండయనియు జెప్పుదురు. ఈ విషయమునుగూర్చి నే నా గ్రామంబునకుబోయి యుండినపుడు వైద్య జ్యోతిషాంధ్ర సంగీతవిద్యావిశారదులగు రాయదుర్గము నరహరిశాస్త్రులవారి నడుగుటంజేసి ఆయన నాకిట్లు వచించె.

పూర్వము రాయదుర్గమను గ్రామ నివాసులు క్షామ, చోర బాధలకు నా గ్రామంబున నుండ నోపక నిజగృహంబులు వదలి, పశువులందోలుకొని తమ కుటుంబములతో నెందేని జల సస్య సమృద్ధి గల ప్రదేశంబున కేగుదమని వచ్చుచు, మార్గమధ్యంబున నొక్క యెడ నందఱు మార్గాయాసంబునకు గొన్నాళ్లుండి పో దలంచి యుండిరనియు, వారు నిల్చియుండిన ప్రదేశంబునకుఁ 'బ్రత్తిమిట్ట అని పేరుండినదనియు, నొకదిన మందఱును దమ కష్టంబులకుఁ

దమగ్రామమునంగల శ్రీ నృసింహస్వామిని, 'హా! ప్రహ్లాదరక్షకా! దీనబంధూ! మమ్మీదుర్భిక్షకాలంబున దగ్గఱనుండి రక్షింపుమా!' అని యనేక విధంబుల భజనచేయుచుండిరనియు, మఱునాడుదయంబున నొక బ్రాహ్మణస్త్రీ తన వాడుక చొప్పున మజ్జిగ దరుచుచునుండ నామజ్జిగ కుండలో నొకరాయి యుండి కవ్వమునకు బలుమాఱు దాకుచుండ, నది యేమని తలంచి యా విప్రాంగనయగు లక్ష్మీనరసమ్మ తన కరంబున నా కుండను దడవి చూడ నేమియు దొరకుండెననియు, మఱల నా నారీమణి తరుచు చుండగా ముందువలె నొక ఱాయి తగులు చుండెననియు, మఱలఁ బరిశోధింప నాకుండలో నొకఱాయిగాని లేకుండెననియు, నివ్విధము రెండు మూడు మాఱులు చూచి విస్మయపరీతచిత్తయై కొంతవడి యూరకుండి క్రమ్మఱ జిలుకుచుండఁ దొల్లింటివలె ఱాయి తగులుటంజేసి, వెఱగంది భర్త కడకుండబోయి మజ్జిగ కుండలో నివ్వడువున నున్నదని చెప్ప, నతండు వచ్చి చూచు నప్పటికి నాకుండనుండు రాయి నృసింహాకారంబుతో నుండినదనియు, నారూపము చూచి విస్మయ భయ పరీతచేత స్కుండై భార్యం జూచి, 'తరుణీ! నీ విపుడీ విషయమెల్ల వారికిం జెప్పి దోడ్కొని రావలయు'ననగ నామె పోయి యెల్లవారికిం జెప్పి పిలుచుకొని వచ్చినదనియు, నావల నంద ఱా స్వామిని యనేక విధముల బ్రార్థించిరనియు, అత్తఱి నశరీర వాక్కుల నాస్వామి, 'భక్తాగ్రేసరులారా! మీ దురంత కష్టంబులఁ బాపి మీ యిష్టంబు లిచ్చుటకు నీతరికుండ నుదయించితి'ననియు, 'నిక మీరెందేని పోజన'దనియు, 'మీరు నా కియ్యెడ నాలయంబు నిర్మించి, 'నన్నారాధించుచుండు'డనియు, 'మీరు నన్నీదినము నుండి

తరికుండ నృసింహుడు అని నామంబిడి భజించుచుండు' దనియు, జెప్పటంజేసి, వారట్లు చేసిరనియు, నక్కారణంబున నీయూరికి నిపుడు తరికుండయని చెప్పుచున్నారనియు, (తరికుండ = మజ్జిగ చిలుకు కుండ), తరికుండయని చెప్ప వలయుం గాని, తరిగొండయని చెప్పనొప్ప దనియు, మాపెద్ద లా కాలంబున రాయదుర్గ గ్రామంబున నుండి వచ్చి యిచట నిల్చి యుండుటంజేసి మమ్మిపుడు రాయదుర్గము వారని పిలుచు చున్నారనియు జెప్పె.

ఇట్టి పురాణ ప్రసిద్ధిగల తరికుండ గ్రామమున ఆమె పుట్టువు నొంది, తరికుండ నృసింహస్వామిని ఇష్ట దైవముగా చేకొని కొలిచి, తాను రచించిన గ్రంథములను ఆదైవమునకే అంకితము చేసినది. ఆమె తాను రచియించిన వేంకటాచల మాహాత్మ్య గద్యమున "తరిగొండ లక్ష్మీనృసింహ కరుణాకటాక్ష కలిత కవితా విలాస వసిష్ఠ గోత్రపవిత్ర కృష్ణయామాత్య తనూభవ" అని చెప్పుకొన్నది.

ఆమె రచించిన ద్విపద భాగవతములోని క్రింది పంక్తుల వలన ఆమె వంశాదికములను గుఱించిన వివరములు తెలియ వచ్చుచున్నవి:-

*"ధరపైని వెలయు నందవరాహ్వయుండు*
*గురుతర సువసిష్ఠ గోత్రసంభవుడు*

*కానాల వంశ సాగర హిమాంశుండు*
*నైన కృష్ణార్యున కతిభక్తి తోడ*

*సంగతి కృష్ణుండు సైదోడుగాగ*
*వెంగమాంబిక...................."*

వెంగమ్మతల్లి మంగమాంబ, తండ్రికృష్ణయ్య. సోదరుడు కృష్ణయ్య. వారి యింటి పేరు కానాల వారు. వారిది వసిష్ఠ గోత్రము. వారు నందవరీక బ్రాహ్మణులు.

వెంగమ్మ నందవరీక బ్రాహ్మణస్త్రీయని ఆమె రచియించి వేంకటాచలమాహాత్మ్యమునందలి-

*క. అల కాశి నుండి వెలువడి*
*వలనుగ మా కొఱకు నందవరపురమందే*
*నెలకొని కులదైవతమై*
*యలరుచు మమ్మేలు చౌడమాంబను గొల్తున్.*

అను పద్యము వలన కూడ దెలియనగును.

"ఈమె తన భర్త యొక్క నామ గోత్రములను జెప్పుకొనక,- వసిష్ఠగోత్ర పవిత్ర కృష్ణయామాత్య తనూభవ - యని తాను కృష్ణయామాత్యుని కూతురయినట్టు మాత్రము చెప్పుకొనుట చేత నీమె బాలవితంతువయి తనకాలమును వేదాంతగ్రంథపఠనాదుల యందు గడిపినట్లూహింపదగి యున్నది" - అని ఆంధ్రకవుల చరిత్రకారులు వ్రాయుచున్నారు.

ఆమె తన భర్తయొక్క నామ గోత్రములను జెప్పుకొన లేదను వ్రాత సరి కాదు. ఆమె తాను రచియించిన గ్రంథములలో మొదటిదానియందు తన భర్త విషయము చెప్పి యున్నదన వచ్చును. ఈ విషయమై ఆమె రచియించిన ద్విపద భాగవతమున నిట్లు కలదు:-

"వరుసగా నింజేటి వంశభూషణుడు
గురుతర శ్రీవత్సగోత్ర సంభవుడు

ఘనుడైన తిమ్మయాగ్రణిపుత్రుడనగ
జనులెన్ను వేంకటాచలపతి పాద

వనజయుగ్మంబు భావంబునందుంచి
యనుపమంబైన మోక్షాసక్తి తోడ

వలనొప్ప శ్రీభాగవతమునం దొనర
నిలను షష్ఠస్కంధ మిరవుగా ద్విపద

గా విరచించి.............................."

శ్రీవత్సగోత్రుడును, ఇంజేటి వంశ్యుడును అగు తిమ్మయకు పుత్రుడైన వేంకటాచలపతి పాదములను పూజ్య భావముతో మదియందుంచి ఆమె భాగవతమును రచియించినట్లు చెప్పుచున్నది. ఇంజేటి వేంకటాచలపతి అనునదే ఆమె భర్త నామము. ఈతడు చిన్ననాడే మరణించియుండును. అందుతో బాల వితంతువైన వెంగమాంబ తన కాలమును తత్త్వపరిశోధనము, వేదాంత విచారణము, గ్రంథ రచనావ్యాసంగము మున్నగు వానియందు వెళ్లబుచ్చెను.

విద్యారణ్య పంచానన, విద్యా వాచస్పతి బిరుదాంకితు లగు శ్రీకళత్తూరు విక్రాల రామచంద్రాచార్యులవారు కలి ఎనుబది నాలుగవ శుభకృతు సంవత్సరమున తిరుపతి కొండమీద బ్రహ్మోత్సవ సందర్భమున మన తరిగొండ వెంగమాంబ శిష్యురాలగు నలివేలుమంగమ్మ శిష్యయగు వెంగమ్మ వలన వినిన సంగతులతో

రచియించిన తరిగొండ "వేంగమాంబా విజయము" అను గ్రంథమున ఈ వివాహమును గుఱించి యిట్లు చెప్పుచున్నారు:-

"చిత్తూరుకు సమీపమున నుండు నారగుంట పాళియములో నుండు తన బందుగులలో శ్రీవత్స గోత్రజులై ఇంజేటి వారిలో తగుమైన వరలక్షణములుగల - ముద్దుపట్టి వెంగమ్మ కోరిన ప్రకార మామె యిష్ట దేవతతో దుల్యానామము గల- వెంకటాచలప్ప యనువారి కిచ్చి వివాహముం జేసెను."

వెంగమాంబ బాల్యము, పరిణయము, భర్త మరణము మున్నగు వానిని ప్రస్తావించుచు శ్రీవేంకటేశ్వర భక్తవిజయము వివరించు విపరీత విషయములను ఉభయభాషాప్రవీణ శ్రీ ఊటుకూరు లక్ష్మీకాంతమ్మ "ఆంధ్ర కవయిత్రులు" అను గ్రంథమున ఇట్లు సంగ్రహపఱచి చెప్పుచున్నారు:-

"తంద్రియగు కృష్ణార్యుడు బిడ్డలు లేక దేవతలకెల్లరకు మ్రొక్కి, తుదకు వేంకటేశ్వరుని కృపా విశేషమున నీమెను బిడ్డగా బడసెను. లేక లేక కల్గిన తనయ యగుటచే, నీమె నతిగారాబముగా బెంచి ఏ యే వయస్సులలో నే యే విద్య యుచితమో ఆ యా విద్యల నేర్పుచుండెను. ఈ బిడ్డయు నతి సునిశిత మేధాసంపత్తి కలదై, విద్యల నన్నిటిని చిఱుత ప్రాయముననే గ్రహించి, అపర సరస్వతియే అనునట్లు తలిదండ్రులకును, జూచువారలకును నత్యాశ్చర్యము కలుగజేయుచుండెను. అంతియ కాక, యీ బాలిక దేవీ వరప్రసాదినియగుట మిగుల సుందరాంగియై, 'జనముద్దు బిడ్డ'యై గోమున బెరుగుచుండెను. ఇట్లామె 7, 8 ఏండ్ల వయస్సు వచ్చునప్పటికి లౌకిక విద్యలను విసర్జించి, ఆధ్యాత్మిక విద్యావిజ్ఞాన

తంత్రములలో విదుషియై, సంతత కృష్ణనామ సంస్మరణమున మేనుమఱచి, యన్యము నొల్లని పరమ భక్తురా లాయెను. ఆమెపై పుట్టెడాసలు పెట్టుకొనియున్న తండ్రి కీ బిడ్డ యొక్క యీ లౌకిక విముఖతయు, భగవద్ధ్యాన పరతయు నసహ్యాము లాయెను. అంత నాతడు తన పుత్రిక కనేక విధముల లోక తంత్ర ముపదేశింప సాగెను. కాని, యామె యవి అన్నియు పెడ చెవిని బెట్టి, కృష్ణ స్మరణముననే నిమగ్న కాజొచ్చెను. అంత తండ్రి తన యాశలన్నియు నిరాశలు కాగా, మిగుల కుపితుడై 'యింతవఱకు చెప్పించిన విద్యలే యిట్లింత కొంపముంచెను; ఇంకను విద్యలేల?' యని చెప్పించుచున్న చదువులను గూడ మాన్పించి - మున్ను హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని హింసించినట్లు- హరి చింత మానుమని యనేక బాధల బెట్టెను. ఆ బాలిక కంఠమెత్తి కోయిలవలె హరినామ సంకీర్తన చేయుచుండ, నట్లుచేయుట మానుదువా, లేదా? యని మూతిపై వాతలు బెట్టెను. ఇట్లు కొన్నాళ్లు గడిచిన వెనుక, పెండ్లి చేసిన ఆమె సాధారణ సంసార జీవితమం దనురక్త యగునని తలంచి, ఒక చక్కని కుఱ్ఱవానిని చూచి పెండ్లి చేసెను. పెండ్లితో ఆమె బుద్ధి సంసారానురక్త మగుటకు బదులు, మఱింత విరక్త మాయెను. ఆమె తన్ను భర్త దరియ బోవునప్పటికి, 'వేంకటాచలపతియే నాకుపతి; నీవు నాకు భర్తవు కావు. పొమ్ము బలవంతముగా నన్ను పొందలచితివేని నీతల వేయి వ్రక్కలగును జాగ్రత్త' యని హుంకరించెను. దానితో నాతడు బెగడు గుడిచి మంచమెక్కి, ఆరు నెలలకు 'అదిగో దెయ్యము ! - అమ్మో ! నిన్ను ముట్టబోను నాజోలికి రాకు' మనుచునే చనిపోయెను. ఇది "శ్రీవేంకటేశ్వర భక్తవిజయము" నందలి ఈమె కథలోని ప్రథమ ప్రకరణము.

ఈ విపరీత కథనమును పురస్కరించుకొని శ్రీలక్ష్మి కాంతమ్మ యిట్లు వ్యాఖ్యానించుచున్నది:-

"భర్త విషయమున నీమె విరక్తి యిటులుండ, నీమె తన భర్తస్మృతి చిహ్నముగ కావ్యము వ్రాయుటెట్లు సంభవించెనా?యని యనుమానము. ఈమె జీవిత కథను బరికించినను, నింక యితర రచనలను బరికించినను, భర్తృ నామస్మృతి చిహ్నముగ నొక కావ్యము రచింపవలెనను కోరిక కూడ నీమెకు కలదా? యని యనిపించును. అయితే యింకొక విధముగ దీని నన్వయింపవచ్చును. వేంకటాచలపతి యనగా శేషగిరీంద్రాధిపతియు, తన యిష్ట దైవమునైన వేంకటేశ్వరుని పేరుమీదుగా తన భర్త పేరును నేదో యుబుసుపోకకై లోక మర్యాదకై కావ్యమున నిల్పినదేమో!"

ఈవిధముగా వ్రాయుట వెంగమ్మకు అపచారము చేయుట యని చేయెత్తి చెప్పవలసి ఉన్నది.

భర్తృ విషయమున నామె విరక్తి వహించెనను కథనము కాళ్లు లేనిది. భర్త ప్రసక్తి ఆమె కావ్యముల చేసిన తీరు చూడగా, ఆమెకు అతని యందు విశేషమైన భక్తి ప్రపత్తులు కలవనుట రూఢమగును. అతనిని గుఱించి ఆమె ఉపయోగించిన పదములు కనుడు. 'అతడు ఇంజేటి వంశ భూషణుడు. ఘనుడైన తిమ్మ యాగ్రణి పుత్రుడు. అతని పేరు వేంకటాచలపతి. అతని పాద ద్వయము వనజయుగ్మము.'

ఇట్టి మాటలలో మగనిని తెలియ చెప్పిన శీలవల్లలన, మగని తూలనాడినదని చెప్పు కథ కాళ్లు లేనిదే యగును.

శ్రీవేంకటేశ్వర భక్త విజయము నుండి ఎత్తి వ్రాయబడిన పై గాథ కాళ్లు లేనిదనుటకు మఱియొక నిదర్శనము కూడ చూపవచ్చును. తండ్రి యామెకు మూతిపై వాతలు పెట్టినట్లుగా పై కథ చెప్పుచున్నది. వెంగమ్మ తనకావ్యములలో పెక్కింటి యందు తండ్రిని పేర్కొన్నది. ఆ పేర్కొనుటయు 'వసిష్ఠగోత్ర పవిత్ర కృష్ణయామాత్య' అనుచు వచ్చినది. మఱియు అతనిని 'కానాల వంశసాగర హిమాంశుడు' అనినది. ఈ ప్రయోగములను బట్టి ఆమె పితృ భక్తి తెల్లమగును. సోదరుడు కృష్ణయ్య సంగతి ఏమో చెప్పలేము. తండ్రి కృష్ణయ్య ఆమెను ఎట్టి కష్టములను కలిగించలేదనియే ఊహింపనగును.

ఇక ఆమె సకృత్తుగ మాత్రమే భర్త నామము తడవుటను గుఱించి. ఆమె పదునెన్మిది గ్రంథములు రచియించినది. గ్రంథములలో కడపటి మూడు నాలుగు గ్రంథములలో భాగవతము ఒకటి. అదియే మిక్కిలి పెద్దగ్రంథము. ఆ గ్రంథముననను ఆమె భర్త నామమును పేర్కొన్నది. భాగవతము నకు పూర్వము ఆమె రచియించిన గ్రంథములు చిన్నవి. పైగా అవి రచియించునాటికి ఆమె కులాంగనలకు సహజమును, ఉచితమును అగు సిగ్గు పొంది యుండునేమో? భాగవత రచనము నాటికి ఆమె బాగుగ పరిణతి చెంది యుండును. అంతవరకు ఆమె రచించిన గ్రంథములు అన్నిటికంటె అది యుద్గ్రంథము. పైగా ఆ గ్రంథమును ఆమె అనుపమంబైన మోక్షాసక్తితోడ రచియించినది. అగుట ఆ గ్రంథమున ఆమె భర్త పేరు చెప్పిన దనుకొననగును. అంతియకాని ఉబుసుపోకకో, లోకమర్యాదకో చెప్పినదనుట ఆ మహనీయురాలిని లాఘవ పఱచుటయే యగును.

ద్విపద భాగవతమున ఆమె తాను అంతకు పూర్వము రచియించిన గ్రంథములను ఇట్లు పేర్కొనుచున్నది:-

"అటుగాన నారసింహాంకిత శతక,
మట మీద నారసింహ విలాస కథయు,

నట శివనాటకం బదియునుగాక,
నట రాజయోగసారాఖ్యమౌ ద్విపద,

నట కృష్ణ నాటకం బదియునుగాక,
నట పారిజాతాపహరణ సత్కృతియు,

నట రమాపరిణయంబను పెండ్లిపాట,
యట చెంచు నాటకంబను నొక్క కథయు,

మఱియును శ్రీకృష్ణమంజరి, యవల
నిరుపమశ్రీరుక్మిణీ నాటకంబు,

కరమొప్ప నల గోపికా నాటకంబు
విరచించి భక్తితో................................"

దీనిని బట్టి వెంగమాంబ 1.నరసింహశతకము 2.నరసింహ విలాస కథ 3. శివనాటకము (యక్షగానము) 4.రాజయోగ సారము (ద్విపద) 5.కృష్ణనాటకము 6.పారిజాతపహరణము 7.రమాపరిణయము (పెండ్లిపాట) 8. చెంచునాటకము 9. శ్రీకృష్ణ మంజరి 10. రుక్మిణీ నాటకము 11. గోపికానాటకము అను పదునొకండు గ్రంథములు రచియించి యుండినట్లు తేలుచున్నది.

ఆ మీద ఆమె భాగవతము ద్విపదగా ద్వాదశ స్కంధములు రచియించినది. ద్వాదశ స్కంధయుతమగు ద్విపద భాగవతము ఆమె రచియించిన గ్రంథములలో పంద్రెండవదిగ లెక్కకు వచ్చుచున్నది.

ఈ బహుళ గ్రంథములలో బహుళ ప్రచారము కలది వేంకటాచల మాహాత్మ్యము. వేంకటాచలమాహాత్మ్య కృత్యాదిని ఆమె భాగవతపురాణ రచనమును ఇట్లు పేర్కొన్నది:-

"...... భాగవతపురాణ
మమర నే ద్విపద కావ్యంబుగాను
ద్వాదశ స్కంధముల్ తగజెప్పి హరికి
సమర్పించి శ్రీవేంకటాద్రి మహిమ
తే.గీ. మతనిపై రమ్య పద్యకావ్యంబు చేసి
శ్రీనివాసునకే సమర్పింప నుంటి"

దీనిని బట్టి ఆమె భాగవతమునకు పిమ్మట వేంకటాచల మాహాత్మ్యమును రచించినట్లు తేలుచున్నది. ఇవి గాక, ఆమె ముక్తికాంతావిలాసము, వాసిష్ఠ రామాయణము అను మఱిరెండు గ్రంథములను కూడ రచియించినట్లు కనిపించుచున్నది. వేంకటాచలమాహాత్మ్యమును ఆ వేంకటేశ్వర భక్తురాలి కడపటి గ్రంథముగా పరిగణించవచ్చును. అగుచో భాగవతము ఆమె పంద్రెండవ గ్రంథముగను, ముక్తి కాంతావిలాసము ఆమె పదమూడవ గ్రంథముగను, వాసిష్ఠ రామాయణము ఆమె పదునాలుగవ గ్రంథముగను, వేంకటాచల మాహాత్మ్యము ఆమె పదునైదవ గ్రంథముగను లెక్కకు వచ్చును.

ప్రాక్తనాంధ్ర కవయిత్రీమణులలో ఇన్ని గ్రంథములు రచియించిన యామె మఱియొకతె లేదు.

ఈ బహుళ కావ్యములలో పద్య కావ్యములు, ద్విపద కావ్యములు, శతకములు, యక్షగానములు, పదములు, పాటలు, కీర్తనలు - మొదలగునవి కలవు. ఇంతియ కాదు. శ్రీ యస్వీ జోగరావు అనినట్లు వెంగమాంబ సాహిత్యమునందు ప్రక్రియా వైవిధ్యమేకాక, భక్తి, శృంగారము, వేదాంతము మున్నగు విషయవైవిధ్యమును కలదు.

ఈ బహుళ గ్రంథకర్త్రి మదనపల్లెలో రూపావతారము సుబ్రహ్మణ్యశాస్త్రుల వారి నాశ్రయించి, తత్త్వోపదేశ మందినది. ఈ గురుని ఆమె తన గ్రంథములందు ఇట్లు స్తుతించినది:-

"ఇది సోమనాథ విశ్వేశ్వరస్వామి
పదపద్మ భక్తసుబ్రహ్మణ్యయోగి

చరణాంబుజాత షట్చరణాయమాన
పరిపూర్ణ నిత్యసద్భావనిమగ్న

మానసాంబుజ వెంగమాంబికా రచిత"

**- రాజ యోగామృత సారము**

"పరిపూర్ణ నిర్గుణ బ్రహ్మమై నిలిచి
ధరణిపైఁ బండితోత్తముడన వెలసి

వరకృపతోడ మద్వరదుడై నన్ను
పాలింపుచున్న సుబ్రహ్మణ్య గురుని

శ్రీ లలితాంఘ్రి రాజీవ యుగ్మమును
హృదయ పద్మంబునం దిరవుగానుంచి"
- భాగవతము

"...... చిత్తే సత్తగా నాత్మలో భావింపన్ గుఱిజూపినట్టి గురు సుబ్రహ్మణ్యు పాదాబ్జముల్ సేవింతున్..." వేంకటాచల మాహాత్మ్యము.

గొప్ప కవయిత్రి, మహాభక్తురాలు, పరమ భాగవతురాలు అగు తరిగొండ వెంగమాంబ అత్యద్భుత మహిమాన్వితురాలై ఉండినట్లును, ఆమెకు భగవంతుడు ప్రత్యక్ష మగుచుండినట్లును కథలు కలవు.

ఆమె అద్భుత మహిమను తెలుపు గాథను ఒకదానిని శ్రీమహావాది వేంకటరత్నము "తెలుగుకవులు" అను గ్రంథమున ఇట్లు చెప్పుచున్నారు:-

"తరిగొండ వెంగమ్మ విధవ యైనప్పటికిని శిరోజములు తీయించుకొనలేదు. భగవంతునకు బాహ్య ప్రవృత్తితో బనిలేదనియు, గుణమే ప్రధానమనియు నీమె భావించినది. కనుక, లౌకికాచారములంగూర్చి యంతగా బాటింపదయ్యె. ఈమె యిట్లుండుట చూచి యా యూరి బ్రాహ్మణు లాచారవిరుద్ధమని తలవెంద్రుకలు దీయుంచునదిగా గృష్ణ యామాత్యునకు నొక్కి చెప్పిరి. అతడీ సంగతి పుత్రికతో జెప్ప, నామెయు 'తంద్రీ ! లోకులు పలుగాకులు. ఎవరిని మెప్పించగలము? భగవంతుడు ప్రసాదించిన యీ వెంద్రుకలను గొరిగించినందువలన వచ్చు కీర్తి యేమి? గొరిగింపకున్న వచ్చు నపకీర్తి యేమి? మానసిక

ప్రవృత్తి మలినము గానప్పుడు లౌకికాచారముల బాటింపకున్న, గృపామయుడగు పరాత్పరు డాగ్రహింపడు. మలినమైనప్పు డాచారముల బాటించినను మన్నింపడు. కావున నన్నుగూర్చి యీ విషయమున నిర్బంధింపకు' మని పలుక గృష్ణయ్యయు గొమరిత గుణముల నెఱింగినవాడు గనుక, యేమియు ననక మిన్న కుండెను. తక్కుంగల బ్రాహ్మణు లిది యెఱింగి, పవిత్ర చారిత్రయగు వెంగమ్మను గూర్చి యనుమానించి అంకులాడియని ప్రకటించుటే గాక, తమయిండ్లకు రానీయమని తండ్రిని, బిడ్డను వెలి పెట్టిరి.

అప్పటికిని వెంగమ్మ శిరోజములు తీయించుకొనక యీ మూర్ఖులతో నేమని మిన్నకుండెను."

ఇట్లుండ నొకప్పు డా యూరికి పుష్పగిరిపీఠాధిపతు లరుదెంచిరి. అప్పుడు బ్రాహ్మణులందరు వెంగమ్మను గూర్చి స్వామివారికి విన్నవించి, యా యింట భిక్ష గొనగూడదని వచించిరి. స్వామివారును లౌకికాచారముల బాటించువారు గనుక, కృష్ణయామాత్యుని బిలిపించిరి. 'నీ బిడ్డకు దలవెంట్రుకలు తీయిం పనిదే మీ యింట భిక్ష గొనము. మా యాజ్ఞల నుల్లంఘింతువేని మిమ్ముల వెలివెట్టున ట్లాంక్ష యిత్తు'మని చెప్ప, గృష్ణయామాత్యుడు 'స్వామీ ! ఇందు నా దోషము లేదు. ఈ విషయమును గూర్చి నాబిడ్డతోనే ముచ్చటింపు'డని పలికెను. అప్పుడు స్వామివారు వెంగమ్మను బిలిపించి తల వెంట్రుకలు తీయించుకొనవలసిందని నొక్కి చెప్పిరి. వెంగమ్మయు చేతులు జోడించి, 'అయ్యా! మీరు జగద్గురువులు. మీ కంటె నేను దెలిసినదాన గాను. అయినను విధవకు శిరోజము లుండకూడదని యే వేదములో జెప్పబడినది?

అమె మానసిక ప్రవృత్తియే పరిశుద్ధమైనప్పుడు శిరోజములున్న నేమి? సొమ్ములు ధరించిన నేమి? మఱియు భగవత్కృపాతిశయము వలన పుట్టుకతోడనే లభించిన యా వెంట్రుకలను గొరిగించి నంత మాత్రమున తిరిగి మొలవకుండునా? మొలవకుండ జేయు సామర్థ్యము మీకు గలదేని యప్పుడు గొరిగింపుడు. భగవంతుడిచ్చిన యా యైశ్వర్యమును భగవంతునికే యర్పిం తునుగాని, మూఢులగు నీ బ్రాహ్మణుల కర్పింప'నని ఖండితంబుగా బలుక, స్వామివా •రాగ్రహించి 'నీవు మాకు బోధించుదానవా? బ్రాహ్మణ సంఘములో నున్నంతవరకు నీవు బ్రాహ్మణాచారములను బాటించవలెను. నీ కిష్టము లేకున్నను బలవంతము గానైన గొరిగింతు' మని పలికి, యప్పుడే మంగలివానిని రప్పించి యామె శిరోజములను దీయించిరి. కాని క్షురకర్మ పూర్తి యగునప్పటి కామె శిరోజములు యథా ప్రకారముగా నుండెను. ఇదియేమి చిత్ర?మని మఱియొక మాఱు గొరిగింప, నెప్పటి యట్లుండెను. అది చూచి యచ్చటి బ్రాహ్మణులేగాక, స్వామివారును మహాశ్చర్యపడి, యేమియు జేయజాలక, దిక్కులు చూడజొచ్చిరి. అప్పుడు వెంగమ్మ యథా ప్రకారముగా గొప్ప ముడిచి 'స్వామీ! లౌకికాచారమే ప్రధానమో, పరిశుద్ధమైన మానసిక ప్రవృత్తియే ప్రధానమో యిప్పటికైన నిర్ణయింపుడు. శ్రీ వేంకటేశ్వరుని యైశ్వర్యమైన యీ కేశజాలమును హరింప మీ రెవ్వరు? నా శరీరముతోబా టివియు నా దేవునకు జెందవలసినవే' యని వచింప, స్వామివా రామెను మహాభక్తురాలని తెలిసికొని, యకారణముగా నామె యెడ నిందారోపణ మొనర్చినందులకు బ్రాహ్మణులను మందలించి, క్షమాపణ గోరిరి. బ్రాహ్మణులును బుద్ధి గలిగి యామె పాదములపై బడి తమ తప్పు

మన్నించునది యని ప్రార్థించిరి. తరిగొండ వెంగమ్మ సచ్ఛీలయని యెల్లరచే నుతింపబడియె.

స్మార్తులలో నాడు వితంతువులు సజటలుగా నుండు ఆచారము అసలు లేకుండెను. విధవా శిరోజవపనము అనాడు అవర్జనీయ విధియై యుండెను. పరికింపగా ఇది అనుస్యూతా చారమే కాని, శాస్త్రచోదితాచారముగా కనిపించదు.

విధవా శిరోజవపన మైచ్ఛికము - అనుచు కళా ప్రపూర్ణ శ్రీ వఝల చిన సీతా రామస్వామిశాస్త్రి వ్రాసిన క్రింది పంక్తులు ఈ సందర్భమున తడవదగి యుండును:-

"శిరోజ ముండనము లేని వితంతువు లపవిత్ర లనియు, వారికి దైవిక, పైతృక కార్యములలో బ్రవేశించు యోగ్యత లేదనియు సుప్రసి ద్ధాచారమై యున్నది. శిరోజముండనము లేని వితంతువు వండిన యన్నాదులను శిష్టులును, శిరోజ వపనము గల వితంతువులును భుజింపరు. ఈ వితంతు శిరోజవపన మవర్జనీయ విధియా? కాదా? యనువిషయ మిట బరిశీలింపబడుచున్నది. నిర్ణయ సింధువులో (3 పరి. అశౌచ. 181 పుట) అను స్మృతిచే వితంతువు కబరిని బంధము చేసికొనుట దూషింపబడెను. కాని శిరోజముండనము విధింపబడలేదు........ కాన నది యైచ్ఛికమని భావము. కావుననే యల్లాజీయమున దశమదిన కృత్యములో విధవల మంగళ సూత్రమును, గర్ణ భూషణములను దీసి వేయవలయునని మాత్రము వివరింప బడెను. శిరోజముండనము చేసికొనవలెనని చెప్పబడలేదు. శిరోజవపనము కావించుకొను వితంతువు తల యందును నెంతో కొంత దైర్ఘ్యముగల శిరోజములు

వెలయుచునే యుండును. దైర్ఘ్యతారతమ్య మకిఞ్చిత్కరము. కాన శిరోజస్థితి వితంతువుల కపవిత్రతాజనకము కాదని వారును నంగీకరింపక తీరదు........ ఇంక శిరోజవపనము లేని విధవ శ్రాద్ధాదులలో వండరాదను నాచారము పరిహాసనీయము. శిరోజముండనముగల వితంతువు సైతము శ్రాద్ధపాకము చేయరాదని ధర్మశాస్త్రాశయము....పై సందర్భమును బట్టి వితంతువులకు శిరోజముండన మవర్జనీయ విధి కాదనియు, నది యైచ్ఛికమనియు నట్టి శిరోజ వపనములేని వితంతువు అపవిత్రకాదనియు, నామెకు దైవిక, పైతృక కార్యములందు ప్రవేశమునకు శిరోజ ముండనము గల విధవల వంటి యధికారము లేకపోలేదనియు గ్రహింప వలయును".

విధవలకు వపన విధాయక ప్రమాణము లేదు. ప్రాయశ్చిత్తమునందు స్త్రీలకు వెంట్రుకల కొనల యందు రెండంగుళములు మాత్రమే ఛేదనము చేయ వలయునని స్మృతి ప్రమాణములు కలవు. ఔర్ధ్వదైహిక క్రియను నవయవము గనుక, సార్వకాలిక విధవావపనమునకు అధికారము లేదు. బహు ద్రష్ట కావున వెంగమాంబకు ఈ విషయములన్నియు తెలిసి యుండును. ఉత్తర హిందూ స్థానములో గౌడ బ్రాహ్మణులలో విధవావపనము లేకుండుట, శ్రీ రామానుజ సంప్రదాయకులలో విధవావపనము సర్వదా లేకుండుటయు వెంగమాంబకు తెలిసి యుండును. శాస్త్ర చోదితముగను, గౌడ బ్రాహ్మణసంఘము నందును, వైష్ణవ మతమునందును విధవా వపనము లేకుండుట గుర్తించి వెంగమాంబ ఆ దురాచారమునకు ఎదురొడ్డి నిలువ గలిగినది.

ఈ సందర్భమున ఆమె చేసిన హేతువాదము మెచ్చ దగినదిగా ఉన్నది. "పరమేశ్వరుడిచ్చిన శిరోజములను మనమేల తీసివేయవలయును? ఒక పర్యాయము తీసిన నవి తిరిగి రానియెడల శిరోజములు తీయించుట ఈశ్వరోద్దిష్టమగును. అట్లు గాక, మఱునాడే మఱల వెంట్రుకలు మొలచుట చూడ శిరోజముల పెంచుట పరమేశ్వరునకు సమ్మతమగుట తెల్లమగుచున్నది" అని వెంగమ్మ వాదించెను.

బలవంత వపనానంతరము వెను వెంటనే ఎప్పటివలె ఆమె శిరమున కురులు నిండారి కబరీబంధమునకు అనువు పడెనను కథన మెట్టిదైనను, వితంతువులకు శిరోజములు తీయించు దురాచారము వెంగమ్మకు బొత్తిగా ఇష్టము లేదనుట మాత్రము నిశ్చయ పఱచుచున్నది.

మధుర ఆంధ్ర నాయక రాజ్యమును పాలించిన ఆంధ్ర రమణి మంగమ్మ సహగమన దురాచారమును ప్రతిఘటించుటయు, ఆంధ్ర కవితా సామ్రాజ్య పట్టాభిషిక్తయగు తరిగొండ వెంగమ్మ విధవలకు శిరోజములు తీయు దురాచారమును తృణీకరించుటయు గమనించితిమేని తెనుగు స్త్రీల సంఘదురాచార తిరస్కార ప్రియత్వము వెల్లడి యగును. చిరకాలమునుండి దేశమున పీట వెట్టు కొనియున్న దురాచారములను తిరస్కరించు తెగువ, ఆచార ఛాందసులగు ప్రజల యీసడింపుల లెక్కింపని దృఢ బుద్ధి, సదాచారములను ఏమరని దీక్షా విధియు తెనుగు తెఱవలకు గలవు. అయితే ఈ తెగువయు, ఆ దృఢబుద్ధియు, ఆ దీక్షావిధియు విద్యచే సువాసితమైనప్పుడు మాత్రమే కార్యసిద్ధి నొందును. విద్యా గంధము కలిగినవా రగుట చేతనే సహగమన దురాచారమును

మంగమ్మయు, విధవా శిరోజ ముండన దురాచారమును వెంగమ్మయు ప్రతిఘటించిరి.

వితంతువగు ఆమె జుట్టును బలవంతముగా తీయించిరి. ఆమె స్నానము చేసి వచ్చునంతలో జుట్టు యథారీతిని వచ్చి, ముడికి అమరినది. ఇది యొక అద్భుత మహిమ!

ఆంధ్ర కవులను గుఱించి ఇట్టి అద్భుత మహిమలు, గాథలు పెక్కులు కలవు. ఆంధ్ర కవుల అద్భుత మహిమల మూలముగా మల్లెపందిరి కంబము మహావృక్షముగా మారినది; ఆ మహావృక్షము తిరిగి మల్లె పందిరి యైనది. బండి, ఎడ్లు బెదురుటకు కారణ భూతమైన రాతి విగ్రహములు ముక్కలు ముక్కలైనవి. అన్నము సున్నముగా మారినది; కప్పలు అప్పాలుగా మారినవి. అనుకున్నంతలో గృహరాజసౌధము అను మేడ వెలసినది. పుల్ల మామిడి తియ్యమామిడిగా మారినది. రాజు వేయించిన చేతి సంకెళ్లు సంకీర్తనతో విడివడ్డవి. వాహకులు లేకుండ పల్లకి బాట వెంట నడచినది. ఎడ్లు లేకుండ నాగలి పొలము దున్నినది. ఇట్లు ఇంకను ఎన్నియో చెప్పవచ్చును.

అయితే ఆ మహిమలు నెఱపిన వారందఱును పురుష కవులు. ఆ పురుష కవులు నెఱపిన అద్భుత మహిమలతో దీటు వచ్చునది ఆంధ్ర విదుషీమణి తరిగొండ వెంగమాంబ నెఱపిన అద్భుత మహిమ!

రంగప్రకాశదాస విరచితమైన "వేంకటేశ్వరభక్తవిజయము" లోని శ్రీ తరిగొండ వెంగమాంబ చరిత్రమున ఈ యద్భుత

మహిమ గాథ మఱియొక విధముగ గలదు. దానిని కూడ వినుడు:-

నష్టభర్త్రియయ్యు వెంగమాంబ నజటగా నుండగా కొంతకాలమునకు "శ్రీ శంకరాచార్య పరంపరాచార్యులు వచ్చిరి... బ్రాహ్మణులు ఆమె విషయమై జగద్గురువుకు జెప్పిరి. అది విని అచార్యులవారు వెంగమాంబను తన వద్దకు పిలుచుకొని రమ్మని తన భటులను పంపిరి. వెంటనే పోక, వెంగమాంబ అన్నము దిని అటు పిమ్మట వచ్చెదనని యుత్తరమిచ్చెను. భోజనము చేసి నెమ్మదిగా శ్రీ ఆచార్యులను దర్శింప నొక నారికేళమును చేత బట్టుకొని వచ్చెను. సభలోనివారు ఆమెను శ్రీ ఆచార్యుల వారి సింహాసనమున కభిముఖమునందున్న తెరచాటు ప్రక్కగా నిలిపిరి. ఆమె ఆచార్యులకు నమస్కరింపక నిలిచియుండెను. బ్రాహ్మణులు ఆమెను నమస్కరించుమని నిర్బంధించిరి. అప్పుడు జగద్గురువులు తెరను అవలికి దీయించి, 'నీవేల నమస్కరించ?'వనెను. 'మీరు సింహాసనమునుండి ఆవలకి లేచిపోయిన నమస్కరించెద' ననెను. అది విని ఆచార్యులవారు చిన్నబోయి సింహాసనము నుండి డిగ్గి ఒకప్రక్కగా నిలిచిరి. ఆమె అప్పుడు ఆ సింహాసనమునకు నమస్కరించెను. తోడనే ఆ సింహాసనము భస్మీపటల మయ్యెను. అప్పుడు స్వాములవారు ఆమె సామాన్యురాలు కాదనుచు ఆమెకు ప్రదక్షిణ నమస్కారములు చేసిరి.

వెంగమ్మ అతిమానుషప్రజ్ఞను తెలుపుగాథను తెలిసి కొనినాము. ఇక ఆమెకు భగవద్దర్శన ప్రాప్తి కలదనుటకు చెప్పెడు కథను వినుడు:-

"వెంగమాంబ గ్రంథ రచనచేయుచు నేకాంతముగ నొక గదిలో గూర్చుండుచుండెను. అచటనుండి ఈవలకు రాగానే యామె మోమునం దానందమును, శరీరమున పరిమళమును పొడగట్టు చుండెను. అందుమీద ఆమె వదినెలు అనుమానించి, ఒకనా డా గది ద్వారము చెంత పొంచియుండిరి. కొంత సేపటికి గదిలో నెవ్వరో పురుషుడు నవ్వినట్టును, నృత్యము చేసి నట్టును వారికి విననయ్యెను. అంతట వారు తమ పతులను పిలిచి, తాము విన్న సంగతులను తెలిపిరి. అప్పుడు వారందఱును గూడి 'తలుపు తీయు'మని వెంగమ్మను తొందర పెట్టిరి. నిర్భయముగా వెంగమ్మ తలుపు తీసినది. వా రా గదినంతను పరిశీలించిరి. కాని అందేమియు వారికి పురుషుని పొలకువ కానరాలేదు. అంతట వారు వెంగమ్మను ఆ విషయమై అడిగిరి. 'విశ్వవ్యాపియగు శ్రీ కృష్ణభగవానుడు గాక అన్య పురుషుడి చ్చటి కేలవచ్చు'?నని ఆ భక్తురాలు పలికెను."

పురుష కవులగు బమ్మెర పోతరాజు, పిల్లలమఱ్ఱి పిన వీరభద్రుడు మున్నగు వారికి స్త్రీ దేవతయగు వాణి ప్రత్యక్షమైనట్లే తరిగొండ వెంగమాంబ కవయిత్రికి పురుష దేవతయగు శ్రీకృష్ణ భగవానుడు ప్రత్యక్షమైనట్లు ఈ కథ చెప్పుచున్నది.

ఈ సందర్భమైనదగు మఱియొక గాథను "శ్రీ వేంకటేశ్వర భక్త విజయము" ఇట్లు చెప్పుచున్నది:-

తరిగొండ వెంగమ్మ రాత్రులందు తనయింటిలో నొకచోట కూర్చుండి, చేతియందు తాళము పట్టుకొని, సంకీర్తనము చేయుచుండునది. ఆ సమయమున వేంకటేశ్వరస్వామి ఆమెకు ప్రత్యక్షమగుచుండెను. దేవస్థానములో అర్చకులు సన్నిధి ద్వార

బంధములఁ దెఱచువేళ కాగానే స్వామి మరల యచ్చోటికి బోయి యథారీతిగా భక్త జనులకు దర్శన మిచ్చుచుండెను.

ఇట్లుండ, ఏదో వేదాంత విషయ ప్రశ్నమున సమాధానము పూర్తిగ ఈయకుండగనే స్వామి పోవుచుండ, వెంగమ్మ హరి పీతాంబరమును పట్టుకొనెను. కోవెల వాకిండ్లు తెఱవబడు సమయమగుటచే వేంకటేశ్వరులు వెంగమ్మ యింటనుండి దిగ్గన అంతర్ధానము నొంది మూలస్థానమున చేరి, భక్తజనులకు దర్శనమిచ్చుచుండెను. అప్పుడు వెంగమ్మ తన చేత చిక్కిన పట్టు పీతాంబర శేషము కన్నులకద్దుకొని భద్రపరచెను.

స్వామి పీతాంబరము చిరిగి యుండుట అర్చకులు చూచి భక్తులను విచారించిరి. వెంగమ్మ దానిని వారికి చూపి తీసికొండనెను. అది భక్తులు చూడగా, నిండు పీతాంబరమై యుండెను. వారు దానిని కొనిపోయి చూడగా స్వామి వద్దనున్న ముక్కకూడ కానరాకుండెను. వారు నూతన పీతాంబరమును ధరింప జేసిరి.

అందుమీద వారు శ్రీ వేంకటేశ్వరులకును వెంగమ్మకును, మనుష్యులకు తెలియరాని విశేషములు జరుగుచున్నవని తలంచిరి.

వేదాంత గ్రంథ పఠనమువలనను, కావ్య రచనము వలనను కడప మండలమునందేగాక, తెలుగు సీమ యందంతటను వెంగమ్మ కీర్తి కెక్కుటచే తెనుగువా రామెయందు అధిక భక్తివిశ్వాసము లుంచి, దేశాచారము ననుసరించి ఆమె ప్రతిభ నుగ్గడించుటకు ఇట్టి కథలు కల్పించి, వానికి ప్రచారమిచ్చి నట్లు కొందఱందురు.

కాని, గ్రంథరచనా సందర్భమున వెంగమ్మకు భగవద్దర్శన మగుచుండుటను గ్రంథస్థ పద్యములు కొన్ని ప్రత్యక్షీకరించు చున్నవి. ఈ సంగతి కొంత విపులపఱుపదగినదిగా నున్నది.

కవయిత్రి వెంగమాంబ శ్రీ కృష్ణుని భక్తురాలు. ద్విపద భాగవత కృత్యాదిని ఆమె వ్రాసిన ఈ పంక్తులు గమనింపుడు:-

"ముదము దీపింప సన్మోక్ష చింతనము
చేయగా, భూసుర శ్రేష్ఠుని మాద్కి
నాయంబుజోదరు డాదరంబెసగ
'ఘనతరంబైన భాగవతంబునందు
మొనసిన తత్త్వార్థములను పామరులు
తెలియలే; రటుగానఁ దేటగా తత్త్వ
ముల నెల్ల సంక్షేపముగ రచియించి,
హరి పరాక్రమములు, హరి విహారములు
హరియవతారముల్ హరిమహత్త్వంబు
పొలు పొంద విస్తరింపుము నీ'వటంచు
పలికినందున, నిట్టి భాగ్యంబు నాకు
కలిగించుమనుచు వేంకటగిరీశ్వరుని
తలపగా, తరిగొండధాముడై యతడు
నీలాభ్రవర్ణుడై, నిరుపమ హేమ
చేలుడై మోముపై చిఱునవ్వు మెఱయ,

కరుణా కటాక్ష వీక్షణము దీపింప,
సరసుడై మధ్యాహ్న సమయంబునందు

చిన్ని కృష్ణుని రీతి జెంతకు వచ్చి,
పన్నుగా దెచ్చి శ్రీ భాగవతంబు

నన్ను 'చేకొ'మ్మని నాచేతి కిచ్చి,
సన్న సైగల నిది సారంబుగాను

వరుసగా ద్విపదకావ్యముఁ జేయుమనుచు
చిరమైనదయను సూచించియున్నాడు."

ఈ పంక్తులలోని 'చిన్నికృష్ణ' శబ్దము ప్రత్యేకము గమనార్హ మైనది.

ఇందు వర్ణితమైనది కేవలము స్వప్నగత వృత్తాంతమా? ఇతర ఆంధ్ర కవులవలె ఇది స్వప్నమని ఆమె స్పష్టముగ చెప్పలేదు. ఒకవేళ ఇది వెంగమాంబ మనోమయ వికారమా? ఇది జరిగినది మధ్యాహ్న సమయమున - అని ఆమె విస్పష్టముగ వివరించుచున్నది. చేకొమ్మని ఆమె చేతికి శ్రీ భాగవతమును చిన్ని కృష్ణు డిచ్చుట నిజముగా జరిగినదా?

ఆమె రచించిన మతీ యొక పెద్ద గ్రంథమగు వేంకటా చల మాహాత్మ్యమున గూడ సజాతీయమగు వర్ణనము కలదు.

ఆ గ్రంథ రచనారంభమున భక్తవరదుడగు శ్రీ కృష్ణ భగవానుడు ఆమె కడకు శృంగారాకృతితో వచ్చి 'శృంగారము గూఢ పదములతో జెప్పు'మనును. ఆమె 'చెప్పలే' ననును. అప్పుడు ఆ

దేవతామూర్తి వదనము అల్పకోప సుందరమగును. అంతట ఆమె అతనికి మ్రొక్కును. అందుమీద అతడు ఆమెను మన్నించును. కావ్యము నందలి శృంగారోక్తులన్నియు తానై పలుక బూనును.

వేంకటాచల మాహాత్మ్యములోని క్రింది పద్యము ఈ విషయమును తెలుపుచున్నది:

శా. *శృంగారాకృతి తోడ వచ్చి పదముల్ శృంగార సారంబుతో*
*డం గూఢంబుగఁ జెప్పు నీవనిన నట్లం జెప్ప లేనన్న, నన్*
*ముంగోపంబున జూచి, లేచి యటనే మ్రొక్కంగ మన్నించి, త*
*చ్ఛృంగారోక్తులు తానె పల్కుకొను నా శ్రీ కృష్ణు సేవించెదన్.*

ఈ పద్యమునందు విద్యావతియగు వెంగమ్మ హృదయ వేదన వెల్లడి యగుచున్నది. వేంకటాచలమాహాత్మ్యమున శృంగార రసమూర్తులగు పద్మావతీ విష్ణుమూర్తులు నాయికా నాయకులు. ప్రస్తావిత విషయము వారి పరిణయము. నాయికా నాయకుల పూర్వానురాగము, ప్రేమ లీలా విలాసములు వర్ణించి, స్థాయి భావము కల్గించిన గాని, కావ్యము రాణింపదు. అట్టి విషయ ప్రస్తారమున శృంగారరసమే ప్రాధాన్యము వహించును గదా! కాని బాల్యమాది వితంతువై యుండిన ఆమె శృంగార రసము పోషించుట కెట్లు సాహసించును? కావుననే శ్రీ కృష్ణమూర్తితో నామె 'శృంగార రసము చెప్పలే'నన్నది. ఆ మాటల కా శృంగారరసప్రియుని రూపము కోపమున కించపడినది. అందు కోర్వజాలక ఆమె క్షమింపుమని శ్రీ కృష్ణునకు మ్రొక్కినది. అప్పుడు శ్రీ కృష్ణుడు ప్రసన్నుడై శృంగారరసోద్వేలితములగు ప్రేమగీతములను పరమ భక్తురాలగు వెంగమ్మ హృదయ వీణను శ్రుతి మేళవించి, తానే

పాడ దొడగెను. ఆ కావ్యమునందలి పూర్ణ శృంగార విలాస లీలలు అన్నియు శ్రీకృష్ణుడే చెప్పెను. దేవు డానతిచ్చిన రీతిగా నే నిమిత్త మాత్రమై పల్కుదునని వేంకటాచల మాహాత్మ్యమున ఆమె చెప్పినది.

సీ. దారు నిర్మిత వీణె వారూఢిఁ బల్కించు
గాయక పురుషుని కరణిగాను
బురుషోత్తముడు దయా పూర్ణుడై నాజిహ్వా
యందు దావసియించి యరుదుగాను బలికించు-

అని కూడ ఆమె విపులపఱచి యనినది.

దీనిని బట్టి భవ్యకవితావేశమున ఆమెకు భగవద్దర్శన ప్రాప్తి యుండినదనుటను ఏ మాత్రము ఆస్తికభావము ఉన్న వారైనను కాదనలేరు.

కాదన లేకనే కాబోలు కవి చరిత్రకారులు శ్రీ వీరేశలింగము పంతులు ఈ సందర్భమున కొత్త ఉపపత్తి నొకదానిని కల్పించుచు ఇట్లు వ్రాయుచున్నారు.

"వారాంగనయైన ముద్దుపళని వలె శృంగార వర్ణనమని యవాచ్యములు పలుకక, కులాంగన కుచితమైన రీతిగానే వర్ణించుచు వచ్చుటయేగాక, శృంగార వాక్యములు వచించుట నహితము తన కనిష్టమని సూచించుటకయి శృంగార రసాధిదైవతమయిన కృష్ణుని ఇట్లు నుతించియున్నది:

*శా. శృంగారకృతి తోడ వచ్చి పదముల్ శృంగార సారంబుతో*
*డం గూఢంబుగ జెప్పు నీవనగ నట్లా జెప్ప లేనన్న నన్*
*ముంగోపంబున జూచి లేచి యట నే మ్రొక్కంగ మన్నించి త*
*చ్ఛృంగారోక్తులు తానె పల్కి కొను నా శ్రీ కృష్ణు సేవించెదన్.*

ఈ పద్యమును బట్టి చూడగా నీమె తాను పుస్తకము నందక్కడక్కడ సందర్భోచితముగా రచించిన శృంగార పద్యములు కూడ దనవిగాక కృతి పతి విరచితములే యని లోకమునకు జూప నుద్దేశించినట్లు కనబడుచున్నది."

లోక ప్రతారణోద్దేశమును వెంగమాంబకు ఆపాదించుట మెచ్చదగినది గాదనవలయును. ఆమె గొప్ప తపశ్శాలి. ఆమె భగవద్దర్శన ప్రాప్తి నందిన పరమ భాగవతురాలు. ఇట్లనుటకు ఆమె జీవితము ప్రబల తార్కాణము. ఆమె పుట్టిన యూరు తరిగొండ. తరిగొండ నృసింహక్షేత్రము. ఆమె ఆ తరిగొండ నృసింహస్వామి భక్తురాలు. తన జన్మగ్రామమునందలి ఆలయముననే ఆమె తపశ్చర్య ప్రారంభించినది.

ఈ సందర్భమున శ్రీ ఆలూరు వాసుదేవయ్య యిట్లు వ్రాయుచున్నారు:-

"ఈ వెంగమాంబగారు మదనపల్లెలో నుండిన బ్రహ్మశ్రీ రూపావతారం సుబ్రహ్మణ్య శాస్త్రులవారి నాశ్రయించి తత్త్వ ముపదేశింపబడి, నాలుగైదు సంవత్సరంబులు తరిగొండ శ్రీ నృసింహస్వామి దేవాలయంబునంగల అంజనేయస్వామి విగ్రహంబునకు వెనుక ప్రక్కగ నుండు నొక రహస్య స్థలంబున యోగంబున నుండినట్లును, అర్చకు డొక దినంబున గని అదివఱ కా యూర నీ వెంగమాంబపై నేదియో యొక దోషము కల్పించి యుండుటకును, నాలుగైదేండ్లు వెంగమాంబ కన్పట్ట కుండుటకును కల్పించిన దోషము సత్యంబని తలంచి, యా యర్చకు డామెను బిలిచి 'ఓసి రండా! దుష్కర్మంబులు చేయుట

గాక, యీ దేవాలయంబునకు వచ్చి యీలాగు వేషము పూని స్వామి వారి వస్త్ర, భూషణంబుల నపహరింప సమకట్టితివా?' యని దూషించి, ఆమె చేయు యోగంబును భంగపఱచి, యీవల కీడ్చికొట్టి పంపుటం జేసి, ఆమె యందుండక తిరుపతి వేంకటాచలంబు నకు వచ్చి తుంబురుకోనయం దొక్కెడ ఐదాఱు సంవత్సరములు తపంబొనర్చి, పిదప శ్రీ స్వామిపుష్కరిణికి నుత్తర భాగంబున నొక చిన్న మంటపంబున జేరి యుండినదనియు, అట్టి కాలమున ముందెఱింగించిన గ్రంథములు వ్రాసినదనియు దెలియ బడుచున్నది."

స్వగ్రామమునుండి ఇట్లు అవమానితయై తరిమి వేయ బడినను ఆ శీలతాచార, పరిశుద్ధచిత్త తరిగొండ నరసింహుని పట్ల తఱుగని భక్తి తోడనే యుండెను. వేంకటాచల మాహాత్మ్యము నందలి కృత్యాది దైవస్తుతిలో ఆమె-

*"స్వాకారం తరిగొండ శేషకుధరాధ్యక్షం భజేఽహం సదా"*

*"సారతరార్థము ల్దెలిపి సత్కృపతో నను నేలు దేవునిం*
*గూరిమితో భజింతుఁ దరిగొండ నృసింహుని దూరితాంహునిన్"*

అనినది. ఆమె రచియించిన గ్రంథములలో తొలుతటి రెండును తరిగొండ నృసింహస్వామి పరమైనవి. ఆమె రచియించిన మిగిలిన గ్రంథములును ప్రాయికముగా తరిగొండ నృసింహునకే అంకితములై యున్నవి. తరిగొండ నృసింహ స్వామిని, తిరుపతి వేంకటేశ్వర స్వామిని ఆమె అభేదభావముతో గొలిచినది.

తరిగొండను వీడి ఆమె తిరుమలలో స్థిరపడినది. తిరుమలలో ఆమె శ్రీ వేంకటేశ్వరపూజావిధిభారాకృశయై జీవిత శేషమును గడపినది.

వెంగమాంబ తొలుత తిరుమలచేరి తపస్సుచేసిన చోటు తుంబురుకోన ప్రాంతమందురు. మొగిలిపెంట యను మహా భీకరమైన కోన వద్దనున్న శ్రీ ఆంజనేయస్వామివారి పాదములచెంత ఆమె పలువత్సరములు తపశ్చర్య జరిపినది. ఆ స్థలము యుద్ధ కళ తీర్థమని చెప్పబడుదానికి చెంగటను ఉన్నది.

తపఃసిద్ధి అయిన తరువాత ఆమె శ్రీనివాసుల కోవెలలో ప్రవేశించినది. అప్పటికే ఆమె ప్రసిద్ధి మిన్నందినది. ఆమె కీర్తిని విని అప్పటి దేవాలయాధికారులు తూర్పు మాడ వీథి చివరి యందుండు ఊతి తేరునకు కుడిపార్శ్వమున ఒక పూరిల్లు ఆమెకు ఇచ్చిరి. ఆమె ఉండుటకు నివాసము చూపుటయే కాక, వారు ఆమె గ్రాసమునకు కూడ ఏర్పాటు చేసిరి. వేంకటేశ్వరస్వామి పాకశాలాధికారిణియగు వకుళమాలికాదేవి పేరున వెంగమ్మకు ప్రతి దినమును పడి (మూడు తవ్వలు) బియ్యము ఇచ్చు కట్టడి చేసిరి. ఈ కట్టడి నేటికిని జరుగుచున్నది.

వెంగమ్మ యింటి యందుడిన వారి వంశస్థులకు నేటికిని దేవస్థానమువారు ప్రతిదినము పడిబియ్యము చొప్పున ఇచ్చుచునే ఉన్నారు.

అక్కడ ఆమె స్థిరపడుటకు దేవస్థానమువారేకాక, తోడి నందవరీక బ్రాహ్మణ కుటుంబమువారగు తాళ్లపాకమువారు కూడ మిక్కిలి తోడ్పడిరి.

వెంగమాంబ గ్రామమగు తరిగొండ కడప మండలములోని దైనట్లే, తాళ్లపాకవారి గ్రామమగు తాళ్లపాక గూడ కడప

మండలములోనిదే. తాళ్లపాక తిమ్మక్క చరితమున ఆమె భర్త అన్నమాచార్యుడు శ్రీ తిరుపతి వెంకటేశ్వరస్వామిభక్తుడై, పదకవితాపితామహుడై వెలుగొంది యుండుట తెలిసికొని యున్నాము. సంకీర్తనాచార్యుడగు అన్నమాచార్యుని మన కథాస్త్రీ యగు తరిగొండ వెంగమాంబ తన వేంకటాచల మాహాత్మ్యమున పూర్వకవి స్తుతిలో పేర్కొన్నది.

అన్నమాచార్యుడు కొండమీద స్వామిసన్నిధిని ఎక్కువ కాలము గడపుచు వచ్చెను. తాళ్లపాకమువారికి కొండమీద గృహాదివసతులు అతని కాలముననే అమరెను. అన్నమాచార్యునకు తరిగొండ వెంగమాంబ మూడువందల యేబదియేండ్ల తరువాతిది. అన్నమాచార్యుని సంతతివారు తమయింటిలో నొక భాగమును వెంగమాంబకు ఇచ్చిరి. ఈ యిల్లు శ్రీవారి కోవెలకు ఉత్తరమాడ వీథిలో నున్నది. ఇది ఱాతి యిల్లు. పూరిల్లు విడిచి ఈ ఱాతి యింటియందు ఆమె పలు వత్సరములు నివసించినది.

అన్నమాచార్యుని కుమారునినాట కొండమీద తాళ్లపాకమువారి గృహముముందు మండపము కట్టించి, ఇక్కడ స్వామిని వేంచేపు చేయించి యుత్సవాదులు జరిపించుట సాగెను. ఈ అనవాయితి వెంగమ్మ కూడ అందుకొని తన యింటికిని స్వామిని వేంచేపు చేయించి యుత్సవము జరిపింపసాగినది.

తరిగొండ వెంగమ్మ గృహమునకు ప్రతి సంవత్సరమును నరసింహ జయంతి వెళ్లిన పదియవ నాడు వేంకటేశ్వరస్వామి వారు విజయము చేసి పూజలందుదురు.

ఆనాడు ఆ యుత్సవము ఏర్పాటగుటకు కారణము వెంగమాంబ నారసింహ భక్తియే. ఉత్తరమాడ వీథిలోని వెంగమ్మ

యింటికి ప్రక్కను శ్రీలక్ష్మీనృసింహమూర్తి దేవాలయము కలదు. ఆ ఆలయమును వెంగమాంబయే కట్టించెను. తరిగొండనుండి వెంగమాంబ వేంకటాచలమునకు తరలి వచ్చినప్పుడు తరిగొండ లోని నృసింహస్వామి కూడ ఆమెతో వేంకటాచలమునకు వచ్చెనట! తనతో కూడ వచ్చిన ఆ స్వామి కోసము ఆమె ఆ కోవెల కట్టించి, స్వామిని అందు వేంచేయింప చేసినదట! తరిగొండ నరసింహునకును తిరుపతి వేంకటేశ్వర స్వామికిని అభేదము కల్పించి కొలిచిన ఆమె నరసింహ జయంతి వెళ్లిన పదియవనాడు వేంకటేశ్వరస్వామిని అక్కడకు రప్పించి ఉత్సవ కల్పనచేయుట సముచితముగ నున్నది.

ఆ గృహము, ఆ కోవెల నేటికి తిరుపతి కొండమీద కలవు. వెంగమ్మ అనంతరము ఆమెకు మునిమనుమనివరుసవాడు చీనేపల్లి గమ్మయ్య ఆయింటి యందుండి ఆమె దేవతార్చనపు పెట్టె మున్నగు వానిని భద్రపఱచుచు, ఆమె చేయించెడు ఉత్సవములు యథారీతిని నిర్వహించుచు వచ్చెను. అతడు బ్రహ్మచారి. అతడు దేవాలయమున ఉగ్రాణపారుపత్యదారు ఉద్యోగము కూడ చేసెను.

ఆ ఉద్యోగమును, ఆ యింటిని ఇప్పుడు గుండేపల్లివారను ఆరువేల నియోగులు అనుభవించుచున్నారు. వెంగమాంబ నాటి దేవతార్చన, ముత్యాల హారతి పళ్లెము నేటికిని వారి వద్ద గలవు.

ముత్యాలహారతి పళ్లెము ముచ్చట వినతగినది:-

అన్నమాచార్యునకువలె వెంగమాంబకును వేంకటేశ్వర స్వామి వారు ప్రత్యక్షమగుచుండిరట! ఒకసారి ఆమె స్వామివారిని

రెండు కోరికలు కోరినదట. ఆ రెండు కోరికలలో మొదటిది స్వామివారు ఏడాదికి ఒకసారి తనయింటికి వచ్చి పూజల నందుట.

రెండవది: ప్రతిదినమును పవ్వళింపు సేవ ఐన తరువాత ఆఖరున ఇచ్చెడి హారతి తనపేరు మీదుగా నడచుట.

ఈ రెండు వరములు నేటికిని పాలింపబడుచున్నవి. ఏటేట నరసింహ జయంతి వెళ్లిన పదియవనాడు శ్రీస్వామివారు వెంగమాంబ యింటికి వచ్చుచునే యున్నారు. ప్రతి దినమున రాత్రి తీరుమానపు హారతి వెంగమ్మగారి ముత్యాలహారతియే ఐయున్నది. ఆ వడ్డికాసులవాని ఆలయనిర్వహణకార్యక్రమమున పూజాక్రమమున డబ్బు కట్టుచో మార్పులు జరుగును. కాని ఈ ముత్యాలహారతి విషయమున మాత్రము ఎంత డబ్బు కట్టినను ఎట్టి మార్పును ఉండదు. నిత్యమును శ్రీ స్వామివారి దినచర్య వెంగమాంబ పేర ప్రవర్తిల్లెడు ముత్యాల హారతితో ముగియును. నరసింహవిగ్రహోట్టంకితమై రాయి పొదిగిన ఆ ముత్యాలహారతి పళ్లెము నేటికిని తరిగొండ వెంగమాంబ గృహమున దర్శనీయమై ఉన్నది.

ముత్యాలహారతిని గుఱించి గాథ యొకటి వాడుకలో ఉన్నది. అది వినతగినది:-

ఏకాంత సేవా సమయమున ఒక్కొక్క దినము శ్రీ వేంకటేశ్వరుల దశావతారములలో నొక్కొక్క రూపమును రజత ముత్యములచే తట్టలో అమర్చెదరు. అప్పుడు కర్పూరముతో హారతి యిచ్చెదరు. ముత్యములచే రూపకల్పన జరిగెడు ఉత్సవ

సమయమున నివేదితమగు కర్పూరహారతికి ముత్యాల హారతి యను నామ మేర్పడెను. ఈ ముత్యాలహారతి యిచ్చు ఏకాంత సేవ దర్శనమునకు నేడు కట్నము ఐదుగురికి పదమూడు రూపాయిలుగా ఉన్నది. ఈ హెచ్చు కట్నము ఈ సేవా ప్రాశస్త్యమును తెలియచేయ గలదు.

ఏకాంతసేవా సమయమున శ్రీవేంకటేశ్వరులకు కర్పూర హారతిని ప్రతిదినము వెంగమాంబ తానే తీసికొని వెళ్లి నివేదించి వచ్చుచుండెను.

ఇట్లు కొన్నినాళ్లు సాగెను.

కోవెల అర్చకులలో కొందఱికి ఆమె హారతి విషయమై కొంత అసూయ కలిగినది. వితంతువు హారతి యిచ్చుట వారికి గిట్టలేదు. అందుచేత ఒకనాడు ఆమె రాకను వారు నిషేధించిరి. ఆనాడు శ్రీనివాసునకు ఆమె హారతి లేకపోయెను.

మఱుసటి దినము స్వామివారికి రథోత్సవము. రథము ఉత్తరమాడ వీథియందున్న శ్రీతరిగొండ వెంగమ్మ యింటివద్దకు చేరిన వెంటనే కదలక నిలిచిపోయెను.

ఎందఱు ప్రయత్నించినను, ఎంతప్రయత్నించినను రథము కదలలేదు.

రథము నేడు వెంగమ్మ యింటి ముందు ఆగిపోవుటయు, వెంగమ్మ గత దినము హారతి కొనిరాకుండుటయు అర్చకుల ఆలోచనకు అందెను. అప్పుడు అర్చకులు ఆమెను హారతి తెమ్మనిరి. వెలి వీడినది. ఆ భక్తురాలు హారతి పట్టినది. తోడనే రథము సునాయాసముగ ముందుకు సాగిపోయెను.

అర్చకులు భగవంతుని కోవెలలోనికి వేంచేయింపచేసి, అది మొదలు ప్రతిదినము యథాప్రకారము వెంగమ్మ హారతితెచ్చి యిచ్చుటకు అంగీకరించిరి.

ఇట్టి ఈ యుదంతములన్నియు ఆమె పరమ భాగవతురాలు అగుటయు, ఆమె భగవద్దర్శన ప్రాప్తినందుటయు తెలుపుచున్నవి.

ఈశ్వర సాక్షాత్కారమును గాంచిన తరిగొండ వెంగమాంబ సహస్రచంద్రదర్శన మొనర్చి - అనగా ఎనుబది యేండ్లకు పైగా జీవించి, కలియుగమున ఎనుబది రెండవ ఈశ్వర సంవత్సరమున 1817 శ్రావణ శుద్ధ నవమి తిథిని తిరుపతి కొండమీద శ్రీనివాసమూర్తి చరణారవిందములను బొందెను. ఆమె సమాధి తిరుపతి కొండమీద ఆమె యింటికి కూతవేటు దూరమున నేటికిని కలదు.

ఆమె సమాధి స్థలము ఆమె జీవితకాలముననే పావిత్ర్యమును సంతరించుకొనినది. ఆ స్థలమున ఆమె తులసి వనమును పెంచుచు వచ్చినది. కాగా, దానికి "వెంగమాంబ బృందావనము" అనిపేరు వచ్చినది. ఈ బృందావనమున నేటికిని ఒక బండ కలదు. ఆ బండపై పద్మాసనమున ఆమె నిశ్చలత పొందినపుడు శ్వేతశేషుడు వచ్చి ఆమెకు తన ఫణామండలముతో నీడ పట్టుచుండెనట! ఆ యోగీశ్వరికి ఆపాదించు గాథలలో ఇది యొకటి.

సందెకావు మొగలిపెంటవద్ద తపస్సు చేసికొనుచుండగా ఆమెకు తన మేనిఛాయ నిచ్చి యాదరించిన అంజనేయస్వామి

విగ్రహము వెంగమాంబ బృందావనమున నున్న నేరేడు వృక్షము క్రింద ప్రతిష్ఠితమైనది. ఇప్పుడు (1950) సమాధి స్థలమున చింతచెట్లు ప్రబలమై యున్నవి.

సమాధి స్థలమున చింతచెట్లా? - అని సంకోచము కూడదు. చింతచెట్టును తిరుమల స్థలవృక్ష మనవచ్చును. ఆదిలో వేంకటేశ్వరస్వామి తింత్రిణీ వృక్షము క్రిందనే వెలసినాడు.

మిత్రశ్రీ ఆకుండి వేంకటశాస్త్రి ఆ సమాధిస్థల ఛాయా చిత్రమును ప్రత్యేకముగ తీసి ఈ గ్రంథమున ప్రచురించుటకు సేకరించి యిచ్చినారు.

విరక్తశీల, జిజ్ఞాసవతి, బ్రహ్మవాదిని, వేదవేదాంత విచార తత్పర అగు వెంగమాంబ క్రీస్తు శకము 1817వ సంవత్సరమున చనిపోయినది.

దీనివలన ఆమె తిరుపతిలో నివసించిన అఱువది సంవత్సరముల కాలములోను ఱాతి యింటియందే ఆమె బహుకాలము జీవించి యుండును. ఆ ఱాతి యిల్లు ఆమె భక్తి భావమునే గాక, ఆమె శాపాక్షరశక్తిని కూడ నెఱిగినది. ఏడుకొండలవానికి ఊరేగింపులో ఏడాదికి ఒకరోజున విడిదిగా వెలయగల పావిత్ర్యమును సంతరించుకొనిన యిల్లది! ఆమె శాపాక్షర శక్తికి సాక్ష్యమైన ఉదంతము వినదగినది:-

అక్కా రామయ్య దీక్షితులు - అని దేవస్థానములో ఆనాటి అర్చకులపెద్ద. అతను సర్కారు తరపున అర్చకుడైన కారణమున అధికారము హెచ్చుగా నుండెను. దీక్షితులు వెంగమ్మ యింటికి

పడమటియింటిలో నివాసముండెను. అతడు పెద్ద కుటుంబి. పుత్రులు, పుత్రికలు, అన్నదమ్ములు, బావలు, మేనమామలు, బంధువులు యేబది వ:ంది వఱకు ఉండిరి.

సకేశియగు వెంగమ్మ పై అర్చకస్వామి యగు దీక్షితులకు ఈర్ష్య. అధికారపూరితుడు, అసూయాగ్రస్తుడు అయిన అతడు ఒక అనుచిత కార్యాచరణమునకు అరంభము చేసెను.

తన యింటిలో నందరును కుడిచిన వెనుక ఉచ్ఛిష్టములైన విస్తరంటులను అతడు దొడ్డి గోడమీదుగా ఆమె తులసి వనములో వేయించుచు వచ్చెను.

ఆ దుష్ట చేష్టితమును, వెంగమ్మ చిరకాలము సహించెను. ఒకనాడు ఆమె తులసి వనమున నుండగా మామూలు ప్రకారము ఎంగిలి ఆకులు ఎగసి వచ్చి ఆమెపై బడెను. పుల్లాకు తాకిడితో ఆమెకు ఆగని కోపము వచ్చెను. అక్కారామదీక్షితుని వంశము క్షయించునట్లుగా ఆమె శపించినది.

ఆ పిమ్మట దీక్షితుల యింట ఒకరి వెనుకగా నొకరు పలువురు మృతి నొందిరి. దీక్షితులు కూడ చనిపోయెను. అతని పలువురు పుత్రులలో ఒక్కగా నొక్కడు మాత్రము చావక బ్రతికి యుండెను.

అతడు వచ్చి వెంగమ్మ పాదములపై బడి క్షమాభిక్ష వేడెను. అప్పుడు వెంగమ్మ 'ఇక మీద నీ కుటుంబము ఏకప్రాణి మాత్రమై కొనసాగు'నని శాపము మఱల్చెను.

నేటికిని అక్కారామయ్య దీక్షితుల వంశము ఏకప్రాణి మాత్రమై, వెంగమ్మ జాతియింటికి పొరుగున వసించుచున్నదని చెప్పుదురు.

ఈ గాథ వలన ఆమె శాపానుగ్రహ సమర్థురాలగుట తెలియవచ్చుచున్నది.

ఆమె తిరుపతికి చేరుసరికి ఆ దేవస్థానము కంపెనీ వారి ఏలుబడిలో ఉండెను. ఆనాడు తిరుపతి ప్రాంతము ఉత్తరార్కాడు జిల్లాకు చెంది యుండెను. ఆ జిల్లా కలెక్టరు ప్రత్యేకము ఒక సనదు ద్వారా 1843లో తిరుపతి దేవస్థాన పరిపాలనమును హథీ రాంజీమఠము అధికారియగు మహంతుకు అప్పగించెను. అగుట తామె మరణించునరికి దేవస్థాన పరిపాలనము మహంతు చేతులలో నుండి యుండును.

కంపెని చేతులలో నుండినను, మహంతు చేతులలో నుండినను శ్రీ వేంకటేశ్వర దేవస్థానమందలి పూజావిధి నిర్వహణమున ఆ భక్తురాలి ముద్ర ప్రబలముగా నుండిదని మాత్రము ఒప్పుకొని తీరవలయును.

దేవస్థానమువారు ఆమె వాసమునకు, గ్రాసమునకు ఏర్పాటు చేయుట - ఆమె కోరిన చోటికి ఏటేట స్వామిని కొనివచ్చుట - ఆమె ఇచ్చు ముత్యాలహారతిని ప్రతిరాత్రి తుది తీరుమానముగా అంగీకరించుట మున్నగునవి ఇందుకు నిదర్శనములు.

భక్తురాలగుటకు తోడు వెంగమ్మ ఆంధ్రభాషయందు గొప్ప విద్వాంసురాలు. గొప్ప కైతకత్తె. ఇందులకు ఆమె రచియించిన గ్రంథములే ప్రబల నిదర్శనములు.

వేంకటాచలమాహాత్మ్యమునందు ఆశ్వాసాదిని, ఆశ్వాసాంతములందును వ్రాయబడిన శ్లోకములవలన సంస్కృత

కవితా రచనమునందు కూడ వెంగమ్మకు ప్రవేశము కలదని తెలియు చున్నది. సంస్కృతాంధ్రములందు సమముగా కవితచెప్పగల నేర్పు ఆంధ్రవిదుషీమణులలో రామభద్రాంబ, వెంగమాంబలకు ఇరువురకు మాత్రమే లెస్సగ గలదని చెప్పవచ్చును.

సంస్కృతము, ఆంధ్రము - అను రెండు భాషలయందును కవిత్వశక్తి, పాండిత్యము కల విదుషీమణి యయ్యు, వెంగమ్మ ఇసుమంతయు గర్వితమతిగాక, మిక్కిలి వినయవతిగా నుండినది. తన వినయ సంపత్తిని ఆమె తన కావ్యములందు సూచించుచు వచ్చినది. చూడుడు:-

రాజయోగ సారమున-

ద్వి. *"వినరయ్య కవులార! విద్వాంసులార!*
*వినరయ్య మీరెల్ల విమలాత్ములార!*

ఘనయతి ప్రాస సంగతులు నే నెఱుగ
వరుస నాక్షేపింప వలదు సత్కృపను,

శ్రీ కరంబుగ నారసింహుల కరుణ
నీ కథా ప్రారంభ మేర్పరించెదను."

భాగవతములో-

ద్వి. *"తలకొని వేదశాస్త్ర పురాణములను*
*లలికావ్యనాటకాలంకారములను,*

*తగ పూర్వకథల చందంబుల నెఱుగ,*
*నగుమాట గాదిది, నైజ మెట్లనిన*

నా చిన్ననాడు నోనామాలనైన
నాచార్యు లెవరు నాకానతీలేదు.

ఇక నేమి చెప్పుదు? నెట్టులో వాణి
నకలంకుడై జిహ్వాయందుంచె గురుడు."

**వేంకటాచలమాహాత్మ్యమునందు -**

"సీ. నా చిన్ననాట నోనామాలు నైన నా
చార్యుల చెంత నే జదువలేదు;
పరగ ఛందస్సులోఁ బది పద్యములనైన
నిక్కంబుగా నేను నేర్వ లేదు;
లలి కావ్యనాటకాలంకార శాస్త్రముల్
వీనులనైన నే వినగ లేదు;
పూర్వేతిహాస విస్ఫురితాంధ్ర సత్కృతుల్
శోధించి వరుసగా జూడలేదు;

తే.గీ. చేరి తరిగొండపురి నారసింహదేవు
డానతిచ్చిన రీతిగా నే నిమిత్త
మాత్రమై పల్కుదును; స్వసామర్థ్య
మిప్ప డరసి చూచినగాని నాయందులేదు."

అని ఆమె యనుచున్నది.

వేంకటాచల మాహాత్మ్య కృత్యాదిని ఉన్న మఱియొక పద్యమగు ఈ క్రింది సీసము ఆమె వినయ సంపత్తిని మఱింత ప్రస్ఫుటము చేయుచున్నది. కనుడు:-

"సీ. పండితాగ్రణులార! ప్రజలార! యిపుడు నా
బాలభాష కసూయపడక వినుడు!

*తల్లిదండ్రులు చిన్నపిల్లల పల్కుల*
*కానంద మొందెదునట్లు యిందు*
*మీరు నా తప్పొప్పు లేరీతిగా నైన*
*గేలి సేయక చిత్తగింపవలయు;*
*నాంధ్ర గీర్వాణ మహా కృతులుండగా*
*నిప్పు డీ కృతి విననేల? యనక,*

తే.గీ. *భక్ష్యములు మెక్కి యావలఁ బచ్చడియును*
*నంజుకొనిన విధంబుగా నా ప్రబంధ*
*మాలకింతురంటంచుఁ బేరాసచేత*
*నేను రచియింతు; దీని మన్నించి వినుడు!"*

వేంకటాచల మాహాత్మ్యము అను ఆంధ్ర మహాకృతిని పండితులును, ప్రజలును వినరేమో ? -అని ఆమె సందేహించుచున్నది. భక్ష్యములు మెక్కి యావలఁ బచ్చడి నంజుకొను విధముగా తన ప్రబంధమును వినవలసినదిగా తరికొండ వెంగమాంబ పండితులను, ప్రజలను కోరుచున్నది.

స్త్రీరచనమున పాకకళాసంబంధమైన ఇట్టి యుపమ లుండుట అతిసహజమగును.

వేంకటాచలమాహాత్మ్య మహాకృతిని తాను రచింపబూనుట ఈగ తోయధి దాటబోవుట వంటిదట! భాగవతమునందును ఆమె ఈ యుపమను ఉపయోగించినది. ఈ ఉపమల మూలమున ద్యోతకమగుచున్న ఆమె వినీత భావము సాటి లేనిది.

వెంగమాంబకు పూర్వోత్తర కాలములందు పురుషులు రచించిన 'వేంకటాచల మాహాత్మ్యములు కూడ కొన్ని ఆంధ్రసార

న్వతమున గలవు. వెంగమ్మ రచియించిన వేంకటాచల మాహాత్మ్యమునకు గల ప్రచార బాహుళ్యము వానికి లేదు. ఆమె గ్రంథ ప్రాశస్త్యమునకు అది యొక నిదర్శనము. అట్టి ప్రశస్త గ్రంథమునకు రచయిత్రియయ్యు ఆమె మిక్కిలి వినమ్రయై యుండినదని తెలిసికొనుటకు అత్యంతామోదకరమై ఉండును.

## ౨సాహిత్యము (రచనలు)

వినయ సంపత్తి గల ఆ విదుషీమణి రచియించిన వివిధ గ్రంథములను వరున క్రమమున అవలోకించుచు, ఉప లబ్ధములైన వానిని విపులముగ విమర్శించుకొందము.

ఆమె పదునైదు గ్రంథములు రచియించినట్లు ఈ వఱకే గుఱుతించియున్నాము.

ఆ గ్రంథములలో మొదటి రెండును నరసింహ శతకము, నరసింహ విలాసకథ అనునవి. ఇవి వెంగమాంబ ప్రాథమిక రచనములై యుండును. ఆమె తరిగొండ నరసింహస్వామి భక్తురాలు కదా! అగుట ఆ గ్రంథములు రెండును తద్దైవ స్తుతిపరములు.

## నృసింహశతకము

ఇందు నృసింహ శతకమును శ్రీ మానవల్లి రామకృష్ణ కవి (Journal of Sri Venkateswara Oriental Institute Vol.V. Part II June - Dec. 1944 pp 1-16) ప్రచురించియున్నారు.

నృసింహశతకమున 103 పద్యములు కలవు. "తరిగొండ నృసింహ! దయాపయోనిధీ!" అని మకుటము. చంపకోత్పల మాలికలు.

ఈ శతకమున యోగముద్రా రహస్యములు వివరింప బడినవి. ఇందువలన ఈ శతకరచన నాటికి ఆమె యోగ విద్యా రహస్యముల లోతును, పాతును పరికించుచుండిదని రూఢ మగుచున్నది.

ఇది యీామె ప్రాథమిక రచనమగుట ఇందు వ్యాకరణచ్ఛందో దోషములు హెచ్చుగా కనిపించుచున్నవి. అశ్లీలపద ప్రయోగములు మెండుగా నున్నవి.

శైలి తెలియుటకు రెండు పద్యములు:-

"ఉ. *భూచరుడైన నేమి? శివపూజలు చేసి యనేక ముద్రలన్*
*జూచిన పుణ్యమేమి? యది చూడక యుండిన నేమి తక్కువల్?*
*ఖేచరముద్రగాంచి మది కిన్నరభావము మానసంబులో*
*గోచరమైన ముక్తి తరిగొండ నృసింహ! దయాపయోనిధీ!*

చ. *ఎలమిని సొంపు పెంపొదవ నింజెటి వంశజుడైన వెంకటా*
*చలపతి నామధేయుని నిజాంగన వెంగమ సత్కవీంద్రు లి*
*మ్ముల ముదమంద నీ శతకమున్ రచియించి యొసంగె*
*మీకుఁ, గో*
*ర్కులు సమకూర్చవయ్య! తరిగొండ నృసింహ! దయాపయోనిధీ!"*

## నృసింహ విలాస కథ

ఇక, ఆమె రెండవ గ్రంథమగు నృసింహ విలాస కథ నేడు కానరాకున్నది. నృసింహ విలాస కథ యక్షగానము కాదగును.

## శివ నాటకము

ఆమె మూడవ గ్రంథము నామము 'శివనాటకము'. ఇది అముద్రితము. శివనాటకమునకు 'శివ విలాస'మనియు పేరు కలదు. అందలి కథా ధోరణి తెలిసి కొనుటకు-

ద్వి. "చేడెరో! నామాట చెప్పెద వినుము!
మూడు దినముల నాడు ముని యొకడు వచ్చి,

అతులితమని రత్నహారంబు దెచ్చి ,
హితవుగా నీపతి కిచ్చిన, నతడు

నీ సవతికి నిచ్చి, నినుమదిఁ దలచి,
భాసురాంగిరొ! చాల భయపడినాడు.

ఆ రత్నహారంబునన నెంత పెద్ద ?

రాణింప మును పరబ్రహ్మ యిచ్చినది
మాణిక్య హారంబు మక్కువ మీఱ"

అను పంక్తులు చాలును. ఈ గ్రంథము కాగితపు వ్రాత ప్రతి యొకటి కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్కార్యాలయమున గలదు. (2175 - 77 నెంబరు).

పై పంక్తుల వలన ఇందలి కథ నారదుడు, పారిజాత పుష్పము, శ్రీ కృష్ణుడు, రుక్మిణి, సత్య మొదలుగా గల కథను తలపించుచుండుట తెల్లమగును. అందలి పారిజాత పుష్పమునకు బదులు ఇందు రత్నహార మున్నది. అందుచేతనే కాబోలు లోకు లీ గ్రంథమును 'శివపారిజాత'మని వ్యవహరించుచున్నారు. కవయిత్రి తాను రచించిన గ్రంథముల పట్టికయందు దీనిని 'శివనాటక' మనినది. ఈ గ్రంథాంతమున దీనిని 'శివ విలాస'మని చెప్పినది. తాను రచియించిన గ్రంథమునకు అల్లసాని పెద్దన 'స్వారోచిష మను సంభవ'మని పేరిడగా అది లోకమున 'మనుచరిత్ర' అను పేరును అందినట్లే, తాను రచియించిన గ్రంథమునకు తరిగొండ

వెంగమాంబ 'శివవిలాస'మని పేరిడగా అది లోకమున 'శివ పారిజాతము' అను పేరును అందినది.

శివ విలాసము యక్షగానము. ఈమె తన్ను గూర్చి ఈ పుస్తకములో ఇట్లు చెప్పుకొన్నది:

ద్వి. "వలనొప్పగా నందవరకులోద్భవుడు
వరకీర్తి కానాల వంశవర్ధనుడు
గురుతర వాసిష్ఠగోత్ర పావనుడు

వసుధ మీదను గీర్తి వంతుడైనట్టి
రసికుడు శేషార్య రమణి మంగాంబ

వరపుత్రి వెంగమాంబ ధరిత్రిమీద
నరుదుగా తరిగొండ హరి కటాక్షమున

సరసత శివవిలాసంబను కథను
కరమర్థితో యక్షగానంబు చేసి

పరమ భక్తిని వీరభద్రున కొనగె."

ఈ పంక్తులు చదివిన తరువాత రెండు సందేహములు కలుగుచున్నవి:

**మొదటి సందేహము:**

వెంగమాంబ రచియించిన ఇతర గ్రంథములందు ఆమె తండ్రి పేరు కృష్ణార్యుడుగా పేర్కొనబడియున్నది. ఈ ఒక్క గ్రంథమున మాత్రము ఆమె తండ్రి పేరు శేషార్యుడని పేర్కొన బడినది. కృష్ణార్యుడనుటకు శేషార్యుడనుట వ్రాతకాని

పొరపాటగునా? వెంగమాంబ శివనాటకమునకు మదరాసులోని అడయారు లైబ్రరీలో రెండు తాళ పత్ర ప్రతులు కలవనియు, ఆ ప్రతులలో ఆమె కడమ గ్రంథములలో వలె ఆమె తండ్రి పేరు కృష్ణార్యుడనియే కలదనియు, అగుట అదియే గ్రాహ్యమనియు శ్రీ యస్వీ జోగారావు వ్రాయుచున్నారు.

**రెండవ సందేహము:**

వెంగమాంబ తన గ్రంథములన్నియు తరిగొండ నరసింహునకు అంకితము చేసినది. ఆ మర్యాదను ఈ గ్రంథము విషయమున ఆమె తప్పిన దనవలయును. "శివ విలాసంబను కథను కరమర్థితో యక్షగానంబు సేసి, పరమభక్తిని వీరభద్రున కొసగె" అని కదా ఆమె చెప్పుకొనుచున్నది!

తన యితర గ్రంథములవలె ఈ గ్రంథమును కూడ తరిగొండ నృసింహున కీయక, వీరభద్రునకు అంకితము చేసిన దేమి? ఆమె ఆది నుండియు తరిగొండ నరసింహస్వామి భక్తురాలు. ఆమె రచియించిన మొదటి రెండు గ్రంథములును ఆ తరిగొండ నరసింహ స్వామి పరమైనవి. ఇందువలన ఆమె వైష్ణవ భక్తి తేటతెల్లమగుచున్నది. శివ విలాసమునకు పిమ్మట ఆమె రచియించిన గ్రంథములన్నియు తరిగొండ నరసింహస్వామికే అంకితమిచ్చినది. స్థితి యిట్టిది కాగా, ఈ మూడవ గ్రంథమును మాత్రము ఆమె వీరభద్రుని పేర వెలయించుటకు ప్రత్యేక హేతు వేమైన గలదా?

శివవిలాసకథ యగుట శివుని పుత్రునకు అంకితమిచ్చినదా? ఈ సందేహములను భావిపరిశోధనము తీర్చవలసియుండును.

వెంగమ్మ నందవరీకబ్రాహ్మణ స్త్రీ కదా!

క. "అల కాశినుండి వెలువడి
వలనుగ మా కొఱకు నందవర పురమందే
నెలకొని కులదైవతమై
యలరుచు మమ్మేలు చౌడమాంబను గొలుతున్."

అను ఆమె వేంకటాచలమాహాత్మ్యమునందలి పద్యమును ఈ వఱకు మనము ఉదాహరించుకొనియున్నాము. ఈ పద్యమున ప్రస్తావితమైన నందవర పురమును గుఱించి 'నందవర ప్రశంస' అను పేరుతో నొక గ్రంథము కలదు. శ్రీ కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి ఈ సందర్భమున ఇట్లు వ్రాయుచున్నారు:-

"నందవరీకు లెల్లరును వైష్ణవ మతాభిమానులే యనుటకును వలను పడదని తోచెడిది. శేషార్యుని పుత్రియును, నందవరీక స్త్రీ రత్నమును నగు తరిగొండ వెంగమాంబ 'శివపారిజాత'మను నామాంతరముగల 'శివలీలావిలాస'మను గ్రంథరాజమును విరచించియున్నది. మఱియును నీమె తన గ్రంథమును వీరభద్రున కంకితము చేసెను. నందవరమునందు వీరభద్రాలయమును, విఘ్నేశ్వరాలయమును ఇంకను బెక్కులగు శివాలయములు గలవని 'నందవర ప్రశంస' యను గ్రంథము తెలుపుచున్నది. ఈ గ్రంథము ఆంధ్ర సాహిత్య పరిషత్పుస్తక భాండాగారమున గలదు. ఇందుమతీ పరిణయకారుడు తన పూర్వులు (నందవరీకులు) వారణాసీ తీరార్చిత చంద్రశేఖరు' లని వర్ణించుకొనినాడు. ఇంకను నందవరీకు లెల్లరును చౌడేశ్వరి నిలవేల్పుగా గొలుచువారై యున్నారు."

నందవరీకబ్రాహ్మణ స్త్రీ యగుట వెంగమాంబ యీ గ్రంథ రచనము సందర్భమున శాఖాభిమానమును, శైవాభిమానమును నిలిపికొని గ్రంథమును వీరభద్రునకు అంకితమిచ్చినదని యనుకొనుట సత్యదూరము కాదు.

శ్రీ యస్వీ జోగారావు ఈ గ్రంథమును గుఱించి యిట్లు చెప్పుచున్నారు:

". . . ఇందు లక్ష్మి కొరవంజియై గంగ కెఱుక చెప్పుట, నారాయణుడు సింగడగుట, ఆ సింగీ సింగళ్ల ప్రసంగము, గంగా గౌరుల సంవాదము హృదయంగమముగా సాగినవి. ఇందు అప ప్రయోగము లనేక మున్నవి. కాని సహృదయ సంభావనమునకు గొదువ పడదు."

## రాజయోగసారము

వెంగమాంబ రచియించిన నాలుగవ గ్రంథము 'రాజయోగ సారము.' ఈ గ్రంథమును వెంగమాంబ కృత్యాదిని రాజయోగసారమనియు, ప్రకరణాంతములందు రాజయోగామృత సారమనియు పేర్కొనినది. కవయిత్రి పెట్టిన ఈ రెండు నామములలోను 'రాజయోగసార' మనునదే విశేష ప్రచార మందినది. ఈ గ్రంథము క్రీస్తు శకము 1881 నాటికే ముద్రితమై ప్రచార మందినది.

శ్రీ భాగవతమునందలి తృతీయ స్కంధమందు గల కపిల దేవహూతి సంవాదరూపమగు సాంఖ్యయోగశాస్త్ర విషయమునకు ఇది తెలుగు సేత. ద్విపద రచనము. ఇందు మూడు ప్రకరణములు

కలవు. వేదాంత విషయములను సామాన్య జనులకు గూడ సులభముగా విదితమగునట్లు వివరించుటలో వెంగమ్మ యీ గ్రంథమున జూపిన నేర్పు మెచ్చదగినదిగా నున్నదనవచ్చును.

'ఆంధ్ర కవయిత్రులు' అను గ్రంథమున ఉభయ భాషాప్రవీణ ఊటుకూరి లక్ష్మీ కాన్తమ్మగారు రాజయోగసార రచనమును గుఱించి యిట్లు చెప్పుచున్నారు :-

"కపిలునకును దేవహూతికిని జరిగిన తాత్త్విక సంభాషణము వస్తువుగా గల రాజయోగసార రచన. మిగుల సామాన్యమైన శైలిలో పామరులకును తెలియునట్లు రచింపబడినది. పిండోత్పత్తి ఘట్టము, పంచకోశ ప్రభావము - అను వానిని కపిలుండు తల్లియైన దేవహూతికి బోధించెను. . . ధార మొదటి ప్రకరణమునందు కంటె రెండవ ప్రకరణమున జీవన్ముక్తి విచారము నుండి విశుద్ధమై చదువరులకు హాయి గొల్పినది . . . పాయక నెఱిగింతు, పట్టుగా, వినుము, వరుసగా, నిదియును, వాసి, నిర్మితము, కొమరొప్ప, నరవితో, క్రమమొప్ప, మొదలగు పడికట్టురాళ్లును - 'ఓ సారసాక్షిది' అనుచో సంబుద్ధి 'ఇ త్వము'పై సంధి, 'తరుచైన హంకార తత్త్వముల్' అనుచో అదంతము పైన ధాతుజ విశేషణమున సంధికార్యము మున్నగు వ్యాకరణ విరుద్ధ ప్రయోగములును ఇందు విరివిగా నున్నవి. అంతియకాక 'విమల పాన్పు, నభపథము, కళ్యాణ పాటలు, వరనీల, మౌక్తిక వజ్ర చప్పరములు, మున్నగు అపప్రయోగములు, దుష్ట సమాసములు, ఛందోభంగములు పెక్కు గలవు."

చక్కని ఉపమలతో ఈ కావ్యమునందలి విషయావ బోధనము కడులెస్సగ నున్నది. మచ్చుకు కొన్ని ఉపమలను ఉపలక్షింపుడు:-

1. జల బుద్బుదము వంటి జన్మంబులకును, 2. అల దర్పణంబులో నాననాబ్జంబు చెలువొంద ప్రతిఫలించిన చందముననను, 3. అలరార నీలతోయద మధ్యమందు వెలయు విద్యుల్లేఖ విధమున మఱియు 4. బంగార మొకటియై బహు భూషణములు శృంగారములచేత చిత్రంబులయిన హేమరూపంబు లెన్నగ వేరులయిన, హేమంబునకు భేద మెందైన గలదె?, 5. చెలువొంద ముత్యపు చిప్పలో వ్రాలి, సలిలంబు ముత్యమై సరవిఁ జిప్పనొగి, తొల్లిటి వలె నీలతోయమై పోవు, 6. నిస్తరంగబైన నీరధి మాడ్కి, తెరగొప్ప నిర్వాత దీపంబు కరణి, సరవితో రాకానిశాకరు పగిది, కలలేని నిద్దుర గతిని . . ., 7. చెదరెడి మరుమరీచికఁ జూచి జలము కదలుచున్నది గ్రోలగా వలెననుచు భ్రాంతిచే మృగములు పరువెత్తి కొనుచు, నెంత దూరముఁ జన్న నెదురుగా జలము కదలిపోవుచు నుండు కైవడిగాను 8. పరగ రజ్జువునందు ఫణి తొల్త గలిగి, యరసి చూచిన వెన్క నదిలేని మాడ్కి 9. కను లద్దమును జూచు కాని, యద్దంబు కనులను జూచు టెక్కడనైన గలదె?

మచ్చుగా ఇచ్చిన ఈ సాదృశ్య వాక్యములు రాజయోగ సారమందలి శైలి తెలియుటకు చాలును. ఐనను రచనా విశేషము మఱింత బాగుగ తెలియుటకు నాలుగైదు ఘట్టములు ఉదాహృతములగు చున్నవి:-

**విరక్తి మార్గము :-**

ద్వి. "కాయమస్థిరమని కడ గానలేక
పాయక సంసారబద్ధులై, మమత

వదలక కామ్యార్థ వాంఛితులగుచు
మదమత్తు లగుచు దుర్మార్గంబు నొంది,

మదిలోన నుబ్బి కామ క్రోధ లోభ
మద మోహమత్సరాల్ మాటికి బెంచి,

సంపద గలిగితే సామర్థ్యమనుచు
సొంపగు తుచ్ఛమౌ సుఖమును గోరి,

కామాంధులై తమ గతి గానలేక
తఱుగని యీషణత్రయవార్థిలోన

మఱిమఱి మునుగుచు, మమత రెట్టింప
నాలు బిడ్డలకని యర్థంబు గూర్చి,

కాలంబు నూరక గడుపుచు నుండి,
యంత కాలము వచ్చినప్పుడు యముని

చింత జేయుచు హింసచే గంది కుంది,
కూపంబులోబడి కొన్నాళ్లు కఠిన

పాపాత్ములగుచు, ప్రపంచంబునందు
పుట్టుచు గిట్టుచు పొరలు చుండెదరు;

ఇట్టి పుట్టులు, చావులెన్నంగ వశమె?"
-ప్రథమ ప్రకరణము

ద్వి. వెలిలోను లోలోను, వెలియును గాని
తెలివి తానని చూచు దివ్యశాంతునకు

ముట్టెల్ల విడుచును, మోక్షంబు గలుగు
నట్టి జీవన్ముక్తి యెంత జూచినను

కాశి గయా ప్రయాగల నైన లేదు
దేశ దేశంబులు తిరిగిన లేదు

వెలయ సంసారముల్ విడిచిన లేదు
బలు క్షుత్పిపాసలు పట్టిన లేదు

శిలల బొమ్మల పూజ చేసిన లేదు
తలప దిగంబరత్వములలో లేదు

జడలు దాల్చిన లేదు; సర్వ కాలంబు
నడవుల దిరిగిన, నలసిన లేదు

స్నాన దాన సకామ జపముల లేదు
మౌనంబులను లేదు, మాటల లేదు

వితరణంబుల లేదు, విద్యల లేదు
వ్రతములలో లేదు, క్రతువుల లేదు

మతములలో లేదు, మహిమలో లేదు
సతతంబు నన్నియు నల్పువారలకు.

దేవి! నీవిప్పుడు దేహంబుగావు,
నీవింద్రియంబులు నిజముగా గావు,

నీవు స్త్రీయును గావు, నీవు పుర్షుడవు
గావు, నపుంసకా కారంబు గావు;

భావంబు గావు, నభావంబు గావు;
భావనాతీత సద్బ్రహ్మంబు నీవ.

-ద్వితీయ ప్రకరణము

ద్వి. “ఈ విద్య కర్హుఁడింకెవడంటి వేని
పావన వైరాగ్యపక్షతు లెఱిగి

తలగక మొదటి సాధన చతుష్టయము
చెలగ నభ్యాసంబుఁ జేసినవాడు

శమదమాదులు గల్గి, సద్గురు పాద
కమలంబులే గతిగా నమ్మువాడు

కనుల ముందర పరాంగన నిల్చియున్న
తను గన్న తల్లిగా దలచినవాడు

పరుల విత్తము లగపడిన వీక్షించి,
యఱిముఱి తనకేల నంటనివాడు

ఎక్కడి సంసార? మెక్కడ గలుగు?
నెక్కడ నణగు? నే నెవ్వ? డటంచు

తను దానె వెదకుచు తన మనంబునను
పని బూని యీశ్వరార్పణము జేయుచును

విగత సంకల్పుడై విహిత కర్మములు
తగ సల్పుచును భూతదయ గలవాడు

సంతతంబును యదృచ్ఛా లాభమునకు
సంతసింపుచు, సాధు జనులతో మైత్రి

శాంత వర్తనముచే సలిపెడువాడు

ఆత్మవేత్తల నొక్క సారివంచించి,
‘యది దెల్పు మిది దెల్పు’మని త్వరపడక

సదమలుడై ధర్మ మనవరతంబు
నాత్మలో భావించి యలరెడు వాడు

కారణ గురుమూర్తి గనుసంజ్ఞలోనె
సారెకు మెలగుచు 'స్వామి! యింకేమి

శరణంబులేదు; మీచరణ ద్వయంబె
శరణంబు నాకు నిశ్చయముగా' ననుచు

పదరి తా నడుగక, భక్తి యేమఱక
చెదరక శుశ్రూష చేసెడువాడు

అవనిలో విద్యకు నర్హుడై యుండు."

-తృతీయ ప్రకరణము

ద్వి. "గురుతరంబుగ పూజ గొనెడి వా డేడి?
చిరభక్తితో పూజసేయువా డేడి?

సరవి పూజింప పూజా ద్రవ్యమేది?
యరయగా వాఙ్మనసాతీత మగుచు

నలువొప్ప నిన్ను ధ్యానము సేయుటెట్లు?
పొలుపొందగా సర్వ పూర్ణమౌ నిన్ను

చెలఁగి యావాహన సేయుట యెట్లు?
తలప సర్వమున కాధారమౌ నీకు

విహితాసనంబు గావించుట యెట్లు?
సహజమై, స్వచ్ఛమై యుండెడి నీకు

తనరార నర్ఘ్య, పాద్యము లిచ్చుటెట్లు?
మునుకొని పరిశుద్ధముగ నుండు నీకు

నలర నాచమన మర్పించుట యెట్లు?
మలినంబు లేక నిర్మలతచే నెపుడు

వెలుగుచుండెడి నీకు వేరె తోయమున
చెలువొప్ప స్నానంబు చేయించుటెట్లు?

కొమరొప్ప విశ్వాధికుడవైన నీకు
నమర నీకొక వస్త్ర మర్పించు టెట్లు?

పొలుపొంద నవయవంబులు లేని నీకు
వలనొప్ప భూషణావళి దాల్చుటెట్లు?

అనఘ! నిర్లిప్తుద వైయున్న నీకు
మొనసి పుష్పార్చనమును సేయుటెట్లు?

సలలితంబుగ నిరంజనుడవౌ నీకు
నెలమితో ధూపంబు లిచ్చుట యెట్లు?

వనజాప్త , చంద్ర, పావకుల రూపముల
నొనరెడు దీపంబు నొసగుట యెట్లు?

పొలుపార నిత్య తృప్తుడవైన నీకు
నలరగ నైవేద్య మర్పించుటెట్లు?

మొనసి సదానందమున జొక్కు నీకు
గొనకొని విడెము మక్కువ నిచ్చు టెట్లు?

మురువుగ నాద్యంతములు లేని నీకు
పరువడి మంత్రపుష్పము నిచ్చుటెట్లు?

సునిశిత స్వప్రకాశుడవైన నీకు
నొనర నీరాజన మొసగుట యెట్లు?

అనిశ మనంగుడవౌ నీకు భక్తి
మొనసి ప్రదక్షిణమును జేయుటెట్లు?

వారక యద్వైతవస్తువౌ నీకుఁ
జేరి ప్రణామంబుఁ జేయుట యెట్లు?

సారస్వతుల కగోచరుడైన నిన్ను
ధీరత్వముగ వినుతించుట యెట్లు?

పొలుపొంద నిశ్చితముగ నుండు నదియె
నెలవుగ నిన్ను ధ్యానించు క్రమంబు;

ఊరక నిష్క్రియ నుండు చందంబె
భూరిభక్తిని నిన్నుఁ బూజించు విధము."

-తృతీయ ప్రకరణము

## కృష్ణనాటకము

రాజయోగసారమునకు బిమ్మట ఆమె కృష్ణనాటకము రచించినది. దీనికి బాల కృష్ణనాటకమని మఱియొక నామము కలదు. ఇది యొక యక్షగానము.

కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్తునందు దీని అసమగ్ర తాళపత్ర ప్రతియొకటి కలదు. (1566 నెంబరు)

ఈ నాటకమును గురించి శ్రీ యస్వీ జోగారావు ఇట్లు వ్రాయుచున్నారు:-

"గోపికా కృష్ణ సంవాదము - కృష్ణు డదృశ్యుడగుట - గోపికల అన్వేషణ - అతడు ప్రసన్నుడై వారలతో జలక్రీడ లాడుట - రాధ విరహవేదన - ఆమె గోపాలుని పాలికి చెలికత్తెను బుత్తెంచుట - గోపిక లా రాధాసఖిపై గోపించుట - కృష్ణుడు రాధను ప్రసన్నురాలిని జేసికొనుట - ఇదీ యిందలి విషయము. రచన యొక మోస్తరు"

## పారిజాతాపహరణము (విష్ణు పారిజాతము)

కృష్ణనాటకమునకు బిదప ఆమె పారిజాతాపహరణమును రచించినది. తరిగొండ వెంగమాంబ రచియించిన తొమ్మిది యక్షగానములలో ఇది యొకటి.

దీనిని గుఱించి శ్రీ యస్వీ జోగారావు ఇట్లు వ్రాయుచున్నారు:-

"మదరాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారమున విష్ణుపారిజాతమను పేర దీని కాగితపు ప్రతి యొకటి (ఆర్.నెం. 1056) గలదు. 'శివ విలాసము' తప్పుగా 'శివపారిజాత'మని వ్యవహృతమైనది. తద్భిన్నత గుర్తింపబడుట కిది విష్ణుపారిజాత మైనది.

ఇది యొక యక్షగానము. సుమారు రెండు వేల గ్రంథము. వెంగమ యక్షగాన కృతు లన్నిట పెద్ద దగుటయే కాదు; ప్రథమ గణ్యమును. కృష్ణుడు పారిజాతవృక్షమునే తెచ్చెదనని సత్య ననునయించి, సుఖించుచున్న ఘట్టముతో నిందలి కథారంభము.

పూర్వ కథ సంగ్రహముగా ప్రస్తావింపబడినది. కృష్ణ డొకనా డామెను గికురించి కడమ రాణుల గలియ బోవుట - సత్యభామ విరహము - సత్యా కృష్ణుల సందేశములు - సంవాదములు - సత్యకడకు సరస్వతి కొరవంజియై వచ్చుట - బ్రహ్మ సింగడగుట- సత్య తపస్సుచే ప్రియుని ప్రసన్నుని గావించుకొనుట - కృష్ణుడు స్వర్గమున కేగుట కొక నెపము కల్పించుకొనుట - నరకాసుర వధ కథ అప్పు డనుసంబంధింప బడినది-సందర్భోచితమైన మార్పు - తరువాత పారిజాతా పహరణము - ఇంద్రోపేంద్రుల యుద్ధము - దివిజ తరువు సత్యభామ పెరటికి దిగగానే సవతుల కయ్యము - రుక్మిణి తగవు దీర్చుట - సత్య సవతులకు పారిజాతపు పూల వాయనము లిచ్చుట - ఇట్లు పారిజాత కథ బహుధా ప్రపంచింపబడినది. శృంగార హాస్య రసములు వెల్లివిరిసినవి. సంభాషణలు చతురముగా, రచన రసోత్తరముగా సాగినవి. అవశ్యము లోక ప్రకాశన మొనర్పదగిన కృతులలో నిది యొకటి."

## శ్రీ రమా పరిణయము

పారిజాతాపహరణమునకు బదపడి ఆమె రమాపరిణయము రచించినది. ఇది పెండ్లిపాట. శ్రీ రమాపరిణయము ద్విపద కావ్యము. ఇందు సుమారు ఐదు వందల ద్విపదలు కలవు. సుమారు వేయి పంక్తులు గల ఈ కావ్యమున స్వామి కల్యాణపు వేడుకలు బువ్వముబంతి యందలి ముచ్చట్లు ముచ్చటగా వర్ణితములయినవి. శ్రీవేటూరి ప్రభాకర శాస్త్రి గారు దీనిని "శ్రీ వేంకటేశ్వర లఘు కృతులు" అను గ్రంథములో చేర్చి ప్రచురించియున్నారు.

ఈ కావ్యమున నారాయణుని దేవతలు వివాహము గమ్మని ప్రార్థించుట, నారాయణుడు శేషాచలమున వేంకటేశ్వరుడై వెలసి లక్ష్మిని అలమేలు మంగాభిధానమిచ్చి పెండ్లాడుదునని చెప్పి, బ్రహ్మాదులను క్షీరాబ్ధికడకు కన్య నడుగబంపుట, వివాహ నిశ్చయము, పెండ్లి యేర్పాట్లు, స్వామి కళ్యాణము మున్నగు వర్ణనలు కలవు. ఈ వివాహ వర్ణనమున పెండ్లికి తరలి వచ్చుట, వరపూజ, మంగళ స్నానము, పుణ్యాహవాచనము, స్నాతక వేద వ్రతము, కాశీయాత్ర, కన్యావరణము, మధుపర్క ప్రదానము, కర గ్రహణము, సూత్ర ధారణము, అక్షతారోపణము, లాజహోమము, బువ్వము బంతి, అలక పాన్పు, శేషహోమము మున్నగునవి వరుసగా వివరింపబడినవి.

ఇందు బువ్వముబంతి ఘట్టము విపులముగను, ప్రసాద హాస్యమిళితముగను ఉన్నది. నీరజోదరుడును, నీలకంఠుడును బావా మఱదులు-పరియాచక మాడుకొందురు. ఒకరి పాత్రమున నొకరు ఎంగిలి వైచికొందురు. ఈ ఘట్టము ముచ్చటగ జదువదగి యున్నది:-

ద్వి. "జలజాక్ష! నీవు మా జలరాశి యింటి
కలుముల చెలి నిట్లు గైకొన్న కతన

ననమాన సౌఖ్యంబు లబ్బె నీ కిచట
పొసగ నాకలిదీర భుజియింపవోయి!

మీన రూపము దాల్చి మెండుగా జలము
పానంబు జేసినప్పటివలె గాదు,

ఈ నిర్మలాన్నంబు లిచ్చుట నీవు
పూని యాకలి దీఱ భుజియింపవోయి!

పరగఁ దాబేలివై స్వల్ప జంతువుల
నరుదుగా భక్షించి నటువలె గాదు,

అలర నీ కుడుములు నతిరసంబులును
పొలుపొంద తృప్తిగా భుజియింపవోయి!

దొరకొని పందివై తుంగ గడ్డలను
గరగరన్ నమలిన కైవడి గాదు,

కరిజ కాయలు వడల్ గారె లిడ్డెనలు
పొరిపొరి రుచులుగా భుజియింపవోయి!

పూని నృసింహు రూపున దైత్యు రక్త
పానంబు జేసినప్పటి రీతిగాదు,

తెలివితో నిప్పుడు తేనె పానకము
నలువొప్ప నీవు పానము సేయవోయి!

సలలితంబుగ బ్రహ్మచారి వ్రతముల
నలసి యీ వఱకు, గృహస్థుడైనావు;

విమలాత్మ! నియమముల్ విడిచి
యీవేళ భ్రమదీర నన్నియు భక్షింపవోయి!

లలిని బ్రహ్మఋషిత్వ రాజఋషిత్వ
ముల గాయపండ్లు నిమ్ముగ మెక్కి, దాన

తనియక వెన్నముద్దలు ముచ్చిలించి
తిని, దిగంబరుడవై తిరిగిన నాటి

బడలిక దీఱ నీ పరమాన్న మెల్ల
తొడరి నీ వాచేరతో ద్రావవోయి!"

అని హరుడు అనగా హరి నవ్వి-

ద్వి. "పన్నగాభరణ! యీ పగిది నా తప్పు
లెన్నెద వెపుడు, నిన్నెఱుఁగనే నేను?

చక్కని పునుక కంచంబు చేపట్టి,
యెక్కడెక్కడ బిచ్చమెత్తినగాని

ఆకలి దీఱక, యలనాడు విషము
గైకొని మెక్కిన కైవడిగాదు,

ఇప్పు డీ దివ్యాన్నమిష్టంబుగాను
మెప్పుగా భుజియింపు మేము చూడగను,

మును నీవు ఘనభూతముల సంహరించి,
దనరారమెక్కి, యంతట నైన గాని

పరితృప్తి చెందక, పావనుండైన
చిరుతొండ భక్తుని శిశువు మాంసము

భక్షించినటుగాదు, బహురుచుల్ గాను
భక్షించు మిప్పు డీ భక్ష్యంబులన్ని.

అనలుని కంటిలో నణచి యున్నావు
గనుక నీ కాకలి ఘనముగా నుండు;

కావున నిచ్చోట గల పదార్థములు
నీవె బోసేయుము నేడు సిగ్గేల?

ఎల్ల వారెరుగ నీ వీడిగ దాని
కల్లు కుండను బ్రముచ్చుగతి డాగినావు,

గాన, మాలిన్యంబు గల దది పాయు;
పూని మాయెంగిలిప్పుడు నీవు గుడువు."

అని భుక్త శేషాన్నము అతడు ఆరగించు కనకపాత్రలో వైచెను. శంకరుడు అది చూచి -

ద్వి. "తోయజనయన! క్షుత్తుకుఁ దాళలేక
బోయదానెంగిలి బోసేసినావు,

కావున దోషంబుగల, దది పాయు;
నీవు నాయెంగిలి నే డారగించు."

అని హరి పళ్లెరమందు తన భుక్తశేషమును వేసెను.

'నా సోదరి యైన పార్వతి మొగము చూచి నీ గౌరవము నిలుపుచున్నా'నని నారాయణుడు అనును. నా సోదరి యైన లక్ష్మి మొగము చూచి నీ గౌరవము నిలుపుచున్నానని శంకరుడు అనును. ఈ మేలమాడుటలు ఇట్లు సాగుచుండగా, హరిభుక్త శేషాన్న భక్ష్యములు గైకొని పార్వతి యచటి పంక్తివారి కందటికిని వడ్డించును. సాగర పత్నులయిన యమున, తుంగభద్రలు వడ్డెన లోనికి వచ్చెదరు. వియ్యాలవారిలో సరసోక్తులు మిన్ను ముట్టును. మగ పెళ్లివారు ఆడు పెళ్లివారిని-

ద్వి. "ఉప్పు కప్పులు చేపలుండు మీయింట
తప్పక ఘన పదార్థంబు లెక్కడివి?"

అని మేలమాడగా, ఆడుపెళ్లివారు మగపెళ్లివారిని-

ద్వి. "ఉప్పుతో సంతతంబూరుచున్నట్టి
కప్పులు చేపలు గలవంటి నిచట

చెలియ! మీయన్నకు శేషాద్రిమీద
కలిగియున్నవి వడ్డి కాసులు గనుక,

పేరైన చేరెడు బియ్యమన్నంబు,
సారమింపుగ లేని చప్పిడన్నంబు,

కాటుపోయిన పంటి గంజి సాదంబు
మేటిగా బోసేసి మెరయుచునుండు;

అటువంటి వారికీ యలరు దివ్యాన్న
మెటువలె సైరించు? నిది యేల చాలు;

మిప్పుడు మీ యన్న కిది చాలదంటె
తెప్పింతునా మంచి తిరుపణాచాఋ?"

అని కేరడము జేయుదురు.

బువ్వముబంతి తరువాత అలక. పేరటాండ్రు లక్ష్మిని మగని అలుక తీర్చమని హెచ్చరించెదరు. అప్పుడు లక్ష్మి 'కిలికించి తాపాంగ కించి దానమిత' యగుచు నాయకుని యలుక దీర్చును.

వివాహానంతరము లక్ష్మిని నారాయణుడు తల్లిదండ్రులతో పంపడు. అప్పుడు సాగరుడు -

ద్వి. "ఈ పసి బిడ్డ నిందిరవుగా నుంచి,
యీ పట్లబోను కా ళ్లెట్లాడుమాకు?

మా యింట నాటలే మరగిన యబల
మీ యింట జనులలో మెలగ నెట్లోపు?

చాలఁదల్లుల చెంత చనవుగా నుండు
నీ లేమ భయభక్తు లెరుగునే యిపుడు?"

ఇట్లు కొంతసేపు ఆందోళితుడై కూతు నత్తింట విడిచి వెళ్లుటకు నిశ్చయించుకొని, ఆమెకు ఇట్లు హితోపదేశము చేయును:

ద్వి. "పరగ గాంతలకెల్ల పతిభక్తి దక్క
నిరతంబు మఱియొక్క నియమంబు గలదె?

వర పతివ్రతయైన వనితకు జగము
కరతలామలకంబుగా గానవచ్చు;

కావున పతిభక్తి ఘనముగా నాత్మ
భావించి, నీవు నీపతిఁ గొల్చియుండు."

ఆ యీ పట్టులందు వెంగమాంబ తన స్త్రీ హృదయమును లెస్సగా ప్రదర్శించినది.

'పకపక నవ్వ', 'బుస్సు బుస్సున అల్క', 'నీళ్లలో ముంచు పాలలో ముంచు నీ భార మీ మీద' - మున్నగు పలుకుబళ్లతో ఇందలి శైలి సులభ సుందరముగా ఉన్నది.

'రమాపరిణయము' అను ఈ పెండ్లిపాటను కాక, స్త్రీలయందు తత్త్వజ్ఞానమును పెంపొందించుటకు ఆమె స్త్రీలకొఱకు అనేకములగు పాటలు, పదములు వ్రాసినది.

## చెంచునాటకము

రమా పరిణయమునకు దరువాత ఆమె చెంచునాటకమును రచించినది. ఈ గ్రంథమును గుఱించి శ్రీ యస్వీ జోగారావు ఇట్లు వ్రాయుచున్నారు :-

"ఇది అమెరికన్ డైమండు ముద్రాక్షరశాల ప్రచురణ. మదరాసు 1927. ఇందలి గ్రంథాంత ద్విపదలో వెంగమాంబ తల్లి గంగాంబయని కలదు. ఈ ముద్రణము నిర్దుష్టమైనది కాదు. అది కాక, కడమ గ్రంథములందెల్ల మంగమాంబ యనియే గలదు. అదియే గ్రాహ్యము.

చెంచులక్ష్మి చెల్లెలు తన ప్రియుని వెదకి కొనుచు బావగారి భవనపు చాయలకు వచ్చును. అట తిరుమల వేంకటేశ్వరస్వామి ద్వారపాలకులచే పృచ్ఛింపబడి, చెంచెత తన చరిత్ర, తనవారి చరిత్ర యావత్తు ఏకరువు పెట్టును. తరువాత నీమె ప్రియుడు చెంచునాయుడు వచ్చినాడు. అతనితో వాదులాట అయిన తరువాత, చెంచెత బుడుత నతని కప్పగించి వేటకు బోవును. ఆమె తిరిగి వచ్చుసరికి చెంచునాయని బెదరించి, యొక పులి యా శిశువు నెత్తుకొని పోవును. చెంచెత యంగలార్చి యార్చి, చివరికి శ్రీవేంకటేశ్వరునకు మ్రొక్కుకొని శిశువును బడయును. ఇందు చెంచుల కులాచారములు చక్కగా వివరింపబడినవి. చెంచెత పుత్రశోక ఘట్టము హృదయము నుదిలగొను నట్టిది."

## కృష్ణమంజరి

చెంచునాటకమునకు దరువాత ఆమె కృష్ణ మంజరి రచించినది.

తత్త్వమును బోధించు ఆమె పదములలో 'కృష్ణమంజరి' యొకటి. ఇందు నూట నలుబది నాలుగు ద్విపద మంజరులు కలవు. శతక కవుల చరిత్రకారుడు దీనిని శతకమన వచ్చు ననుచున్నాడు. ఈ కావ్యధోరణి తెలిసికొనుటకు గొన్ని పంక్తులు:-

*"నీవు నాస్వామివి నీ సొమ్ము నేను,*
*కావున బాధ్యమెక్కడఁ బోదు కృష్ణ!*

*శేష భూతను నేను, శేషివి నీవు,*
*కావున బాధ్యమెక్కడఁ బోదు కృష్ణ!*

*పావనుండవు నీవు, పతితుండ నేను,*
*కావున బాధ్యమెక్కడఁ బోదు కృష్ణ!*

*నీవు బాధ్యుడవని నే నిన్నినాళ్లు*
*కనలేకపోతిని క్రమముగా కృష్ణ!"*

శేషభూతుడు- శేషి - స్వామి - సొమ్ము. ఇట్లు అతీత విషయములతో అభివర్ణించుటే కాక, శ్రీకృష్ణుని రూప కల్పనము చేయుచు ఆమె ఇట్లభివర్ణించుచున్నది :-

ద్వి. *"కనకరత్న ప్రభాకలిత మైనట్టి*
*సురుచిర మకుటంబుఁ జూపవే కృష్ణ!*

**తళుకైన కుటిల కుంతల యుక్తమైన**
**సలలిత ఫాల దేశముఁజూపు కృష్ణ!**

సుందర భ్రూలతాశోభితంబైన
కనుగవ బెళుకు చక్కగఁ జూపు కృష్ణ!

ముదిరిన సంపెంగ మొగ్గకైవడిని
కమనీయమగు నాసికముఁ జూపు కృష్ణ!

నిరుపమ కుంద సన్నిభ దంతచయము
రమణీయ బింబాధరముఁ జూపు కృష్ణ!

మెఱుగైన కురికురి మీసంబులమర
సొగసైన చుబుకంబుఁ జూపవే కృష్ణ!

పలుమఱు సిరుల జొంపము లీనుచున్న
చెక్కుటద్దములు మచ్చికఁ జూపు కృష్ణ!

మకర కుండలయుగ మణిగణ కలిత
గండభాగములు తక్కక చూపు కృష్ణ!

ఇన్ని చిహ్నంబుల కిరవైన వదన
పరిపూర్ణ చంద్ర బింబముఁ జూపు కృష్ణ!

శంఖ చక్ర గదాబ్జ సహితంబులగుచు
నొనరు చతుర్బాహువులఁ జూపు కృష్ణ!

కౌస్తుభమణిహార కలితమై, కంజ
నిభమైన కంఠంబు నెఱిఁ జూపు కృష్ణ!

సిస్తుగా వనమాల, శ్రీ వత్సములకు
సదనమైనట్టి వక్షముఁ జూపు కృష్ణ!

బ్రహ్మాండభాండముల్ బహు కోటులుండ
సూక్ష్మమౌ నుదర మచ్చుగఁ జూపు కృష్ణ!

పలుమఱు విశ్వకల్పన సేయు బ్రహ్మ
సదనమౌ నాభి కంజముఁ జూపు కృష్ణ!

అనుపమ మణి మేఖలావృతంబైన
మృగపమధ్యమును నెమ్మినిఁ జూపు కృష్ణ!

కనకాంబరాబద్ధ కలితోరుకాంతి
మయమైన యూరు యుగ్మంబుఁ జూపు కృష్ణ!

అంబుధి కన్యకా హస్తోపచార
లలితమైనట్టి జంఘలఁ జూపు కృష్ణ!

బ్రహ్మ రుద్రాది దిక్పతులైనవారు
మ్రొక్క నొప్పగు పాదములు చూపు కృష్ణ!

గంగాతరంగ సంగత వామపాద
భానురాంగుష్ఠ మేర్పడఁ జూపు కృష్ణ!"

ఈ కావ్యమునకు ఆమె ఫలశ్రుతిని ఇట్లు చెప్పుచున్నది:

ద్వి. "ఇది కృష్ణ జపతుల్య మిది మోక్షదంబు
శిష్టులై యిది పఠించిన వారికెల్ల

మొనసి కామ్యార్థముల్ మున్నిచ్చి,తుదను
పరమపదం బిచ్చు బాలకృష్ణుండు."

'యాదృశీ భావనా యత్ర సిద్ధి ర్భవతి తాదృశీ', 'కపి కిశోర న్యాయము', 'మార్జాల కిశోర న్యాయము' - మున్నగు సంస్కృతోక్తులతో, పసందైన తెనుగు పలుకుబళ్లతో ఇందలి శైలి సొంపుగా ఉన్నది.

దీనిని 1913 సం॥ లో శ్రీ రెంటాల వెంకట సుబ్బారావు 'స్మరణానందము' అను గ్రంథమున చేర్చి ప్రచురించియున్నారు.

## రుక్మిణీ నాటకము

కృష్ణమంజరికి పిమ్మట ఆమె రుక్మిణీ నాటకమును రచించినది. ఈ యక్షగానము నేడు దొరకకున్నది.

## గోపికా నాటకము

రుక్మిణీ నాటకమునకు దరువాత ఆమె గోపికా నాటకమును రచించినది. ఈ యక్షగానము నేడు దొరకకున్నది.

## భాగవతము

కృష్ణజీవితమునకు సంబంధించిన ఈ నాటకముల తరువాత, తరిగొండ వెంగమాంబ కృష్ణజీవితమును విపులముగ కథించు భాగవతమును రచించినది. భాగవతమును, వేంకటాచల మాహాత్మ్యమును ఆమె రచియించిన గ్రంథములలో మిక్కిలి పెద్దవి, ఉత్కృష్టమైనవి.

భాగవతమునందలి ద్వాదశ స్కంధములును తాను ద్విపద కావ్యముగా రచియించినట్లు వేంకటాచల మాహాత్మ్యమున ఆమె యిట్లు చెప్పుచున్నది:-

*"... భాగవతపురాణ మమర నే ద్విపద కావ్యంబుగాను*
*ద్వాదశ స్కంధముల్ తగఁ జెప్పి హరికి సమర్పించి......"*

తరిగొండ వెంగమాంబ ద్విపద భాగవతమునందలి ఆఱు స్కంధముల ప్రతి మదరాసు నందలి ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారమున గలదు. ఈ గ్రంథకర్త గృహలక్ష్మి పత్రికకు సంపాదకుడుగా ఉన్నప్పుడు 1931వ సంవత్సరమున ఈ భాగవతమును ఆ పత్రికలో భాగములుగ ప్రచురించుటకు ప్రారంభము చేసెను. ఆ ప్రచురణము కొద్ది మాసములు సాగిన తరువాత కారణాంతరములచే నిలిచిపోయినది.

ఈ భాగవతము ద్వాదశ స్కంధములును సేకరించి ప్రచురణార్థము చిత్రాడ ఆంధ్ర గ్రంథ పరిశోధకమండలి వారికి పంపియున్నామని కవి పండితులు, మిత్రులు ఐన శ్రీవేదము వేంకట కృష్ణ శర్మ చెప్పుచున్నారు. చిత్రాడవారును ఆ గ్రంథమును ప్రచురించినట్లు కనిపించదు.

1948వ సంవత్సరమున బెంగుళూరు నుండి శ్రీ వెల్లలూరు వేంకట రాఘవశర్మ (ఎం.ఓ. ఎల్) సంపాదకత్వమున వెలువడిన సాంస్కృతిక మాస పత్రిక 'ప్రశాంతి' యందు ఈ భాగవతము మాస క్రమమున కొంత ప్రచురణ మందినది. కాని ఆ ప్రచురణము కూడ తుదముట్టినట్లు కనిపించదు. గ్రంథ ప్రచురణమునకు సాగిన పయి మూడు ప్రయత్నములును తుదముట్ట లేదు. ఇది ముద్రింపదగిన ఉత్తమ కావ్యము.

భాగవతము రచింపవలసిన విధానమును చిన్నికృష్ణుడు ఆమె కిట్లు చెప్పినట్లు కలదు:-

ద్వి. "ఘనతరంబైన భాగవతంబునందు
మొనసిన తత్త్వార్థములను బామరులు

తెలియలే,రటు గాన తేటగా తత్త్వ
ములనెల్ల సంక్షేపముగ రచియించి,

హరి పరాక్రమములు, హరి విహారములు
వారియవతారముల్, హరి మహత్త్వంబు

పొలుపొంద విస్తరింపుము నీవటంచు"

తత్త్వార్థములు గల భాగములను సంక్షేపింప సంకల్పించినది. రాజయోగసారము రచియించిన నాటికిని, భాగవతము రచియించునాటికిని ఆమె చిత్తవృత్తిలో వచ్చిన మార్పు ఇందువలన తేటతెల్లమగుచున్నది. రాజయోగసార మందలి విషయము కూడ భాగవతములోనిదే. అది రచియించునాటికి ఆమె దృష్టి రాజయోగాది వేదాంత విషయము లందు ఎక్కువగా లగ్నమై యుండెను.

ఇప్పు డామె బుద్ధి బాగుగ పరిణతి చెందినది. ఆమెకు ఇప్పుడు విశ్వశ్రేయో దృష్టి కలిగినది. పామరులకు భాగవతము నందలి హరి మాహాత్మ్యమును చెప్పుటయే ఇప్పటి ఆమె ప్రధాన లక్ష్యము. ఆ లక్ష్యముతోడనే ఆమె భాగవతమును ద్విపదగా సులభశైలిలో రచియించినది.

గ్రంథాదిని ఆమె ఇష్టదేవతాది ప్రార్థనము ఇట్లు చేసినది:-

ద్వి. "శ్రీగణపతిని శ్రీక్షేత్ర పాలకుని
నాగమ సంవేద్యు నతిభక్తిఁ గొలిచి,

పరగ నందవరీక వరకులంబిలను
సారంబుగాఁ బ్రోచు చౌడాంబఁ దలచి,

వరుస సూర్యాది నవ గ్రహంబులకు
మురువార కరములు ముకుళించి మ్రొక్కి,

మేలుకై వ్యాస వాల్మీక్యాదులైన
లాలిత కవులను లక్ష్య మందుంచి,

సర్వ మతాచార్య సముదయంబులను
సర్వ పండితులను జాలకీర్తించి,

సకల సన్మౌనుల, సకల దేవతల,
సకల యోగీంద్రుల చరణముల్ కొలిచి,

యురుభక్తి నాంజనేయుని, నారదాది
వరభాగవతులను వరుస సేవించి,

పరగ నవ ప్రజా ప్రతుల, వాణీశు
నిరవొందగా నుతియింపుచు, మరియు

జగతి ననంత విష్వక్సేన ముఖ్యు
లగు నిత్యముక్తుల నాత్మ భావించి,

నాయిష్ట దైవమై నన్ను సంతతము
బాయకున్నటువంటి పట్టాభిరాము

విగ్రహంబాత్మలో వీక్షించి, విద్య
కగ్రేసరుండైన హయముఖుఁ బొగడి

శ్రీవరాహస్వామి శ్రీపాదములను
భావించి మది నుంచి, ప్రాపుగా నెంచి,

శ్రీ మానినీలోలు శృంగారలీలు
హేమ భాస్వరచేలు నిభరాజపాలు

కమలజనుత శీలు కరుణాలవాలు
నమిత కీర్తి విశాలు నఖిలైక మూలు

బహు దనుజ విఫాలు భవభయోన్మోలు
మహితకాంతి కపోలు మధుర వాగ్జాలు

కలికలుష విదారు కనకాద్రి ధీరు
జలనిధి గంభీరు జగదేక వీరు

గురుశేషగిరివాసు కోమలహాసు
చిరతర సువిలాసు శ్రీ శ్రీనివాసు

యదుకులాంబుధి సోము నంబుదశ్యాము
సదమల గుణధాము సంపూర్ణ కాము

సరసముని స్తోము జగదభిరాము
తరిగొండపురి ధాము తారకనాము"

- ప్రథమస్కంధము.

భాగవత ప్రాశస్త్యమును ఆమె ఇట్లు చెప్పుచున్నది:-

ద్వి. "రమణీయ మత్స్య పురాణంబులోన
నమరఁగా గాయత్రి నధికరింపుచును

జనులకు ధర్మ విస్తారంబు, వృత్రు
డనెడు దైత్యుని ద్రుంచినట్టి దోషంబు

పరిహారమెందు జెప్పంబడు, నదియె
వరుసగా శ్రీ భాగవతమంద్రు బుధులు.

వలనొప్ప నీభాగవత పురాణమును
వెలసిన భక్తితో వినగోరుచున్న

వారి చిత్తములకు వారిజోదరుడు
శ్రీరమాధీశుండు చిక్కును గాక,

తక్కిన శాస్త్రముల్ తామెన్ని వినిన
జిక్కడు విష్ణుండు చిత్తవల్లులకు,

గనుక భాగవత ముత్కంఠ దీపింప
వినగోరు మనుజులు విమల వర్తనులు.

తాపత్రయము నందు దగులక సుఖద
మై పరమార్థమైనట్టి వస్తువును

కనుగొనవచ్చు భాగవతంబునందు,
ఘనతరమగు వేద కల్పవృక్షమున

ప్రకట భాగవతాఖ్య ఫల ముద్భవించి,
శుకముఖమ్మున జాఱె సుధయుఁ, దదమృత

రసమును గ్రోలి, నీరస కర్మఫలము
నసమాన మతి వీడు నతడు ధన్యుండు."

- ప్రథమ స్కంధము

పురాణ ప్రసిద్ధమైన నైమిశారణ్యమును ఆమె యిట్లు వర్ణించుచున్నది:-

ద్వి. "మందార జంబీర మన్మథ వకుళ
కుంద చందన సాల కురవక క్రముక

వట బిల్వ బదరి కాశ్వత్థ మాలూర
కుటజ హింతాళ తక్కోల తమాల

నారికేళార్జున నారంగ పనస
పారిజాతాశోక పాటలీ తిలక

కదళికా ప్రముఖ వృక్షంబు లెల్లపుడు
పొదుపుగా చిగిరించి, పూచి, ఫలించి,

వలనొప్ప నందన వనము చందమున
కలకాలమును చల్లగా నొప్పుచుండు;

శుక పిక ప్రముఖ పక్షులు కొన్ని చెలగి
ప్రకట సత్ఫల రసపానంబు జేసి,

పక్షీంద్ర తతితోడ బలసి మదించి,
వృక్ష రాజములపై విహరింపుచుండు;

ప్రవిమల మునులు తప్పక నాచరించు
సవనాగ్ని ధూమంబు జలదంబటంచు,

వెలయ హోతలు సేయు వేదఘోషంబు
జలద గర్జనము నిశ్చయముగా ననుచు,

వారక కేకారవములు గావించు;
గౌరవంబెసగ రెక్కలు విప్పి విప్పి,

లాలిత వర్ణశాలల చుట్టు నిలిచి,
నీలకంఠంబులు నృత్తముల్ సలుపు;

పంకజాకరముల పజ్జల వ్రాలి
పొంకంబులైన పుప్పొడి కుప్పలందు

ఒప్పుగాఁ జేరి సముజ్జ్వల గతుల
నప్పుడప్పుడు హంసలాడుచు నుండు;

మొనసి రామాయణమ్ములు పఠింపుచును,
మునుల కర్ణములకు ముదము నిచ్చుచును,

వన్నె కెక్కిన యజ్ఞ వాటంబులందు
క్రన్నన నళులు ఝుంకారముల్ సేయు;

తిరములై యచ్చట ధేనువుల్, పులులు
కరిరాజ బృందముల్, కంఠీరవములు

మొదలైన బహు మృగములు జాతివైర
మదముల వీడి, సమ్మత విహారముల

వరుసగా నందందు వర్తింపుచుండు;
పరమపావన తీర్థ పటల మచ్చోట

నమర గంగా ప్రవాహంబు చందమున
నమలమై యఘముల హరియింపుచుండు;

బలు సెలయేర్ల దిబ్బల కొండచఱుల
లలిమించు కందమూల ఫలాదు లెపుడు

గలుగు; నీ కాల మా కాలంబు ననక
పొలుపగుచుండి, యెప్పుడు సుగంధంబు

భూరి దిగంతంబుల నిండుచుండు;
నారూఢి నా నైమి శారణ్య భూమి."

- ప్రథమ స్కంధము

మాధవుని మహనీయ ప్రభావమును సూతుని వద్ద మును లిట్లని కొనియాడినట్లు వెంగమాంబ వచియింపుచున్నది:-

ద్వి. "తాపసోత్తమ! యిది తథ్యమెట్లనిన
శ్రీపతి లీలా విశేషంబు లనెడి

ఘన సుధా వృష్టిచే గాక, తదన్య
మనగ గల్గిన సాధనాంతరం బనెడి

మంచుచే సంతాపమాయానలంబు
చంచలింపక నేల చల్లారిపోవు?

హరినామ కథన దావాగ్నిచే ఘోర
తర పాప విపినాళి దగ్ధంబు గాదె?

వనజాక్షు దర్శన వాయువుచేత
జనవె దుస్తర దుఃఖ జలద మాలికలు?

నడర విష్ణుధ్యాన హర్యక్ష పటిమ
మడియవె సంతాప మద గజేంద్రములు?

వరకృష్ణ లీలాశ్రవణ భానుదీప్తి
నరుగదె ఘోర మాయాంధకారంబు?

నరహరి పద భక్తి నావచే విపుల
తరభవాంభోధిఁ దరియింపరాదె?"

- ప్రథమస్కంధము

ఈ ఘట్టము నందలి పోతరాజు పద్యములను తిలకింపుడు:-

మ. వరగోవింద కథా సుధారస మహావర్షోరుధారాపరం
పరలంగాక బుధేంద్రచంద్ర! యితరోపాయానురక్తిం బ్రవి
స్తర దుర్దాంత దురంత దుస్సహజనుస్సంభావితానేక దు
స్తర గంభీర కఠోర కల్మష కనద్దావానలం బాఱునే?

సీ. "హరినామ కథన దావానల జ్వాలచేఁ
గాలవే ఘోరాఘ కాననములు?
వైకుంఠదర్శన వాయు సంఘంబుచేఁ
దొలఁగవే భవ దుఃఖ తోయదములు?
కమలనాభ ధ్యాన కంఠీరవంబుచేఁ
గూలవే సంతాప కుంజరములు?
నారాయణస్మరణ ప్రభాకరదీప్తి
దీఱవే షడ్వర్గ తిమిర తతులు?

ఆ. నలిన నయన భక్తి నావచే గాక సం
సార జలధి దాటి చనగరాదు;
వేయు నేల మాకు? విష్ణు ప్రభావంబు
దెలుపవయ్య సూత! ధీ సమేత!"

పోతరాజు ఉగ్ర సుందరశైలిలో తెలిపిన విషయములను వెంగమాంబ సులభ సుందరశైలిలో తెలిపినది. భాగవతము ద్వాదశ స్కంధములును ఆమె యీ విధముననే పోతరాజు భావములను పుణికి పుచ్చుకొనుచు, స్త్రీలకు, పామరులకు తెలియునట్లు తేట తెనుగున చెప్పినది.

కృత్యాదిని ఈ పద్ధతిని ఆమె ప్రకటించియే యున్నది:-

ద్వి. "ఆనాడు పోతరాజాత్మయందుండి
నానార్థ సార నిర్ణయ వాక్యములను

బలికించినటువంటి పట్టాభిరాము
డలర నామీద నే డభిమానముంచి,

చెలువొప్ప నెపుడు నాజిహ్వ యందుండి
పలికించినటుల నేఁబల్కి తత్కృతిని..."

నాడు పోతరాజును పలికించిన రామభద్రుడే నేడు తనను కూడ పలికించుచున్నాడని ఆమె చెప్పుచున్నది. పోతరాజు వివిధ పద్య గద్యములలో చెప్పిన భావములను ఆమె పొంకముగ ద్విపదలో ఇమిడ్చి చెప్పినది.

పోతరాజు భాగవతము నుండియు, వెంగమాంబ భాగవతము నుండియు ఒక ఘట్టమును తీసికొని, ఒక ఉదుటున చదివితిమేని ఈ సంగతి తేటతెల్లమగును.

ప్రథమ స్కంధములోని అశ్వత్థామ పరాభవ ఘట్టమును పోతరాజును, వెంగమాంబయు ఎట్లు నడపిరో చూతము:-

## ఖిలరాజు రచన

వ. భీము గదాఘాతంబున దుర్యోధనుండు దొడలు విఱిగి కూలిన నశ్వత్థామ దుర్యోధనునకుం బ్రియంబు సేయువాడై, నిదురపోవు ద్రౌపదీ పుత్రుల శిరంబులు ఖండించి తెచ్చి సమర్పించె; నది క్రూరకర్మంబని లోకులు నిందింతురు.

ఉ.బాలుర చావు కర్ణములఁ బడ్డ గలంగి, యలంగి యొరువం
జాలక, బాష్పతోయకణజాలము చెక్కుల రాల నేడ్చి పాం
చాల తనూజ నేలఁబడి జాలి బడం,గని యెత్తి మంజువా
చాలత జూపుచుం, జికురజాలము దువ్వుచు గ్రీడి యిట్లనున్.

మ.ధరణీశాత్మజ వీవు, నీకు వగవన్ ధర్మంబె? యాద్రౌణి ని
ష్కరుణుండై విదళించె బాలకుల, మద్గాండీవ నిర్ముక్త భీ
కర బాణంబుల నేడు వాని శిరమున్ ఖండించి నే దెత్తుఁ; ద
చ్ఛిరముంద్రొక్కి జలంబు లాడు మిచటన్ శీతాంశుబింబాననా!

వ. అని యిట్లాడంబఱిచి, తనకు మిత్రుండును, సారథియునైన హరి మేలనుచుండం గవచంబు దొడిగి, గాండీవంబు ధరించి, కపిధ్వజుండై గురుసుతుని వెంట రథంబుఁ దోలించిన.

శా.తన్నుం జంపెదనంచు వచ్చు విజయున్ దర్శించి, తద్ద్రౌణి యా
పన్నుండై శిశుహంత గావున నిజప్రాణేచ్ఛ బాఱెన్ వడిన్;
మున్నా బ్రహ్మ మృగాకృతిం దనయకున్ మోహించి క్రీడింప, నా
సన్నుండౌ హరుఁ జూచి పాఱుపగిదిన్ సర్వేంద్రియ భ్రాంతితోన్.

వ. ఇట్లోపినంత దూరంబు బరువిడి, వెనుకఁ జూచి రథ తురగంబు లలయుట దెలిసి, నిలిచి ప్రాణరక్షణంబునకు

నొండుపాయంబు లేమి నిశ్చయించి, జలంబుల వార్చి, ద్రోణనందనుండు సమాహిత చిత్తుండై ప్రయోగంబ కాని యుపసంహారంబు నేరకయుఁ, బ్రాణసంరక్షణార్థంబు పార్థుని మీద బ్రహ్మ శిరోనామకాస్త్రంబుం బ్రయోగించిన, నది ప్రచండ తేజంబున దిగంతరాళంబు నిండి ప్రాణిభయంకరమై తోచిన, హరికి నర్జునుం డిట్లనియె.

క. ఇది యొక తేజము భూమియుఁ
జదలును, దిక్కులును నిండి సర్వంకషమై
యెదురై వచ్చుచునున్నది
విదితముగా నెఱుగఁ జెప్పవే దేవేశా!

వ. అనిన హరి యిట్లనియె.

శా. జిహ్మత్వంబునఁ బాఱి ద్రోణజుఁడు దుశ్శీలుండు ప్రాణేచ్ఛమై
బ్రహ్మాస్త్రం బదె యేసె, వచ్చె నిది తద్బాణాగ్ని బీభత్సు! నీ
బ్రహ్మాస్త్రంబున గాని దీని మరలింపన్ రాదు; సంహార మీ
బ్రహ్మాపత్య మెఱుంగఁ; డేయుము వడిన్ బ్రహ్మాస్త్రమున్ దీనిపై.

వ. అనిన నర్జునుండు జలంబుల వార్చి హరికిం బ్రదక్షిణంబు వచ్చి, ద్రోణనందనుండేసిన బ్రహ్మాస్త్రంబు మీదఁ దన బ్రహ్మాస్త్రంబుం బ్రయోగించిన.

మ. అవని వ్యోమములందు నిండి తమలో నా రెండు బ్రహ్మాస్త్రముల్
రవి వహ్నిద్యుతిఁ బోరుచుం ద్రిభువన త్రాసంబు గావింపగా,
వివశ భ్రాంతి యుగాంతమో? యని ప్రజల్ వీక్షింప, నా వేళ మా
ధవునాజ్ఞన్ విజయుండు చేసె విశిఖద్వంద్వోపసంహారమున్.

వ. ఇ ట్లస్త్రద్వయంబు నుపసంహరించి, ధనంజయుండు ద్రోణనందనుంగూడ నరిగి పట్టుకొని, రోషారుణితలోచనుండై యాజ్ఞికుండు రజ్జువునం బశువుఁ గట్టిన చందంబున బంధించి, శిబిరంబు కడకుం గొని చని హింసింతునని తిగిచినం, జూచి హరి యిట్లనియె.

ఉ.మాఱు పడంగలేని యసమర్థుల సుప్తుల నస్త్రవిద్యలం
దేఱని పిన్నపాపల వధించె నిశీథమునందు గ్రూరుడై;
పాఱుడె వీడు పాతకుడు! ప్రాణ భయంబున వెచ్చ నూర్చుచుం
బాఱెడి; వీనిఁగావుము కృపామతి నర్జున! పాపవర్జనా!

చ. వెఱచిన వాని, దైన్యమున వేదుఱు నొందిన వాని, నిద్రమై
మఱచిన వాని, సౌఖ్యమున మద్యము ద్రావిన వాని, భగ్నుడై
పఱచిన వాని, సాధు జడభావము వానినిఁ, గావుమంచు నా
చఱచినవాని, గామినులఁ జంపుట ధర్మము గాదు ఫల్గునా!

శా.స్వప్రాణంబుల నెవ్వడేని గరుణాసంగంబు చాలించి య
న్య ప్రాణంబుల చేత రక్షణము చేయున్ వాడధోలోక దుః
ఖ ప్రాప్తుండగు, రాజదండమున నత్కల్యాణుడౌ; నైన నీ
విప్రుం దండితుఁజేయ నేటికి? మహావిభ్రాంతిచే నుండగన్.

వ. అని యివ్విధంబున గృష్ణుం డానతిచ్చిన ధర్మంబు దలంచి చంపక, ద్రుపదరాజ పుత్రికిం దన జేసిన ప్రతిజ్ఞం దలంచి బద్ధుండైన గురునందనుం దోడ్కొని, కృష్ణుండు సారథ్యంబు సేయ శిబిరంబు కడకు వచ్చి.

క. సురరాజసుతుడు సూపెను
దురవధిసుతశోకయుతకు ద్రుపదుని సుతకున్
పరిచలితాంగ శ్రేణిన్
పరుషమహాపాశబద్ధ ప్రాణిన్ ద్రౌణిన్.

వ. ఇట్లర్జునుండు దెచ్చి చూపిన బాలవధ జనిత లజ్జా పరాఙ్ముఖుండైన కృపి కొడుకుం జూచి మ్రొక్కి, సుస్వభావయగు ద్రౌపది యిట్లనియె.

మ.పరగన్ మామగవారలందఱును మున్ బాణ ప్రయోగోప సం
హరణాద్యాయుధవిద్య లన్నియును ద్రోణాచార్యుచే నభ్యసిం
చిరి; పుత్రాకృతి నున్న ద్రోణుడవు; నీ చిత్తంబులో లేశముం
గరుణాసంగములేక శిష్య సుతులన్ ఖండింపగాఁ బాడియే?

క. భూసురుడవు, బుద్ధి దయా
భాసురుడవు, శుద్ధ వీర భట సందోహా
గ్రేసరుడవు, శిశు మారణ
మాసుర కృత్యంబు ధర్మమగునే తండ్రీ!

శా.ఉద్రేకంబున రారు, శస్త్ర ధరులై యుద్ధావనిన్ లేరు, కిం
చిద్ద్రోహంబును నీకుజేయరు, బలోత్సేకంబుతోఁ జీకటిన్
భద్రాకారులఁ చిన్నపాపల రణప్రౌఢక్రియాహీనులన్
నిద్రాసక్తుల సంహరింప నకటా నీచేతు లెట్లాడెనో?

ఉ.అక్కట పుత్రశోక జనితాకుల భార విషణ్ణ చిత్తనై
పొక్కుచు నున్న భంగి నినుఁబోర గిరీటి నిబద్ధుఁ జేసి నే

డిక్కడ కీర్తి తెచ్చుట సహింపనిదై భవదీయ మాత నే
డెక్కడ నిట్టి శోకమున నే క్రియ నేడ్చుచుఁ బొక్కుచున్నదో?

వ. అని కృష్ణార్జునులం జూచి యిట్లనియె.

ఉ.ద్రోణునితో శిఖిం బడక ద్రోణ కుటుంబిని యున్నదింట, న
క్షీణ తనూజ శోక వివశీకృతనై విలపించు భంగి నీ
ద్రౌణిఁ దెరల్చి, తెచ్చుటకు దైన్యము నొందుచు నెంత పొక్కునో?
ప్రాణవిముక్తుడైన నతి పాపము; బ్రాహ్మణ హింస మానరే!

క. భూపాలకులకు విప్రులఁ
గోపింపం జేయదగదు; కోపించినఁ దత్
కోపానలంబు మొదలికి
భూపాలాటవులఁ గాల్చు భూకంపముగాన్.

వ. అని యిట్లు ధర్మంబును, సకరుణంబును, నిర్వ్యాళీకంబును, సమంజసంబును, శ్లాఘ్యంబునుం గా బలుకు ద్రౌపది పలుకులకు ధర్మనందనుండు సంతసిల్లె; నకుల సహదేవ సాత్యకి ధనంజయ కృష్ణులు సమ్మతించిరి.

ఇదే ఘట్టము వెంగమాంబ రచనమున-

ద్వి. "కౌంతేయులకు మేలు గలిగినందుకును
కుపితుడై కురురాజు కూలినందుకును
కపటియై ద్రోణుడు గన్న సుతుండు
తొలగి తానపుడును దుర్యోధనునకు
విలపించి, ప్రీతి గావించెదననుచుఁ

దగ నిద్రఁ బోయెడి ద్రౌపది సుతుల
దెగటార్చి, శిరములు దెచ్చి యారాజు

ముందరఁ బెట్టి యమ్మూర్ఖుండు లోక
నిందితుండయ్యెను నిష్కారణముగ,

నప్పు డశ్వత్థామ యాత్మనందనుల
దెప్పునఁ జంపిన తెగువ వేవేగ

విని, ద్రౌపదీదేవి వెలవెలబోయి,
కనుల బాష్పము లొల్కగా నేడ్చుచున్నఁ

గనికరంబున జూచి కవ్వడి ద్రుపద
తనయ 'నేడ్వకు'మని తా నూరడించి,

పలికె నిట్లనుచు: 'నో పాంచాలి! నీవు
కలగ నేమిటి కైన కార్యసంగతికి?

నీ వెంత వగచిన నీ తనూజులకు
జీవముల్ వచ్చునె? చెనటియై సుతులఁ

జంపిన ద్రౌణి నేఁ జంపి తచ్ఛిరముఁ
దెంపుగా నిచటకు తెచ్చి యిచ్చెదను;

వాని శిరముఁ దన్నివైచి, యా వెనుక
స్నానంబుఁ జేయు నీ చలమెల్ల దీఱ'

ననియొడంబఱచి, శౌర్యంబు దీపింప
తన మిత్రుడై నట్టి దనుజారి తోడ

విడిబడి రథమెక్కి వెనువెంట జనెడు
వడిఁ జూచి బెదరి యశ్వత్థామ యుతికి,

దూరంబుగాఁ బోయి దుఃఖించుకొనుచు,
ధీరత నెడబాసి దేహాభిమాని

యగుచు జలంబులం దాచమనంబు
తగ జేసి, పద్మజాస్త్ర ప్రయోగంబు

నురువడి తా నేర్చి , యుపసంహరించు
సరణి నెఱుంగక చపలాత్ముడగుచు

ప్రాణాపదను మించి బ్రహ్మాస్త్రమపుడు
ద్రౌణి పార్థునిమీద తాఁ బ్రయోగించె;

నప్పు డా బ్రహ్మాస్త్రమగ్ని గ్రక్కుచును
తెప్పున రాఁ జూచి దేవకీ సుతుని

జూచి యాఖండల సుతు డిట్టు లనియె:
'ఓ చక్రపాణి! మహోత్పాతమగుచు

కాలానల జ్వాలగతి విజృంభించి,
చాల భూమ్యంతరిక్షములందు నిండి,

యిదె మన కెదురుగా హెచ్చుచు వచ్చె
నిదియేమి?' యన రుక్మిణీశు డిట్లనియె:

'విను, పార్థ! యా ద్రౌణి వెఱపుతో నురికి
పని బూని మఱలి యీ బ్రహ్మాస్త్ర మేసె;

నింక నుపసంహార మెఱుగడు వాడు
ప్రకటమైనట్టి నీ బ్రహ్మాస్త్ర మిపుడె

తనరార దీని మీఁ దను ప్రయోగింపు!'
మనవుడు విని పార్థు డాచమనంబు

నరగున గావించి; జలజోదరునకు
చిరభక్తితో ప్రదక్షిణము గావించి,

భీమసాహసమున బేర్చి యర్జునుడు
నా మింట వచ్చు బ్రహ్మాస్త్రంబు మీద

పటుశక్తితో తన బ్రహ్మాస్త్ర మేసె;
నట నిటు బోక బ్రహ్మాస్త్రముల్ రెండు

ప్రళాయాగ్ని బింబంబు భానుబింబంబు
కళవళ పడక తక్కక పోరు రీతిఁ

బోరఁ దిగంతరంబులు భూనభములు
భోరుకొల్పుచు మహాద్భుతముగానుండె;

నపుడు పార్థునిజూచి హరి 'యీశరముల
నుపసంహరింపు మో, యుచితజ్ఞ!' యనిన

నప్పు డౌననుచు బ్రహ్మాస్త్ర యుగ్మంబు
నొప్పుగా గాండీవి యుపసంహరించి

యెదిగి నశ్వత్థామ నెగసి పట్టికొని,
పదరి యాజకు డొక్క పశువును బట్టి

కట్టిన చందంబుగా గట్టివేసి,
చిట్టాడనీయక శిబిరంబుఁ జేర్చి,

'యచ్చట హింసింతు'నని విజృంభింప,
చెచ్చెర కృష్ణుండు చెయిఁ బట్టి తిగిచి,

'నిలు!నిలు! మర్జున! నీ విప్రు డతని
చలము పెంపున నేల చంపబూనెదవు?

పదటుదనమున నీ పాపాత్ము డకట!
చెదరక నిదురించు శిశువుల జంపె;

నట్టి క్రూరుని విప్రుడనుచు నీ కింత
పట్టి చంపుట గాదు, ప్రాణభయమున

పాలిపోయి వెలవెలబోవుచున్నాడు;
తల వాంచి, పెదవులు దడుపుచున్నాడు;

వినుము చావున కింత వెఱచువారలను,
నొనర నిద్దురబోవుచుండు వారలను,

అతిసౌఖ్యమున మత్తులైన వారలను,
బ్రతిమాలుచును పుల్లపడిన వారలను,

పూరిఁగఱచువారిఁ, బోరాడలేక
పాఱిపోయెడువారి, బాలుర, సతుల,

జగతీసురులఁ బట్టి చంప రాజులకు
తగవుగా దందురు ధర్మ తత్పరులు.

తన శరీరమునైనఁ దా వీడి ,యన్య
జనులను రక్షించు జనపాలకుండు

ఘనమైన యూర్ధ్వలోకమునందు జేరు;
చెనటియై తప్పు చేసిన మానవుండు

డాకైన రాజదండనముచే నూర్ధ్వ
లోకంబుఁ గాంచు; నీ లోక నిందితుడు

అరసి చూడ వధార్హుఁడగు; నైన నీతి
మఱచి, భీతుని విప్రమాత్రుని నీవు

నీ రీతి ఖండింపనేలను? వీడు
ప్రారబ్ధమున నేడు బద్ధుడైనాడు;

మంచిది, వానికర్మము వాడె యనుభ
వించుగా! కింపుడెంతొ వెఱచుచుండగను.

తెంపుగా నీ పరదేశి నిచ్చోటఁ
జంపనేటికి? రమ్మ! సత్కృపాసాంద్ర!'

యని యిట్లు శ్రీకృష్ణు డానతిచ్చినను
విని చంపకజాలక విజయు డల్లపుడు

చెలగి పాంచాలి కిచ్చిన మాట మదిని
దలచి, యా ద్రౌణిని ద్రౌపది కడకు

గొని తెచ్చి యందుంచి, 'కొమ్మ! నీ వితఁ
పనిఁబూని జంపించు, బ్రతికించు, మింక

నీ మనస్సుని పల్కి నిట్టూర్పు నించి,
యా మానినీమణి యారట మంది,

యలుగక, శిశుహంతయయి లజ్జచేత
తల వాంచియున్నట్టి ద్రౌణి నీక్షించి,

కరములు ముకుళించి, కన్నీరు దొరుగ
పరితాపమున బల్కె పాంచాలి యపుడు:

'అన్న! యశ్వత్థామ! యక్కటా! నీకు
చిన్నిపాపలఁ జంపఁ జేయెట్టు లాడె?

వరుసగా మా మగవారి కందరికి
గురుడైన ద్రోణుని కొడుకవై యుండి,

నీ తండ్రి శిష్యులు నీ శిష్యులనెడి
నీతి విచారించి నెనరెంచలేక,

నేరుపు లెవ్వియు నేరక, రాత్రి
యూరకే నిదురింపుచున్న యర్భకుల

బట్టి చంపుట నీకు పాపంబుగాదె?
ఇట్టి కట్టిడితనం బెటు గల్గె నీకు?

గురుడని చూడక కుంతినందనులు
బెరసి మీ తండ్రిఁ జంపిన పగదీఱఁ

గన్న తండ్రులకు దుఃఖము నిచ్చు కొఱకు
చిన్నపాపల జంపితి నంటివేని,

కదన రంగంబులోఁగా విజృంభించి,
యెదిరించి పోరువా రెంత వారైన

వధియింపదగుఁగాన, వర పాండు తనయు
లధిక శౌర్యోద్ధతి నాహవంబందు

మీఱి పోరాడిన మీ తండ్రిఁ జంపి;
రారీతి నా బిడ్డ లకట నీతోను

పోరాడ వచ్చిరో భూరి శౌర్యమున?
మాఱొడ్డి యాడిరో మాట లేమైన?

నేరక నీవింత తెగువతో నీ చిన్ని సుతుల
దారుణంబుగఁ జంప ధర్మమే తండ్రి?

వీరశేఖరుడవు, విప్రోత్తముడవు,
సారజ్ఞుడవు నీకు సకలంబు దెలియు,

వారక నిక జెప్పవలసిన దేమి?
యారూఢిగా నిది యసుర కృత్యంబు.

నేడు మా విజయుండు నిన్నుఁ బట్టుకొని
యీడకు గొని తెచ్చి హింసించు ననుచు

చింతచే నా రీతి బెదరి మీతల్లి
యెంత శోకించునో యింటిలో వ్రాలి?'

యని యిట్లు వగచి, కృష్ణార్జునుల్ వినగ
నెనరుతోఁ బల్కె నా నెలత యిట్లనుచు:

'ఓ కృపామతులార! ఓ పుణ్యులార!
యా కృపి ద్రోణుతో నగ్నిలోఁ బడక,

తనయుని నమ్మి యిద్ధర నున్న దిపుడు;
కనక నీ ద్రౌణి నిక్కడ వధించినను

ఆ యింతి పుత్రశోకాతుర యైన
నాయాత్మ సుతుల ప్రాణములు రాగలవె?

ధారుణీ సురులకు ధారుణీపతులు
భూరి శోకంబును బుట్టింప రాదు;

ఆ కోపవహ్ని భూపారణ్యములను
ప్రాకట గతినిఁ గాల్పక శాంత మగునె?

కనుక నీ విప్రుని గావరే!' యనుచు
గనికరమ్మున నీతి ఘన ధర్మ సరణిఁ

దోపగా బల్కినందుకు ధర్మరాజు,
ఆ పద్మలోచనుం, డా యర్జునుండు,

సాత్యకి, నకులుండు, సహదేవు డపుడు
'సత్యమింతే!'నని శాంతులై రపుడు."

-ప్రథమ స్కంధము

ఒకే యుదుటున రెండు రచనములు చదివినవారికి పోతరాజు శైలి ఉద్దండముగా, ఉచ్ఛృంఖలముగా ఉండుట - వెంగమాంబ శైలి తేటగా, తేలికగా ఉండుట లెస్సగా తెలిసివచ్చును.

శైలిలో ఇట్లు తేడా ఉన్నది. ఇక భావముల విషయము:

పోతరాజు భావములను ఆమె చాల వఱకు అనుకరించుచు, అనుసరించుచు కథను నడిపినది. అగుగాక! ఉచితమని తనకు తోచిన తావులందు ఆమె పోతరాజు చెప్పని భావములను చేర్చి, కొద్దిగా మెఱుగులు దిద్దినది-

బాలుర మరణమునకు విలపించుచున్న ద్రౌపదిని ఊరడించుచు అర్జునుడు 'నీవు రాజకుమారికవు. వగచుట నీకు ధర్మము కాదు' - అనినట్లు పోతరాజు రచనమున కలదు. వెంగమాంబ రచనమున ఈ ధోరణి లేదు. ఇచ్చట అర్జునుడు 'ఐనదానికి విచారించుట దేనికి? నీవు ఎంతగా వగచినను నీ కుమారులకు తిరిగి జీవములు రావు కదా?' -అనినట్లు కలదు.

ఈలకఱచిన అశ్వత్థామను అర్జునుడు 'దురవధి సుత శోకయుత ఐన ద్రుపదుని సుతకు' చూపినట్లు మాత్రమే పోతరాజు చెప్పినాడు. వెంగమాంబ అట్లుకాక ఆ సందర్భమున అర్జునుని చేత ద్రౌపదికి 'కొమ్మ! నీవితని పనిఁ బూని చంపించు, బ్రతికించు మింక నీ మనస్సు' అని చెప్పించినది. ఇది ఒప్పిదమైన మాట!

అర్జునుడు అశ్వత్థామ శిరమును ఖండించి తెచ్చెదనని శపథము చేసియున్నాడు. కృష్ణుని అడ్డుమాట మీద అర్జునుడు ఆ శపథమును నెఱవేర్చలేదు. ద్రోణ సుతుని పట్టి తెచ్చి ద్రౌపది ముందు పెట్టి, అర్జునుడు 'వీనిని చంపించు, బ్రతికించు, అది నీ యిష్టము' - అనినాడు. ఈ మాట సందర్భ శుద్ధి కలిగి, కథా స్వారస్యమును పెంపొందింపచేయునదిగా ఉన్నది.

పోతరాజు రచనమున లేని భావమును ఒకదానిని అర్జునునిచే ద్రౌపదికి చెప్పించినట్లే , వెంగమాంబ పోతరాజు రచనమున లేని

భావమును ఒకదానిని ద్రౌపదిచే అశ్వత్థామకు చెప్పించినది. పరికింపుడు:-

ద్వి. "గురుడని చూడక కుంతి నందనులు
బెరసి మీ తండ్రిఁ జంపినఁ బగదీఱ

కన్న తండ్రులకు దుఃఖము నిచ్చు కొఱకు
బిన్నపాపలను జంపితి నంటివేని,

కదన రంగంబులోఁగా విజృంభించి
యెదిరించి పోరు వారెంత వారైన

వధియింప దగుగాన, వరపాండుతనయు
లధిక శౌర్యోద్ధతి నాహవంబందు

మీఱిపోరాడిన మీ తండ్రి జంపి;
రా రీతి నా బిడ్డ లకట నీతోను

పోరాడ వచ్చిరో భూరిశౌర్యమున?

పోతరాజు రచనమునకంటె వెంగమాంబ రచనమున ద్రౌపది వాక్ప్రాగల్భ్యమును ప్రదర్శించుచున్నది.

పోతరాజు రచనమున ద్రౌపది 'ద్రోణునితో శిఖింబడక ద్రోణకుటుంబిని యున్న దింట' - అనియన్నది. వెంగమాంబ రచనమున ద్రౌపది 'కృపి ద్రోణునితో నగ్నిలో బడక తనయుని నమ్మి యుద్ధర నున్నదిపుడు' అనుచున్నది. ఇక్కడ-ప్రకరణమున- 'తనయుని నమ్మి' యున్న దనుటలో స్వారస్యమెక్కువగా నున్నదని అంగీకరింపక తప్పదు.

పోతరాజు ద్రౌపది 'ద్రోణునితో శిక్షింబడక, యింటనున్న ద్రోణ కుటుంబిని ద్రౌణిఁ దెరల్చి తెచ్చుటకు దైన్యము నొందుచు నెంత పొక్కునో?' అని యనినది. వెంగమాంబ ద్రౌపది 'కనుక నీ ద్రౌణి నిక్కడ వధించినను, ఆ యింతి పుత్రశోకాతురయైన, నా యాత్మ సుతుల ప్రాణములు రాగలవె?' అని యనినది. ఆ మాటల కంటె ఈ మాటలు ప్రకరణమునకు ఎక్కువ స్వారస్యమును కూర్చునవిగా నున్నవి.

పైన చూపిన నిదర్శనములనుబట్టి ఎల్ల వేళల ఆమె పోతరాజు రచనమునే అనుకరింపక, అవసరమైన పట్టుల సంస్కృత మూలమును చూచియు, ఉపజ్ఞను ఉపయోగించియు రచనమును సాగించినదని చెప్పనగుచున్నది.

ఇట్లే రుక్మిణీ కల్యాణము, గజేంద్ర మోక్షము, వామనచరిత్ర మున్నగు ఘట్టములను కూడ పోల్చి చూడవచ్చును. కాని, గ్రంథ విస్తర భయమున ఈ విషయ మింతతో విరమించి, వెంగమాంబ రచియించిన మిగత గ్రంథములను పరామర్శింప దొరకొందము.

## ముక్తి కాంతా విలాసము

తరిగొండ వెంగమాంబ రచియించిన మఱియొక గ్రంథము ముక్తి కాంతావిలాసము. ఇది యొక యక్షగానము.

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రులవారు 1932లో నా కీ గ్రంథము కాగితపు వ్రాత ప్రతిని ఒకసారి చూపిరి. దానిని అప్పుడు తొందరగ జదివి, క్రింది నోట్సు వ్రాసికొంటిని.

"వేదాంత జ్ఞాన బోధిని యగు ఈ యక్షగానము హరి కర్పితము.

తే.గీ. శ్రీకరముగాను దరిగొండ శ్రీనృసింహు
డైన శేషాచలేంద్రుని యనుమతమున
లలితమగు ముక్తి కాంతా విలాస కృతిని
వెలయ రచియించెఁ దరిగొండ వెంగమాంబ.

ముక్తికాంతా విలాసమునందలి రచనమునకు 'హేమగిరితో కూచీ గుట్టా యెదురించి పోరాడె ననెడి సామెతగా', 'తన్ను మాలిన ధర్మము, మొదలు చెడ్డబేరము', 'పుట్టిన వారెల్ల గిట్టకుండిన భూమి పట్టదందున రెండు పనులు చేసెనె?' 'యద్దృశ్యం తన్నశ్యం, యత్కృతకం తత్తదనిత్యమ్, 'తేజస్తిమిర న్యాయము', పిఱికి పిచ్చికెై మీద బ్రహ్మాస్త్ర ప్రయోగంబు చేసినట్లు' మున్నగు లోకోక్తులు లాలిత్యమును, సవరదనమును ఇచ్చినవి."

ఈ నాటకమున నన్నయ, తిక్కనలను ఆమె యిట్లు స్మరించినది :-

తే.గీ. "భారతామాయ వారాశి పారమేగ
సారతర సత్కవిత్వ విస్తార పోత
మాశ్రయించి తరించిన యనఘమతుల
శబ్దశాసన తిక్కయజ్జ్వల నుతింతు."

గత శతాబ్ది మధ్య ప్రాంతమున ఈ గ్రంథము ముద్రితమై ప్రచార మందినది. కాని, ఇప్పుడు ఆ ముద్రితగ్రంథము ప్రతులు దొరకుట లేదు. కొంత ప్రయత్నము మీద 1940 ప్రాంతమున మదరాసులో ఒక వైశ్య మిత్రుని వద్ద సంపాదించి, దీనిని నేను చదివితిని.

ఈ గ్రంథములో గ్రంథకర్త్రి తల్లిదండ్రుల పేరు చెప్పలేదు. దైవ ప్రార్థనలో తరిగొండ నృసింహునితో బాటు చౌడమాంబను గూడ గొలిచినది. సుబ్రహ్మణ్యగురుని తలచినది. 'లలి ముక్తి కాంతావిలాస సత్కృతిని శృంగారముగ విరచించి మోక్షంబు నంగీకరించి మహాగురుండైన హరి కర్పితము సేతు' నన్నది.

ఆది పురుషుడు ముక్తికాంతను పొందవచ్చుట ఇందలి కథ.

ముక్తికాంత తరిగొండ నరసింహుని దగ్గర నిలిచి మురియు చుండగా, స్వామి వచ్చును. ముక్తి మందిర ద్వారపాలకులలో నొకనిని బిలిచి కవాటంబు తీయకోరును. అతనితో నడచిన ప్రసంగమున జగదీశ్వరుడు మఱపను తెఱ నుత్తరించును. తరువాత జ్ఞాన కాంత మధ్యలక్ష్యాంతఃపుర ద్వార కవాటంబు బంధించును. అప్పుడు ఆమెకును, జగదీశ్వరునకును సంవాదము. ఆ సంవాదమును తలుపు తీసెడు పాటగా వెంగమాంబ చక్కగ రచించినది. ఏలలు మున్నగు పాటలు కలవు. భక్తికాంత - వైరాగ్యకాంత - వివేకశక్తి - వైరాగ్యశక్తి - నేతి నేతి వాక్యములు.

జ్ఞానకాంత నిజగురుండైన తరిగొండ స్వామికి ముక్తి పేరిట జాబు వ్రాసి శ్రద్ధయను శక్తిచేత బంపగా, నది జగదీశ్వరుని చెంతచేరి యిట్లని చదువుచున్నది:

**దండకము :**

*శ్రీమత్పురంధామ! జీవావళిస్తోమ! శ్రీమానినీలోల! శృంగార సల్లీల! కందర్ప లావణ్య! కంజోద్భవాగణ్య! షాడ్గుణ్య సంపన్న! సంరక్షితాపన్న! సాధువ్రజోద్ధార! శ్రీ వేంకటాద్రీశ! సచ్చిత్ప్రకాశా! పరాకాశ! లోకేశ వాణీశ గౌరీశ నాకేశ వంద్యాంఘ్రి పద్మద్వయా!*

సద్దయా సాంద్ర ! యోగీంద్ర హృత్పద్మ భృంగా! శుభాంగా! సుచారిత్ర! మిత్రాబ్జనేత్రా! ధరిత్రీకళత్రా! మహోల్లాస! దానప్రియా! శ్రీనివాసా! మము నృత్కృపం బ్రోవు మో తండ్రి! తండ్రీ! తరిగొండ ధామా! నృసింహా! నుతాహ్వా! నమస్తే నమస్తే నమస్తే నమః.

ముక్తి భామ జగదీశ్వరునకు వ్రాసిన యుత్తరము ముచ్చటగ నుండును. జగదీశ్వరుం డిచ్ఛాశక్తి చేత బ్రత్యుత్తరంబు వ్రాయించి పంపగా, నాముక్తికాంత చెంతనున్న జ్ఞానకాంత దానిని చదువును. దానికి బ్రత్యుత్తరంబు వ్రాయించి శ్రద్ధ యను శక్తిచేత బంపగా, నది జగదీశ్వరుని చెంత జేరి యిట్లనుచున్నది :-

శ్లో. సూర్యాది గ్రహతారకాంతరగతం సూక్ష్మాతి సూక్ష్మం జగ
త్కార్యా కార్య వివేచనం మునినుతం కారుణ్య సద్వారిధిం।
తుర్యాతీత సమాధి పూర్ణ మచలం దూరీ కృతాహం మహా
ధైర్యం శ్రీ తరిగొండ శేషకుధరాధ్యక్షం భజేఽహం సదా॥

తరువాత చూర్ణిక - ఇత్యాదిగా ఉన్న జాబు తాత్పర్యంబు తెలిసి, ప్రత్యుత్తరంబు వ్రాసి, యా స్వామి పంపగా, దానికి తిరిగి జాబు. అందు తిరిగి మొదటి జబాబులోవలె శ్లోకము, చూర్ణిక.

శ్లో: సత్యం జ్ఞాన మనంత రూప మమలం చక్రాయుధం శ్రీకరం,
నిత్యం నిర్మల మవ్యయం నిరుపమం నిర్వాణబోధ ప్రదం।
ప్రత్యక్షానుభవామృతం శుభకరం పాపాద్రి వజ్రాయుధం,
దైత్యారిం తరిగొండ శేషకుధరాధ్యక్షం భజేఽహం సదా॥

ఇత్యాదిగా ఉత్తర ప్రత్యుత్తరములు నడచును.

తుది జాబునందలి తాత్పర్యంబు ముక్తికాంత విని సమ్మతించి, కవాటంబు తీయుమనును. అప్పుడు విచారాత్మ

కుండను ద్వారపాలకుండు హాస్యరసావేశుడై కొంత వాదము నడుపును.

అనంతరము మధ్య లక్ష్యాంతఃపురంబులో జొచ్చి జగదీశ్వరుడు పోవుచుండగా, ముక్తికాంత అంతర్లక్ష్య ద్వారకవాటంబును బంధించును.

ఆ సందర్భమున జగదీశ్వరునకును, ముక్తికాంతకును తిరిగి సంవాదము. ఆ సంవాదము ఏలలలో చక్కగ నడచును. అనంతరము ముక్తిసతి జగదీశ్వరుని గూడును.

అప్పుడు భక్తి, జ్ఞాన, వైరాగ్యశక్తులు మంగళంబులు పాడి, ఆరతు లిత్తురు.

తరువాత మాయాశక్తి రాక, దానికిని, జ్ఞాన, వైరాగ్య శక్తులకును సంవాదము. మాయా శక్తిని జగదీశ్వరుడు పంపి వేయును.

అంతట జ్ఞాన వైరాగ్యశక్తులు స్వామి చెంత జేరి మ్రొక్కి యిట్లనును :

శ్లో॥: *ఆర్యాత్మాంబురుహాంతరంగ నిలయం, హంస స్వరూపం, లసత్*
*చర్యం, సర్వ మయం పురాణ పురుషం, షడ్వర్గ నిర్వాపహమ్।*
*శౌర్యాటోప మురారి నిగ్రహ, మజం,సాధు వ్రజో ద్ధారణం,*
*స్థైర్యం శ్రీ తరిగొండ శేషకుధరా ధ్యక్షంభజేఽహం సదా॥*

ఈ రీతిని ఈ ముక్తికాంతా విలాసమను యక్షగానము వేదాంత జ్ఞానబోధిని యగుచున్నది.

ఈ గ్రంథమునుగుఱించి శ్రీ యస్వీ జోగారావు ఇట్లు వ్రాయుచున్నారు:-

"ముక్తి కాంతావిలాసము లేక వేదాంత జ్ఞాన బోధిని అను ఈ గ్రంథము క్రీ.శ. 1869లో అచ్చయినది. నేను చదివిన రాజమండ్రి గౌతమీ గ్రంథాలయప్రతిలో దాని ముద్రణ ప్రచురణాదికమును గూర్చిన వివరములు లేవు. ఆ సంపుటములో చివర నొక పది పుటలలో వెంగమాంబవే తత్త్వ కీర్తనలు గలవు.

ఇందు తత్త్వ విషయము సాంకేతికముగా సాగినది. (కృష్ణ మిశ్రుని ప్రబోధ చంద్రోదయమునకు మానస పుత్రిక.

వెంగమాంబ కృతి యందలి విషయము వేదాంతమైనను, రచన యొక భామకలాపమువలె నడచినది. జగదీశ్వరుడు మాయను వీడి ముక్తి కాంతను పొందగోరి యామె మందిరమునకు వచ్చుట, జ్ఞానకాంత తలుపు మూయుట, నాయికా నాయకుల ఉత్తర ప్రత్యుత్తరములు, సంవాదములు జూడ, కృష్ణుడు భామ యింటికి వచ్చుట, చెలికత్తెలు తలుపులు మూయుట, నాయికా నాయకుల రాయబారములు - స్ఫురించును. మాయాశక్తి వైరాగ్య, జ్ఞాన శక్తులతో వాదించుట సవతుల కొట్లాటను తలపున కెలయించును. విషయము క్లిష్టమగు వేదాంతమైనను చెప్పుటలో సాధ్యమైనంత సౌలభ్యము చూపించినది గ్రంథకర్త్రి."

ఇంతవరకు వెంగమాంబ రచియించిన పదమూడు గ్రంథముల విషయము తెలిసికొనియున్నాము. ఈ పదమూడు

గ్రంథములలో ఎనిమిది - 1) నరసింహ విలాస కథ, 2) శివ నాటకము, 3) కృష్ణ నాటకము, 4) పారిజాతాపహరణము, 5) చెంచునాటకము, 6) రుక్మిణీ నాటకము, 7) గోపికా నాటకము, 8) ముక్తికాంతా విలాసము - యక్షగానములు. ఇందు వలన ఆమె రచించిన గ్రంథములలో నగమునకు పైగా యక్షగానము లగుట తెలియవచ్చుచున్నది.

ఇందులో నరసింహవిలాస కథ, రుక్మిణీ నాటకము, గోపికా నాటకము నేడు అనుపలబ్ధములు. మిగిలిన ఐదును సమగ్రముగానో, అసమగ్రముగానో దొరకుచున్నవి. ఈ యైదు గ్రంథములలో రెండు ముద్రితములై ప్రచారమును అంది యున్నవి.

వెంగమాంబ యక్షగానములను గుఱించి సాముదాయికముగ శ్రీ యస్వీ జోగారావు ఇట్లు వ్రాయుచున్నారు:-

"వెంగమ యక్షగాన కృతులన్నియు మంచి నాటకపు వాటము గలిగి యుండును. వెంగమనాటికి యక్షగానము లనేకము వెలసినవి. ఆమెకు యక్షగాన లక్ష్యకోశ పరిజ్ఞాన మెక్కువగ నున్నట్లు తోచును. ఆమె కృతులలో అటనట రాగములు పేర్కొనబడినను, దరువు లెక్కువగా జంపె, కుఱుచ జంపె, అట, ఏక, త్రిపుట, ఆది - మొదలగు తాళముల ప్రాధాన్యముతోనే తఱచు 'తరిగొండ శేషాచలేశ' ముద్రలు గలిగియుండును. ద్విపదలు, మంజరి, పద్యములు, సీసార్ధ, కందార్ధములు, వచనములు, ఏలలు, గొబ్బిళ్లు, సువ్వాలలు, ధవళ, శోభనములు, మంగళ హారతులు మొదలగు పాటలు, శ్లోకములు,

చూర్ణికలు, దండకములు మొదలైన పలు రకముల రచనా విశేషములు గలవు. లోకోక్తులు, ప్రయోగ విశేషములు ననేకము గలవు. ఆమె తన వేంకటాచల మాహాత్మ్యములో శృంగారమునకును తనకును చుక్కెదురన్నట్లు మాటలాడినది. కాని, యామె యక్షగానము లం దది సమృద్ధిగా గలదు. ఆమెకు ఎఱుకులు, చెంచులు మొదలగు అటవిక జాతుల జీవిత విశేషములనుండి, గహనములైన యోగ శాస్త్ర రహస్యముల వరకు గల అనేక విషయములు దెలియును. ప్రజావినోదము చూరగొన్న యక్షగానముల ప్రత్యేకతలగు సవతి కయ్యము, ఎఱుకఘట్టము మొదలగు పట్టులందు పూనుకొని మంచి పనితనమును ప్రదర్శించినది వెంగమాంబ. ఆమెవలె నిన్ని యక్షగానము లింత సమర్థవంతముగా రచియించిన కవయిత్రులు లేరు; సరికదా కవులు నరుదు."

## వాసిష్ఠరామాయణము

తరిగొండ వెంగమాంబ రచియించిన మఱియొక గ్రంథము వాసిష్ఠ రామాయణము. ఇది ముద్రితమై యున్నది.

తరిగొండ వెంగమాంబ యితర గ్రంథముల వలె వాసిష్ఠ రామాయణము కూడ తరిగొండ నృసింహుడైన తిరుపతి వేంకటేశ్వరునకు అంకితము. ఆమె ఈ కావ్యమునందును సుబ్రహ్మణ్య గురుని తలచినది.

వెంగమాంబ వాసిష్ఠరామాయణము ద్విపదకావ్యము. ఇది సంస్కృతమునకు అనువాదము.

ఈ గ్రంథమునకు సంస్కృతమున 'జ్ఞాన వాశిష్ఠము' అనునది ప్రసిద్ధ నామము. ఆ గ్రంథమును గుఱించి ఇట్లు చెప్పబడు చున్నది. "జ్ఞాన వాశిష్ఠము శ్రీరామ వశిష్ఠ సంవాద రూపంబును, వాల్మీకి విరచితంబును నగు నితిహాసము. బ్రహ్మవిద్యను నిరవ శేషంబుగ బోధింపఁ దాదర్థ్యంబున (అందుకై) ప్రవృత్తంబును, నద్భుత రసావిల బహు విధాఖ్యాయికా మిషంబున సకల జన చిత్త విద్యోన్ముఖీకరణ చాతురీ ధురీణంబునునగు యోగ వాసిష్ఠ మను గ్రంథ రాజము నిరుపమానంబై శోభిల్లుచున్నయది. ముప్పది రెండు వేలు గ్రంథ సంఖ్య. సంగృహీతంబై అది సంగ్రహజ్ఞాన వాశిష్ఠంబనియు, లఘు యోగ వాశిష్ఠంబనియు నొప్పుచు నాఱువేలు గ్రంథ సంఖ్య గల ప్రకృత గ్రంథరాజము."

బ్రహ్మ విద్యను లెస్సగ బోధించు ఈ గ్రంథమును మడికి సింగన్న అను కవీశ్వరుడు వెంగమ్మకు పూర్వమే తెనుగులోనికి చంపువుగ అనువదించి యున్నాడు. వెంగమాంబ వాసిష్ఠ రామాయణము సింగన్న కావ్యమంత మనోజ్ఞముగ లేకపోయి నను, వచనము వలె సులభార్థ బోధకమైయున్నది.

మూలానుసరణముగ వెంగమాంబ వాసిష్ఠ రామాయణమును ఐదు ప్రకరణములుగా విభజించినది. ఈ గ్రంథ రచనమును గుఱించి ఆమె యిట్లు చెప్పినది :-

"ధరణిమీద మదాత్మ తరియించుకొఱకు
సామోద మతిని సుజ్ఞాన వాసిష్ఠ
రామాయణార్థ సారమును గ్రహించి,

వరుసగా ద్విపద కావ్యముగా రచించి"
"... నిత్యమై సత్యమై ధన్యమగుచు

సామర్థ సార సుజ్ఞాన వాసిష్ఠ
రామాయణంబను రమ్య సద్ద్విపద"

రాజయోగ సారమున కంటె వాసిష్ఠ రామాయణమున వెంగమాంబ శైలి రాణదేరి సవరనయినది యగుట ఈ కావ్యము నందలి సాదృశ్య వాక్యములు రాజయోగసారమున కంటె హెచ్చు పరువమును కూర్చుకొన్నట్లుగా నుండును.

**కొన్ని సాదృశ్య వాక్యములను చిత్తగింపుడు :-**

1. 'ఎలుకలు ద్రవ్విన యింటి చందమున', 2. 'బావిలో నేతము బాన తా మునిగి యా వేళనే జలం బందుండి తాను గొని తెచ్చి భూమిపై గ్రుమ్మరింపుచును, మొనసి క్రమ్మఱ నంద మునిగి లేచుచును', 3. 'వనధివల్ల దరంగ వారముల్, కనకమున భూషణమ్ము లిమ్ముగఁ బుట్టు కరణి', 4. 'సునిశితమైనట్టి సూర్య ప్రకాశమున నెండమావులు మొనసి గన్పించు కరణి', 5. 'కలలోన నొక వంధ్య గన్న పుత్రకుని వలె', 6. 'కనుమూసి నిద్రించు కాలంబులందుఁ గనిన స్వప్నంబుల కైవడిగాను', 7. '... ప్రాత బట్టలు విడిచి క్రొత్త బట్టలఁ గట్టు కొనిన చందమున', 8. '... మయూరంబు తరువు పై నుండ నీళ్ల లోపల దాని నీడ కాన వచ్చిన రీతిగా ...', 9. 'తొడరి తామర నూలుతో బర్వతములు పడనీడ్చి బంధించు పగిది', 10. 'మూషకములు కొఱికిన వలరీతి ...' 11. '... మహాబధిరుండు పొదువుగా దారులఁ బురముల నదుల నూరక గనుచు బోవుచు నుండుఁగాని, వారందుఁ బలికెడి

వార్తలు వినని గతిని . . .', 12. 'ఊరక యెండమావుల యందు నీళ్లు పాఱిన గతి . . .', 13. 'మఱి కరి మ్రింగిన మారేడు పండు కరణి', 14. ' . . . అమర స్వప్నమున బావిలో బడి లేచి బాగ మేల్కొనిన వాని యంగములకు వచ్చునే హాని?', 15. 'కరగి జలంబులో గలిసిన యుప్పు పగిదిని', 16. 'చెదరెడి మరు మరీచికల యం దెపుడు నుదకంబు లేకుండి యుండినట్లుండు', 17. 'భర్మమం దొనర నాభరణముల్ చిత్ర కర్మ కల్పితములై గనిపించి యణగు చందంబుగా', 18. 'చిలుక పంజరములో జేరిన మాడ్కి', 19. ' . . . యద్దములోని నీడ కైవడిని, తన తొమ్ముపై నున్న తనయునిఁ దాను గనక యెం దరిగెనో గద! యని యేడ్చు జనని చందంబున', 20. ' . . . చవిటి భూమిని విత్తినట్టి విత్తుల వలె', 21. 'మహాతీర్థములను శ్వానముల్ మునిగిన చందంబుగాదె! పూని స్వప్నంబులో భూరి దుఃఖంబు ననుభవింపుచునుండి యపుడె మేల్కొనిన, వేన దుఃఖమునరు వేధింపగలదె?'

ఈ ఉపమలకంటె కూడ ఈ కావ్యమునందలి నీతి వాక్యములు, విషయ వర్ణనములు శ్లాఘనీయములై ఉన్నవి. కొద్ది నిదర్శనముల దర్శింపుడు :-

ద్వి. 'జనియించుటెల్లను చచ్చుట కొఱకె,
చచ్చుటెల్లను మళ్లి జనియించు కొఱకె;

హెచ్చుగా నిల్చుట స్థిరమెందులేదు;
అన్ని యస్థిరములైనట్టి చందంబు'.

'అనభిజ్ఞ చిత్తుడైనటు వంటి వాడు
తనియక యజ్ఞాన తప్తుడైయుండు;

నెందాక యజ్ఞాన మిరవుగా నుండు
నందాక కర్మంబు లంటుచునుండు,

నెందాక కర్మంబు లెనయుచునుండు
నందాక పుట్టుచు నణగుచు నుండు;

నెందాక జన్మంబు లెత్తుచునుండు
నందాక దుఃఖమగ్నాత్ముడై యుండుఁ;

గావునఁ దద్దుఃఖకంధి దాటుటకు
నావయై యుండు జ్ఞానస్వరూపంబు.'

'కాలగతుల చేత గదిసి కీడులును,
మేలులు వచ్చిన మిడికి యుబ్బకయ

రెండును మది నొక్కరీతిగాఁ గనుచు
నుండుట సంతోష మో రామచంద్ర!

సంతోషమే సుఖ సారమై యుండు;
సంతోషమే మోక్ష సౌఖ్యంబు.'

'కాలమెంతటి వారు గడువగా లేరు,
పుట్టినవారెల్లఁ బోవుట నిజము;

నెట్టనఁ దిరముగా నిల్వ రెవ్వరును,
కలలవంటిది యీ జగంబుల రీతి.

'చిత్తమే హేతువౌ సృష్టికంతటికి,
చిత్తంబు లేకయే సృష్టి యెట్లగును?

'చిత్తమే పురుషుండు చిత్తమే ప్రకృతి,
చిత్తమే సంసార సృష్టి యటంచు

చిత్తమందే నీవు చింతించి తెలిసి,
మొనసి చిత్త త్యాగమును చేయు'-

- ప్రథమ ప్రకరణము

'చెలగి వివేకంబుచేఁ జిత్త శాంతి
గలుగ, సంసార దుఃఖమణంగి పోవు;

నిలను వివేక విహీన చిత్తునకు
కలుష సంసార దుఃఖము వృద్ధిపొందు.'

'ఉడుగక వేటకాడొడ్డిన వలను
బడుజింక గతిని లోఁబడకువే మనస!'

చర్మభావము నొంది సంసార సుఖము
నర్మిలి గోరి మహాగజేంద్రుండు

కరిణితో నెనయ నక్కడ పర్వెబారి
యరిగి యచ్చటి యోదమందు దాఁగూలు

కరణిని సంసార గహన కూపమునఁ
బరువడి నెఱి దప్పి పడకువే మనస!'

'వదలక రసనభావము నొంది యెఱ్ఱ
నదిమ్రింగెద నంచు నరిగి, గాలమును

మ్రింగి చచ్చినయట్టి మీనంబు పగిది
పొంగుచు రుచిఁ గోరి పొలయకే మనస!'

'నేత్రభావము నొంది నిగుడుచు మీన
నేత్రలు మొదలుగా నెఱయు దృశ్యముల

యందాసపడి యగ్ని నణగిన మిడుత
చందంబునను నీవు చావకే మనస!'

'పనుపడి నాసికాభావంబు నొంది,
ఘన సుగంధంబు గోరి కమలమధ్యమునఁ

జేరిన భృంగంబు చెలువునఁ గర్మ
చిర వాసనలయందుఁ జిక్కకే మనస!'

'మెఱయు జింకయుఁ గరి మిడుత మీనంబు
నరయగా భృంగ మిట్లాసలఁ బొంది,

యొక్కటొక్కటి చేత నొకటొక టణగు;
నక్కట యిటువంటి యైయింద్రియముల

నెనసి యుండంగ నీవెటు తరించెదవు?
చెనటుల పొందు వర్జింపవే మనస!'

'అటువంటి వాసనలన్ని బంధకము,
లిటువంటి రీతుల నెరిగి, వైరాగ్య

చింతన సతతంబు చేసిన, నీవు
శాంతిఁ బొందెదవు-నిశ్చయముగా మనస!'

'చెలువొప్ప నిరతంబు చిత్త శాంతంబు
కలుగు ధన్యునకు జగంబు భావింప

సతతంబు చల్లనౌ, శాంతంబు లేని
యతనికి దావాగ్నియై తోచు జగము;

కావున శాంతమే కావలె నరున,
కేవిధంబుననైన, నిది నిశ్చయంబు.'

'సంగంబు హేతువు సకలార్థములకు,
సంగంబు నిలయంబు సంసృతి కెల్ల,

సంగంబు మూల మాశాలతావళికి,
సంగమే యావదాశలకెల్ల నెలవు;

సంగ వర్జనము మోక్షము, సంగ విరతి
మంగళ ప్రదము జన్మవినాశ కరము.

**- తృతీయ ప్రకరణము**

'.......యెంతటి విద్వాంసుడైనఁ
దనియ దనంతనే తత్త్వశాస్త్రములు

చదివి, తపంబెంత సల్పినంగాని
మదిసంశయంబులు మానవు, చిత్త

చపలత్వమణగదు, శాంతి లభింప;
దపరిమితానంద మబ్బదు గాన,

గురుని సంపాదించుకొని, కొల్చి, యతని
కరుణకు పాత్రుడై కడతేర వలయు.

నటుసేయలేక దేహాభిమానమున
కుటిలాత్ముడగువాడు కొన కెక్కలేడు;

ఎలమి శాస్త్రజ్ఞాన మెంతైన, గురుడు
కలుగకున్నందున కడముట్టు టరుదు."

సాదృశ్య వాక్యముల కంటె, నీతి వాక్యముల కంటె, విషయ వర్ణనముల కంటె ఈ కావ్యము నందలి ఆఖ్యానములు అతిశయ మనోజ్ఞములై యున్నవి. వాయసయోగి ఉదంతము, శిఖిధ్వజో పాఖ్యానము మున్నగునవి కొంచెము పెద్ద కథలు. ఈ కథలను నివేదించుటలో వెంగమాంబ తనకు కల కథా కథన సామర్థ్యమును స్తవనీయముగ జూపినది. ఆమె కథాకథన శక్తిని ప్రదర్శించుటకు చిన్నవి యగు మూడు కథలు ఇచట ఉదాహృతము లగు చున్నవి:-

i)ద్వి. "విను రాఘవేశ్వర! వింధ్యాద్రిమీద
నొనర గుటుంబియై యొక కిరాతుండు

నుండి, ధనాసక్తి నుండిన చోట
నుండక, వనములం దొంటిగా మౌని

కరణిని దిరుగ, జాంగల దేశమందు
మెఱుపైన గవ్వ సమీపంబుగాను

గనిపింప, నది వెండి గాబోలు ననుచుఁ
జని చాల వెదుక, నచ్చటగవ్వ తనకు

గనబడకున్నఁ దత్కాంక్ష విడువ
కను వాడచటనున్న కసవెల్లఁ బెఱికి,

యాడాడ వైచుచు, నలయుచు, నందె
మూడు దినంబు లిమ్మగ గవ్వమీది

యాస వీడక చూడ, నమర రత్నంబు
వాసిగా దొరకగా, వాడు మోదించి,

దానిఁ గైకొని పోయి ధనవంతుడయ్యె.
నో నరనాథ! వాడొక్కటి వెదకి

యొకటి గన్నట్లు గురూపదేశార్థ
మొక కాలమున దోచకుండినగాని,

వేసటంబడి దాని విడువ, కాత్మార్థ
మాసక్తితోఁ జూతునని మానసమున

బుట్టిన సంశయంబులను ఖండించి,
పట్టుగా మనమందె భావించెనేని

అమర సన్మణి వానికబ్బిన రీతి
రమణీయ సుజ్ఞాన రత్న మీతనికి

సరసన దొరకు, మోక్ష ధనాఢ్యుడగును;
పరిపూర్ణ శాంతి సంపన్నుడౌ ననఘ!"

ii) "అలఘువింధ్యారణ్య మందొక్క గజము
గలదు, హస్తిపుడు తక్కక దానిఁ బొంచి

పట్టి, గొలుసు దాని పదమున నంటఁ
జుట్టి, వృక్షమున కచ్చుగ గట్టి వేసి,

తా దాని ముందరి తాటిమ్రానెక్క
గా, దంతి దంత యుగంబుతోఁ గాలి

గొలుసు గ్రక్కున వీడ్చికొని ఘీంకరింప,
నళికి, హస్తిపుడు తా నా మ్రాని మీద

నున్న నేనుగు మ్రాను నురవడిన్ విఱిచి
తన్ను జంపు నటంచు తరువుపై నుఱికి

పడిన, నేనుగు వాని భావించి చూచి,
పుడమిపై వ్రాలె; నీ పురుషుని నేను

జంపుటింకే?లంచు జనియె నా దంతి;
కంపమొందుచువాడు క్రమ్మఱ లేచి

చెచ్చెర నలత దీర్చుకొని తానపుడు
నచ్చోటనుండక యరిగి, కుంజరము

చనిన జాడనుబోయి, సామజమున్న
యునికి పట్టునెఱింగి యుపముగా దాని

చుట్టు నోదంబు హెచ్చుగ ద్రవ్వి, పైన
గట్టెలు, తీగెలు గనవు నాకులును

బఱచియుండగ గజపతి దాని మీద
బరువెత్తి దిగజారి పడి హస్తిపునకు

జిక్కె; నాదిని వాడు జిక్కిన యపుడె
త్రొక్కి చంపకయున్న దోషంబు చేతఁ

గరి వాని చేతికే క్రమ్మఱఁజిక్కి,
యురవెందు దోవక యేడ్చుచునుండె."

iii) "సదమలుం డగు నొక్క జగతీసురుండు
తనమదిలోన జింతామణిఁ గోరి
ఘన తపంబొనరింపగా, నదివచ్చి
యా భూసురుని చేత నప్పుడ నిలిచె;
ఆ భావ మెరుగక యా బ్రాహ్మణుండు
తలచె నీ రీతి 'జింతామణి నన్ను
వలనొప్పగా మెచ్చివచ్చునే త్వరగ?
నెలమిఁ జింతామణి నీయ జాలకయ
వెలయ వేల్పులు తపోవిఘ్నంబు సేయ
నీ రీతి బంపినా రీ గాజు పూస
నే రీతిఁ గైకొందు నివు?'దంచు మదిని
దలచగా నెఱిగి చింతామణి చనియె.
నల విప్రు డెప్పటియట్ల తపంబు
పనిబూని చేయగా బహువత్సరముల
కొనరఁ బ్రత్యక్షమై యొక గాజుపూస
తన చేతి కొదవఁ, జింతామణి దొరకె'
ననుకొని తనయింటి కరిగె విప్రుండు;
పొలుపొంద నా గాజుపూస నానాఁట
మలినమై పోవ బ్రాహ్మణుడు చింతించె'

- చతుర్థప్రకరణము.

## వేంకటాచల మాహాత్మ్యము

వేంకటాచల మాహాత్మ్యము ఆఱాశ్వాసముల ప్రబంధము. ఈ యాఱాశ్వాసముల గ్రంథమున తిరుపతి కొండ యొక్కయు, అక్కడి శ్రీనివాస దేవుని యొక్కయు మాహాత్మ్యము వర్ణితము. మొత్తమునకు వేంకటాచల మాహాత్మ్యమన్న పేరే చెల్లినను ఇందు మూడు తెఱగుల గ్రంథములు గలవు.

**ఈ మూడు తెఱగుల గ్రంథములలో మొదటిది :**

వరాహ పురాణాంతర్గతమగు వేంకటాచల మాహాత్మ్యమునకు దెలిగింపు. ఈ గ్రంథము మొదటి మూడాశ్వాసములందును వర్ణితము. దీనికి వేంకటాచల మాహాత్మ్యమనియే నామము.

**ముత్తెఱగుల గ్రంథములలో రెండవది :**

భవిష్యోత్తర పురాణప్రోక్తమగు గాథలకు తెలిగింపు. ఈ గ్రంథము నాలుగు, ఐదు అశ్వాసములలో వర్ణితము. దీనికి 'శ్రీనివాస విలాస'మని పేరు.

**ఇక మూడవది :**

ఇది పద్మపురాణాంతర్గతమగు గ్రంథమునకు దెలిగింపు. ఈ గాథ ఆఱవ అశ్వాసమున వర్ణితము. దీనికి 'వీరలక్ష్మీ విలాస'మని పేరు.

పద్మపురాణాంతర్గమగు గాథకు అనువాదమే కాక, ఇందు కొంత కవయిత్రి స్వకల్పితము కూడ గలదు.

వెంగమాంబ ఒకటి, నాలుగు, ఆఱు అశ్వాసముల ఆదిని సంస్కృత శ్లోకములు రచించినది. ఒకటి, రెండు మూడు

అశ్వాసముల గాథ వరాహ పురాణాంతర్గతమును, నాలుగు, ఐదు అశ్వాసములగాథ భవిష్యోత్తర పురాణాంతర్గతమును, ఆఱవ అశ్వాసము గాథ పద్మ పురాణాంతర్గతమును అగుటచే ఈ గ్రంథమును ముత్తెఱగుల ప్రత్యేక కావ్యములుగ భావించి, ఆమె మూడు కావ్యముల ఆదిని సంస్కృత శ్లోకములను రచించినదని ఊహింపవచ్చును:-

శా. "శ్రీకాంతాత్మ సరోజ చండకిరణం శీతాంశు బింబాననం,
శ్రీ కంఠాబ్జజ సన్నుతాంఘ్రి కమలం చిన్మాత్ర మప్రాకృతమ్।
లోకాతీత మనేక గోపయువతీ లోలం పరం సర్వగం,
స్వాకారం తరిగొండ శేషకుధరాధ్యక్షం భజేఽహం సదా॥
-ప్రథమాశ్వాసము

శా. శ్రీనారాయణ మాత్మ మూల మనఘం శ్రీవత్స వక్షఃస్థలం,
నానా స్థావర జంగమాత్మక జగన్నాథం ప్రధానాశ్రయమ్।
ధ్యాన ధ్యేయ మచింత్య మద్వయ పదం ధర్మస్వరూపం, సుపూ
ర్ణానందం తరిగొండ శేషకుధరాధ్యక్షం భజేఽహం సదా॥
- చతుర్థాశ్వాసము

శా. శ్రీమత్కోమలనీలతోయద నిభం శృంగార పూర్ణేక్షణం,
హేమాభాంబర దివ్య భూషణధరం హేలావతీ ఖేలనమ్।
కౌమారీశ్వర సన్నుతాంఘ్రి కమలం కల్యాణ లీలాగుణో
ద్దామం శ్రీతరిగొండ శేషకుధరాధ్యక్ష్యం భజేఽహం సదా॥"
- షష్ఠాశ్వాసము

కావ్యాదిని సంస్కృత శ్లోకముల నుంచు ఆచారము తెనుగు కవులలో నన్నయ, తిక్కనాదుల నుండి అనుస్యూతమై యున్నది.

ఆ మర్యాదనే ఈ కావ్యమున వెంగమాంబ పాటించినది. కావ్యాదినే కాక, కావ్య మధ్యమునందును ఆమె కొన్ని శ్లోకములను రచియించినది. తృతీయాశ్వాసములో మునులు శ్రీ వేంకటాద్రి విభుని వినుతించిన ఘట్టమునందలి క్రింది నాలుగు శ్లోకములను చూడుడు :-

శ్లో॥ "సరోజ పత్రలోచనం, సుసాధు లోక పావనం,
చరా చరాత్మక ప్రపంచ సాక్షిభూత మవ్యయమ్।
పురారి పద్మజామరేంద్ర పూజితాంఘ్రి పంకజం,
స్మరామి వేంకటేశ్వరం చ సాగరాత్మజేశ్వరమ్॥

శ్లో॥ పురాణపూరుషం, సమస్త పుణ్యకర్మ రక్షణం,
మురాసురాది దానవేంద్ర మూర్ధజాల శిక్షణమ్।
ధరాధరోద్ధరం, ప్రశాంత తాపసాత్మ వీక్షణం,
స్మరామి వేంకటేశ్వరం చ సాగరాత్మజేశ్వరమ్॥

శ్లో॥ శరాసనాది శస్త్రబృంద సాధనం, శుభాకరం,
ఖరాఖ్య రాక్షసేంద్ర గర్వకాననోగ్ర పావకమ్।
వరాధినాథ వందితం నగాత్మజాత్మ సన్నుతం,
స్మరామి వేంకటేశ్వరం చ సాగరాత్మజేశ్వరమ్॥

శ్లో॥ సురారి శౌర్య నిగ్రహం, సుపర్వరాట్పరిగ్రహం,
పరాత్పరం, మునీంద్ర చంద్ర భావ గమ్య విగ్రహమ్।
ధరామరాఘ శోషణం సుధా తరంగ భాషణం,
స్మరామి వేంకటేశ్వరం చ సాగరాత్మజేశ్వరమ్॥"

- **వేంకటాచల మాహాత్మ్యము, తృతీయాశ్వాసము.**

వరాహ, భవిష్యోత్తర పురాణములు రెండింటి యందలి నలుబది మూడు అధ్యాయములను ఐదాశ్వాసముల పద్య కావ్యముగ రచియించిన పదపడి, పద్మ పురాణములోని కథను ఆఱవ ఆశ్వాసముగ ఆమె రచించినది.

సీ. "..............................................

*హరికి సమర్పించి, యవలఁ బద్మపురాణ*
*మందు వింతగ వేంకటాద్రి విభుఁడు*

తే.గీ. *సిరినిఁ గూరిచి తపము మున్ జేసినట్టి*
*చరితములు కొన్ని దొరకగా సంగ్రహించి,*
*సరవి నాశ్వాసమున కవి చాలవనుచు*
*వేఱు కల్పన కొంతగావింప వలసె.*

క. *కావున నిపుడొక గతిఁ గృతి*
*గా విరచించెదను; దప్పుగాఁ జూడక నన్*
*గావుఁ డటంచును పెద్దల*
*సేవించెద నెల్ల పొద్దు చిత్తంబలరన్."*

ఈ యాశ్వాసమును ఆమె ప్రత్యేక కావ్యముగ పరిగణించినది. గురు, దైవంబుల దలంచినది. వరాహ, భవిష్యోత్తర పురాణములలో లేనిగాథ ఒకటి పద్మపురాణమున దొరకగా ఆ గాథను ఈ యాశ్వాసమున ఆమె చంపువుగ వ్రాసినది.

దీనికి 'వీరలక్ష్మీ విలాసము' అను నామమును పెద్దల యనుమతమున నిడితినని ఆమె యనుచున్నది.

తే.గీ. "భారతిని జిహ్వ యందుంచి నారసింహుఁ
డే విధంబునఁ బలికించు నా విధమున
బలికెదను; భాగవతులు నాబాలభాష
లం దసహ్యము లేక నెయ్యమున వినుఁడి!"

ఇట్లు ఈ యాశ్వాసమును ప్రత్యేక కావ్యముగ పరిగణించి, కృత్యాదిని పై విషయములు తెల్పి, ఆ మీద కథా కథనమునకు పూనుకొనినది.

ఆకాశపతి సుతయగు పద్మావతిని పెండ్లియై హరి పన్నగాచలమున నెలకొని యుండెను. ఎప్పుడు అతని వక్షమున వసించుచుండెడు లక్ష్మి యలిగి కొల్హాపురమునందుండెను. పెండ్లికి కుబేరుని చెంత తీసిన ఋణము తీర్చెడు ఉపాయము అతనికి ఏమియు తోచలేదు. అందుచేత అతడు అది యొక విధముగా నుండెను.

అది చూచి పద్మావతి యొకనాడు ఏకాంత సమయమున అతని వైరాగ్యమునకు కారణమడిగెను. అప్పుడు వేంకటేశ్వర స్వామి ఇట్లు చెప్పెను :

"చిద్రూపలక్ష్మి సద్రూపయై నన్నుఁ బొందినప్పటినుండి సర్వ ప్రపంచమునకు నేను కర్తనై యుంటిని. ఆమె నా యురఃస్థలమున ఉండుచు నన్ను గొప్ప చేసెను.

ఇట్లుండగా ఒకసారి భృగుమహర్షి వచ్చి, సిరియున్న నా యురముపై తన్నెను. అందుచేత లక్ష్మి నా మీద అలిగి, కరవీర పురమును చేరెను. ఆమెను వెదకుకొనుచు వచ్చి దారి తప్పి ఈ

కొండ మీద చింతచెట్టు క్రింద వెలసితిని. గొల్లవాని దెబ్బల, నీ సఖీజనుల వ్రేటుల నలగితిని. సిరిలేక యుండినవేళ నీతో నైన వివాహమునకు నాకు అప్పులయినవి. నీ తండ్రి, తమ్ములు ఇచ్చిన ధనముతో ఆ అప్పులు తీరలేదు. ఇక ఏమి చేయుట? అని చింత. నీవు ఏమైన ఆలోచన చెప్పగలవా?"

దానికి పద్మావతి యిట్లు బదులిడెను. "స్వామీ! మీకు ఆలోచన చెప్పగల సామర్థ్యము కలదానను కాను. సృష్టికి పూర్వమే మిమ్ము చేపట్టి, మిమ్ము ఇంత గొప్ప చేసిన లక్ష్మిని మీరు ఎడబాసి యుండుట న్యాయము కాదు. ఆమెను ఏవిధముననైన తోడ్కొని రండు. ఆమెకును, మీకును సేవ చేయుచుండెదను."

ఈ మాట హరికి నచ్చినది. అతడు లక్ష్మిని ప్రసన్నురాలిని చేసికొనుటకు తపము ప్రారంభించినాడు. తపము ఇరువది రెండేండ్లు సాగినది. లక్ష్మి ప్రసన్నురాలై తిరిగి హరి యురమున చేరును.

హరి యురమున వసియింప వచ్చిన లక్ష్మిని వెంగమాంబ వర్ణించిన తీరు కనుడు! విరక్త శీల చేసిన స్త్రీ వర్ణనమిది:-

సీ. "ఘలుఘల్లురని కాళ్ల గజ్జె, లందెలు మ్రోయ
మొలనూలి ఘంట లిమ్ముగ నటింపఁ,
జెలువగు బంగరంచుల నొప్పు తెల్లని
చీరకుచ్చులు చాల నిస్తు మీఱ,
రహినిఁ జందురు కావి ఱవికెలో బంగారు
గిండ్ల చందమునఁ బాలిండ్లు మెఱయ,

జారుకొప్పునఁబూలసరులు చిందులు ద్రొక్క,
ముంగురుల్ నుదుటిపై ముద్దుగుల్కఁ,
తే.గీ. గర్ణ కంఠాభరణ, కర కంకణములు,
వరశిరోభూషణంబులు, సురుచిరంబు
లైన సందిటిదండలు, హారములును
విలసితాంగములను చాల వెలుగుచుండ."

సీ. "భాసుర నాసికాభరణంబుతోఁ గూడి
బింబాధరము కాంతి పిక్కటిల్ల,
దిద్దిన కస్తూరి తిలకంబుతోఁ గూడి
నిటల తటద్యుతుల్ నివ్వటిల్ల,
నెలవంక బొమలును, నేత్రాంజనము సరి
గా సొగసై నీల కళల నీనఁ,
బరిమళ గంధ లేపనముతో నెనసి సత్
కుసుమ సౌరభము దిక్కులను నెఱయ,
తే.గీ. హంసగతి నొప్ప మథిత దుగ్ధాబ్ధినుండి
వెడలి మును వచ్చి హరిఁ జేరు విధముగాను
రమ్యతరమైన పద్మ సరస్సు వెడలి
శ్రీరమానతి పతి చెంతఁజేరి నిలిచె."

ఆ మీద హరికిని, సిరికిని నడచిన సంభాషణము చమత్కారముగ నుండును. "అప్పు తీర్చు ఉపాయము చెప్పు"మని హరి సతిని కోరును. 'ఋణము చేసినప్పుడు నన్ను అడిగితివా?' అని లక్ష్మి యనును. 'నా రెండవ వివాహమునకు నిన్ను అప్పు అడగటానికి బుద్ధి పుట్టినది కాదు' - అని స్వామి చెప్పును. 'ఇప్పటికే

వడ్డీ బళువైనది. ఇంకను బళువు కానీయనేల? వెంటనే చెల్లించి వేయు'మని లక్ష్మి కోరును. అప్పుడు స్వామి యిట్లు చెప్పును. 'కుబేరుని అప్పు ఇప్పుడు తీర్చ నక్కర లేదు. వడ్డీ మాత్రము నిర్ణయము ప్రకారము క్రమముగా ఇచ్చి వేయుచుందము. కలియుగాంతమున అప్పు అంతయు తీర్చివైచి వైకుంఠమునకు వెడలిపోవుదము.

అంతవఱకు ఈ శేషశైలమున ఉండి ప్రజలను రక్షింతము. ఇప్పుడే కుబేరుని అప్పు తీర్చి వేసితివేని, నేను ఇక్కడ నిరుద్యోగినై ఉండిపోవలసి వచ్చును."

ఆ పిమ్మట పద్మతీర్థ మహిమ తెలుపుటకు శుకమార్తాండ సంవాదము, ఛాయా శుకోత్పత్తి, వీరలక్ష్మి శుకాశ్రమము చేరియుండుట - మున్నగు గాథలు ఈ యాశ్వాసమున చేర్చబడినవి.

చివరన ప్రళయకాలమున వటపత్రశాయి యగు విష్ణువర్ణన మిట్లు కలదు :-

సీ. "పటుతరంగాహతిన్ వటపత్ర మటు నిటు
ఉయ్యాల నలె నూగుచుండగాను,
జిర జిర నెగిరెడు శీకర మాలిక
ఉయ్యాల చేరు లట్లొప్పగాను,
ఫేనంబు చుట్టు గప్పి విశాల మయ్యది
యుయ్యాల తెరవలె నుండగాను,
ధ్రువ మండలం బద్ధదూలంబు కైవడి
నుయ్యాల చేర్లతో నొఱయగాను,

తే.గీ. పరమపద కాంతులుప్పొంగి పద్మరాగ
ముఖ్యమణిజాలములరీతి, ముద్దుగుల్కు
చెండ్లవలెఁ జూడ్కి కెదురుగానుండ, దానిఁ
జూచుచును బాలుఁడాత్మలో జొక్కుచుండె."

ఈ యాశ్వాసమునందలి శైలి తెలియుటకు పైన ఉదాహరించిన పద్యములు చాలును. ఐనను మఱి రెండు, మూడు పద్యములు ఉదాహరించుకొందము:-

"శా.వీణ ల్మీటుచు పాడుచున్ గులుకుచున్ వింతల్ వినోదంబులున్
జాణ ల్చూపుచు నందుఁ దాము తమలోఁ జాపల్య భావోక్తులే
నాణెం బుప్పతిలంగ పల్కుచును శ్రీనారాయణస్వామినే
యేణాంకాస్యలు చూచి చూచి, తమలో హెచ్చైన మోహంబునన్.

శా. ఈ కాంతామణి నద్భుత క్రమముగా నీ రాజు పుట్టించినా;
డేకాలంబుననైన నిట్టి మహిమం బెందైన గన్గొంటిమే?
లోకాతీతుడుగాని, యీ పురుషు డీ లోకంబులో వాడుగా;
డేకాగ్రస్థితి నిట్లు నిల్వ మనుజుండెంతైనఁ దానోపునే?

చ. పరమ పతివ్రతామణివి భర్తను జిక్కులఁ బెట్టి చాలతాం
దర లొనరించి బాలకులు దాగుడుమూతల నాడు రీతిగాఁ
దిరుగుచునుండు చందము పతివ్రత కొప్పునె యేడనైన? నీ
వెఱుఁగని నీతులున్నవె? యిదేమి విచిత్రముపుట్టె నంగనా!"

ఈ యాశ్వాస రచనము నందలి కొన్ని పోలికలు (ఉపమానములు) కనుడు:-

నేరక చేయు పనికి గోపింపనొల్లక,
కొడుకు తప్పులు తండ్రి గాంచి రక్షించిన కరణి;
తైలవర్తి యందు జ్వాల వెలిగినట్లు;
పాలలో ఘృతంబు పైకి తేలిన చందంబున;

వట బీజంబునకు, వ్రీహి బీజంబునకు భూ
సంబంధం బొక్కటి యైనఁ గాని, వ్రీహి
పరిణామంబు షణ్మాసంబులును, వట
పరిణామంబు సహస్ర సంవత్సర పర్యంతంబు.

'వీరలక్ష్మీ విలాస'మను నామముగల ఈ యేకాశ్వాన కావ్యమున వెంగమాంబ ఒక దండకమును చేర్చినది. అంత్యాను ప్రాసలతో ఆ దండకము సొంకముగా నున్నది. తిలకింపుడు:-

"శ్రీమత్పరంధామ! జీవావళి స్తోమ!
శ్రీమానినీ లోల! శృంగార సల్లీల!
కందర్ప లావణ్య! కంజోద్భవాగణ్య!
షాడ్గుణ్య సంపన్న! సంరక్షితాపన్న!
సత్యవ్రతాచార! సాధువ్రజోద్ధార!
సారాంబుద శ్యామ! సంపూర్ణ సత్కామ!
వేదాంత సంచార! విశ్వంభరాధార!
శ్రీ వేంకటాద్రీశ! సత్చిత్ప్రకాశా!
పరాకాశ! లోకేశ! వాగీశ గౌరీశ

నాకేశ వంద్యాంఘ్రి పద్మద్వయా!
నిత్య సత్యా! ఉద్వయా! సద్దయా సాంద్ర!

యోగీంద్ర హృత్పద్మ భృంగా! శుభాంగా!
సుచారిత్ర! మిత్రాబ్జ నేత్రా! ధరిత్రీ కళత్రా!
మహోల్లాస! దాసప్రియా! శ్రీనివాసా!
మమున్ సత్కృపన్ జూడుమో తండ్రి!
తర్గొండ వాసా! నృసింహా! హృతాంహా!
నమస్తే నమస్తే నమస్తే నమః.

లక్ష్మీ వియోగవిచారమును తెలుపు ఘట్టమున వెంగమ్మ మిక్కిలి సులభశైలిని వాడినది. మచ్చునకు ఒక పద్యము చిత్తగింపుడు :-

ఆ.వె. "నిలిచి యున్నచోట నిలువ సహింపదు,
మఱచి యుందు ననిన మఱపురాదు;
కనుల గట్టినట్లుగా తోచుచున్నాడు,
మాటలాడ డిపుడు మౌని వలెను."

పైన ఉదాహరించిన దండకమున సంస్కృత పదములు నిండుగా వెండుకొని యుండి, ఆమె ఉభయ భాషా ప్రావీణ్యమునకు మంచి మచ్చుతునకగా ఉన్నవి. ఉభయ భాషల యందు సమముగా పదజాల పాండిత్యము కలిగి ఉండుటేకాక, సంస్కృతాంధ్రములందు సమముగా కవితా సామర్థ్యమును ప్రదర్శించినది ఈ యాంధ్ర విదుషీమణి!

సంస్కృతమున గ్రంథ రచనము కావించిన ఆంధ్ర స్త్రీలలో రామభద్రాంబ, మధురవాణి - అను ఇరువురు మాత్రమే తెనుగున చెదరుగా పద్యములు చెప్పినట్లు నిదర్శనములు కలవు.

ఆంధ్రమున గ్రంథ రచనము కావించిన వారిలో కృష్ణాజమ్మ సంస్కృతాంధ్ర కవితా సమర్థురాలుగా చెప్పబడుచున్నది. కాని, ఆమె రచనములు నేడు కానరాకున్నవి. రంగాజమ్మ తెనుగు కృతులలో కొన్ని చెదరుగా సంస్కృత శ్లోకములు కలవు. వెంగమాంబ రచియించిన వేంకటాచలమాహాత్మ్యమున సంస్కృత శ్లోకములు రెండు పుంజీల వఱకు ఉన్నవి. అగుటచే సంస్కృతాంధ్రము లందు సమముగా కవితా సామర్థ్యమును ప్రదర్శించిన ఆంధ్ర విదుషీమణులలో తరిగొండ వెంగమాంబ మేటియనుట.

ప్రాచీనాంధ్ర కవులలో నన్నయ, తిక్కన, మల్లికార్జున పండితారాధ్యుడు, పాలకురికి సోమనాథుడు, శ్రీనాథుడు, శ్రీకృష్ణ దేవరాయలు, రఘునాథ నాయకుడు, శిష్టు కృష్ణమూర్తి శాస్త్రి మున్నగువారు ఉభయ భాషా కవులుగా పలువురు కనిపించు చున్నారు. కవులది సంఖ్యా బాహుళ్యము. కవయిత్రులది వేళ్లపై లెక్కింపనగు అల్పసంఖ్య. ఆ కొద్ది మంది కవయిత్రులలోనే మహా కవుల స్థాయిని అందుకొన్న అగ్రేసరురాలు వెంగమ్మ.

వేంకటాచలమాహాత్మ్యము ఆంధ్ర సారస్వతమున ఆ రీతి కావ్యములందు ఒక విశిష్టస్థానమును పొందుచున్నది. ఆంధ్రమున స్థల మాహాత్మ్యములు పలువురు రచించి యున్నారు. అయితే వెంగమాంబవలె ఆ స్థలమునందే యుండి ఆ స్థల మాహాత్మ్యమును రచియించినవారు మిక్కిలి తక్కువ. ప్రౌఢ కవిత్వ విషయమున తెనాలి రామకృష్ణుని పాండురంగ మాహాత్మ్యముతో కాని, ప్రసాద కవిత్వ విషయమున కవి ధూర్జటి శ్రీకాళహస్తి మాహాత్మ్యముతో కాని తరిగొండ వెంగమాంబ

వేంకటాచల మాహాత్మ్యము ఈడు రాకపోయినను, ఆంధ్ర సారస్వతము నందలి స్థలమాహాత్మ్యములలో తరిగొండ వెంగమాంబ వేంకటాచల మాహాత్మ్యమునకు సముచిత స్థానము కలదు.

వేంకటాచల మాహాత్మ్యమును తెలుగున పద్య కావ్యములుగా పలువురు పురుష కవులు రచియించియున్నారు. అయితే, వానిలో వేనికికాని తరిగొండ వెంగమాంబ వేంకటాచల మాహాత్మ్యమునకు గల ప్రచారము లేదు. కొంచెము ఇంచు మించుగా వెంగమాంబకు సమకాలమువాడనదగిన శిష్టు కృష్ణమూర్తి శాస్త్రి ఒక వేంకటాచల మాహాత్మ్యమును రచించినాడు. అది క్రీస్తు శకము 1858 సం॥లో అచ్చుపడినది. ఇప్పటికి నూటేండ్లయినది.

శాస్త్రి వేంకటాచల మాహాత్మ్యము వెంగమాంబ వేంకటాచల మాహాత్మ్యమంత విపుల మైనదికాదు. వరాహ పురాణాంతర్గతమగు వేంకటాచల మాహాత్మ్యగాథను మాత్రమే అతడు మూడాశ్వాసముల ప్రబంధముగ రచియించినాడు.

వెంగమ్మ వ్రాసిన వేంకటాచలమాహాత్మ్యమును ఇద్దరు ముగ్గురు ప్రచురణ కర్తలు ప్రచురించినట్లున్నది. తిరుమలలోని శ్రీ వేంకటేశ్వర బుక్కు డిపో ప్రొప్రయిటరు శ్రీ నెటాళం సుబ్రహ్మణ్యము ప్రచురించినది కూడ ఈ గ్రంథ రచన సందర్భమున పరిశీలితమైనది.

## 3ప్రముఖుల అభిప్రాయములు

ఈ సుప్రసిద్ధ రచయిత్రి కథాకమామీషు ముగించుటకు ముందు ముగ్గురు అక్షర ముఖులు ఈమెను గుఱించి వ్రాసిన వ్రాతలు కొన్ని ఉద్ధారితములగుచున్నవి:-

"తరిగొండ వెంగమాంబ ఆంధ్ర స్త్రీ జాతికి మేలుబంతి. గార్గి, మైత్రేయి మున్నగు ఉపనిషత్ స్త్రీల తరగతికి చెందిన మేటి ఆంధ్ర యోగిని ఆమె. ఆమె జీవితము ఆంధ్రులకు పారమార్థ జీవనమున ఆదర్శప్రాయమైనది."

- వంగవాల బాల కృష్ణమూర్తి.

"వెంగమ్మ రచించిన గ్రంథములు తఱచు వేదాంత పరములు. శైలి కడు మృదువుగను, హృదయంగమముగను నుండును. అక్కడక్కడ నీమె వ్యాకరణ నియమముల నుల్లంఘించినది. సంభాషణశైలికి వీలైనంత దగ్గరగ వ్రాయు నుద్దేశముతో నీమె యట్లొనర్చి యుండును.

కఠిన వేదాంత భావములను గూడ వెంగమాంబ కడు మృదువుగాను, సులభార్థబోధకముగను వ్రాసినది. ఔచిత్యము నందును, భక్తి వైరాగ్యములందును తరిగొండ వెంగమాంబ మన ప్రాచీన కవులకు తీసిపోని యుత్తమ కవయిత్రి.

భక్తి యోగ క్రమమున నాంధ్ర భాషలోఁ గావ్యము వ్రాయుట తన యాశయమని వెంగమాంబ ప్రకటించినది. సంస్కృత వరాహ, భవిష్యోత్తర, పద్మ పురాణములలో వచ్చిన వేంకటాచల మాహాత్మ్య ప్రశంసలు మూలముగా గొని యీమె తన ప్రబంధమును వ్రాసినది. వేంకటాద్రి ప్రభావము నుగ్గడించుటకు చెప్పబడిన మాధవుడను బ్రాహ్మణ యువకుని కథ హృదయంగమముగనున్నది. క్షేత్రమాహాత్మ్యమును ప్రశంసించుటకై పురాణములు విచిత్ర కథలను కల్పించుచుండును. సత్కులీనుడైన బ్రాహ్మణ కుమారుడుండును. అతడు యౌవనమదముచే చేయరాని పాపములు, జార

చోరత్వాదులు చేయును. అంతటి పాపములు చేసియు, జీవితాంతమం దొకపుణ్య క్షేత్రమును సందర్శింప, తత్ప్రభావముచే పాప విముక్తుడగును. క్షేత్ర మాహాత్మ్య కథ లన్నియు నీరీతిగనే యుండును. మాధవుడను విప్రుడును ఇట్టివాడే. ఈ సందర్భములో పురుషులైన కవులైనచో మాధవుని శృంగార విహారములను పచ్చి పచ్చిగా వర్ణించి యుందురు. మాధవుడు చండాల కన్యను కామించెను. తరిగొండ వెంగమాంబ ఈ కథా భాగమును గొప్ప నేర్పుతోను, ఔచితీపరిజ్ఞానముతోను వ్రాసి, పురుషకవులకు చక్కని త్రోవ చూపినది.

వేంకటాచలమాహాత్మ్యములోని పద్మావతీ శ్రీనివాసుల వివాహ వృత్తాంత మెంతయు రమణీయముగ నున్నది. వేంకటాచల దేవుడగు శ్రీనివాసుడు నారాయణవన పుర రాజ కుమార్తెయైన పద్మావతిని ప్రేమించును. శ్రీనివాసుడు మాయా మానుష లీలను విడంబించును. ప్రథమ సందర్శనమునందే 'తనను వరింపు'మని శ్రీనివాసుడు పద్మావతిని నిర్బంధించును. ధైర్యవతియైన పద్మావతి రాచబిడ్డ కనుక యాతని ప్రార్థనలకు లొంగక, శ్రీనివాసుని రాళ్లతో కొట్టించి తరిమి వేయును. శ్రీనివాసు డెఱుకసాని వేషముతో రాజాంతఃపురమునకు బోవుట కడు సహజముగా వర్ణింపబడినది. ఎఱుకసాని మాటలను వెంగమాంబ చక్కగా వివరించినది. శ్రీనివాసునకును ఆయన ప్రథమ భార్య యగు లక్ష్మీదేవికిని గలిగిన వివాదము, వారొండొరుల నెడబాసి యొంటరితనము ననుభవించుట- మొదలగు కథ యంతయు జాలి గొల్పుచు, మిక్కిలి హృద్యముగా నున్నది. స్త్రీ హృదయాంత రాళమందలి సున్నిత భావములను, స్త్రీల యాత్మాభిమానమును,

ఆత్మ గోపనమును వెంగమాంబ గొప్ప సమర్థతతోను, సరసము గను చిత్రించినది. శ్రీనివాసుని ద్వితీయవివాహ సందర్భమున లక్ష్మీదేవి యనుభవించిన విచిత్ర బాధాకరమైన భావములను వెంగమాంబ నిపుణతతో వర్ణించినది."

**- శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనము, ఎం.ఏ.**

**ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహము - మొదటి భాగము**

"మీరాబాయి విశిష్టాద్వైత మతము నవలంబించినట్టి దనియు, తరిగొండ వెంగమాంబ యద్వైతమతము నవలంబించి నట్టిదనియు వారి చరిత్రను బట్టి తెలియవచ్చుచున్నది.

ఇరువురును భిన్న కాలములకు, భిన్నమతములకు, భిన్న దేశములకు, భిన్న వర్ణములకు జెందినవారయ్యును, జీవితము లందు పెక్కు సాదృశ్యములు గలిగి, భక్తలోక శిరోరత్నములై విరాజిల్లుచున్నారు.

గేయ కావ్య నిర్మాత్రి మీరాబాయి; పద్య కావ్య నిర్మాత్రి వెంగమాంబ.

మీరా గాయకురాలు. వెంగమాంబ తన కావ్యమునకు వలసిన శృంగార వర్ణనములను శ్రీకృష్ణునిచేతనే పాడిపించిన రసజ్ఞురాలు.

ఉభయులును బాల్య వైధవ్య దుఃఖమున భాగస్వామినులే. ఉభయులును గష్టపరంపర సమానముగ బంచుకొన్నవారే.

తనకు సంభవించిన కష్టనష్టములు సంతోషముతో ననుభవించి, సంసారమునందు విరక్తినొంది, యుభయులును

శ్రీకృష్ణ దర్శనానందవారాశి నోలలాడి తన్మయలైన వారలే! ఉభయులును నామపారాయణ పరాయణలే! శ్రీకృష్ణు నిరువురును గొంతెత్తి పిలిచినవారే!

భారత భక్త దహరాకాశమున జ్యోత్స్నయును, రశ్మియును బ్రసరింపజేసిన రే వెలుగును, వే వెలుగును మీరా వెంగమాంబలు!!

ఇరువురును బరమ ధర్మావలంబనార్థముగ సంఘ నియమముల నుల్లంఘించిన స్వాతంత్ర్య పరాయణలే!

ఇరువురును సర్వకాల సర్వావస్థలయందును భారతీయ మహిళా లోకమున కాదర్శప్రాయలే!

ఉభయులును స్త్రీలకే కాక, పురుషులకు గూడ నీతిఁ గఱపు పవిత్ర జీవిత చరిత్రలు కలవారే!

ఉభయులును పాతివ్రత్య మాహాత్మ్యమును విశ్వమున జిరస్థాయిగా నాటి పోయినవారే!

చతుర్విధ పురుషార్థముల యందలి మోక్షేచ్ఛయే మానవ ధర్మమని నిరూపించిన లోకోత్తర చరిత్ర లీ వ్యక్తిద్వయము!

వీరి చరిత్రములు సత్య పరాక్రమ ధురీణములు.

మీరాకును, వెంగమాంబకును బ్రపంచము నెడలను, మానవ జీవితము నెడలను నభిప్రాయములు సమానములే. జగత్తు మిథ్య యనియు, పరమాత్మయే సత్యమనియు, శరీరధారు లెల్లరును దుదకు మంటిపాలు కాక తీరదనియు, కావున భోగలాలసత విడిచి, పునరావృత్తి రహిత స్థితికై యాత్మజ్ఞాన సంపాదన మొనరించుటే కర్తవ్యమనియు, సర్వమును బరమేశ్వరార్పణ మొనరించి, భగవద్ధ్యానము జేయుచు గర్మ

బంధమున నుండి విడివడ వలయుననియు, శ్రీకృష్ణ డొక్కడే ప్రభుడనియు, నా ప్రభుని జేరు నెడల సంఘము వెట్టు నడ్డంకులనెల్ల సహనముతో ప్రతిఘటించి తీరవలెననియు, సూర్యుడును రశ్మియునుబలె దానును బరమేశ్వరుడును నుంటిమనియు, భ్రాంతి జనకమైన ద్వైత భావము రహితమై, యద్వైతమే నుండును గావున బ్రహ్మత్వమును తాను బ్రాపించి తీరుదుననియు మీరాబాయి గేయములలో నాలపించియున్నది. ఇదే విధముగ వెంగమాంబ పద్యధోరణి నుపన్యసించియున్నది.


ఆంధ్ర సాహిత్య రత్నాకర గర్భమున మీరాబాయి యన దగినది వెంగమాంబ.

- శ్రీ వడ్డాది సీతారామాంజనేయ కవి.
భారతి బహుధాన్య జ్యేష్ఠము

"అనువుగ వేంకటాచల మహత్త్వము కావ్యము వ్రాసి, పెద్దలె
ల్లను బొగడంగ శాస్త్రతతులన్ గల తత్త్వము నెల్ల నేర్పునన్
జనులకు దెల్పగా ద్విపద శైలిని వ్రాసిన శ్రీనివాస భ
క్తి నిరత వెంగమాంబిక మదింగొని యాడుదు భక్తి తోడుతన్.

- కావ్య పురాణ తీర్థ
జనమంచి వేంకట సుబ్రహ్మణ్య శర్మ.





T.T.D. Religious Publications Series No. : 819
Price : Rs.




## మహా నిర్యాణము :-

క్రీ.శ. **1817** ఈశ్వర-శ్రావణ శుద్ధ నవమినాడు - ఈ మహాజ్ఞాని,
మహాయోగిని, భక్తకవయిత్రి, తిరుమల పుణ్యక్షేత్రంలో
శ్రీవేంకటేశ్వరుణ్ణి స్మరిస్తూ, సజీవసమాధి చెందింది.

Published by Sri I.Y.R. Krishna Rao, IAS., Executive Officer,
Tirumala Tirupati Devasthanams and Printed at T.T.D.Press, Tirupati.